తాతలనాటి కథలు
రూ॥ 70/-
పేజీలు: 64




నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



శ్రమజీవుల ప్రజా రిపబ్లిక్ ఉద్యమం

పని గంటల పెంపునకు పెట్టుబడిదారుల ఒత్తిడి

నాది 'ఇండియన్.. డిఎన్ఎ'నే

లోపలి పేజీల్లో



సంపుటి 27, సంచిక: 219 | మంగళవారం | 28-01-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00





## తొలి రోజు రూ.569 కోట్లు

- 4,41,911 మందికి రైతు భరోసా
- 18,180 మంది వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా
- 72 వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- 15,414 మందికి కొత్త రేషన్ కార్డులు

ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ప్రజాసంక్షేమంలో మరో ముందడుగు వేసింది. ఒకే రోజు 4 సంక్షేమ పథకాలను విజయవంతంగా ప్రారంభించటం ద్వారా ప్రతిపక్షాలకు షాక్ ఇవ్వడమే కాకుండా సరికొత్త రికార్డును నెలకొల్పింది. గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపిక చేసిన 563 గ్రామాల్లో ఈ 4పథకాలను ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా రైతు భరోసా కింద 4,41,911 మంది రైతులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 18,180 మంది వ్యవసాయ కూలీలకు, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా 72,000 మంది తరువాయి 2లో

దళిత, గిరిజన, అగ్రకుల పేదలను మళ్ళీ

# బానిసగా మార్చారు

## రాజ్యాంగం అంతం చేయాలని బిజెపి – ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయి

- అదే జరిగితే పేదప్రజలకు ఏమీ మిగలదు
- మధ్యప్రదేశ్ ర్యాలీలో రాహుల్ గాంధీ హెచ్చరిక



**ఎమ్హౌ :** దేశంలో దళిత,గిరిజన, అగ్రకుల పేద ప్రజలను బిజెపి ప్రభుత్వం తిరిగి బానిసలుగా మార్చిందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. రాజ్యాంగాన్ని అంతం చేయాలని బిజెపి–ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయనీ, రాజ్యాంగం అంతమైననాడు ఇక దేశంలో పేద ప్రజలకు మిగిలేదేమీ ఉండదని హెచ్చరించారు. దేశంలోని వనరులన్నింటినీ అదానీ, అంబానీలకు ధారాదత్తం చేశారని పేర్కొంటూ దేశ వనరులన్నీ అదానీకి కట్టబెట్టాలని రాజ్యాంగంలో ఎక్కడ ఉందని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు.దేశ ప్రజలంతా సమానమేనని, కలలు కనే హక్కు, వాటిని సాకారం చేసుకునే హక్కు దేశ పౌరులు అందరికీ ఉందని రాజ్యాంగం స్పష్టం చేసిందన్నారు. దేశంలో దళితులు, వెనుకబడిన కులాలు, గిరిజనులు, ఇతర అగ్రకుల కులాలకు చెందిన ప్రజలను శారీరక శ్రమచేసే పనులు చేసుకునేవారిగా మార్చడం లేదా గొంతెత్తి ప్రశ్నించిన ఆ వర్గీయులను జైలుకు పంపడమే అధికార బిజెపి పాలకుల 21వ శతాబ్ద దార్శనిక లక్ష్యంగా మారిందని రాహుల్‌గాంధీ విమర్శించారు. "మీ జీవితం నాశనం అవుతుంటే మీరు మౌనంగా చూస్తూ ఉండిపోవడం నాకు ఆశర్యం కలిగిస్తోంది" అన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలో అంబేద్కర్ జన్మించిన ఎమ్హౌ (అంబేద్కర్ నగర్) పట్టణంలో సోమవారం జరిగిన "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" ర్యాలీలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు తదితరులు పాల్గొన్న ఈ ర్యాలీకి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ప్రతిని ఒక చేత్తో పట్టుకుని ఆయన ర్యాలీలో ప్రసంగించారు. దేశంలో ఇప్పుడు సైద్ధాంతిక పోరాటం జరుగుతోంది, ఒకవైపు రాజ్యాంగాన్ని విశ్వసించి దానికోసం పోరాటం చేస్తున్న కాంగ్రెస్‌పార్టీకీ, మరోవైపు అంబేద్కర్, మహాత్మాగాంధీల రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉంటూ దేశాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నం చేస్తున్న బిజెపి–ఆర్ఎస్ఎస్‌కు మధ్య ఈ సైద్ధాంతిక యుద్ధం జరుగుతోంది, రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం మాత్రమే కాదు, వేల సంవత్సరాలనాటి భారతీయ ఆలోచనలను రాజ్యాంగం ప్రతిబింబిస్తుంది" అన్నారు. సామాజిక న్యాయానికే కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉందనీ, బిజెపి–ఆర్ఎస్ఎస్ రెండూ బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానిస్తున్నాయని విమర్శించారు. గడచిన కొద్దిరోజులుగా రాహుల్‌గాంధీ అనారోగ్యంతో ఉన్నారు. గతవారం కర్ణాటక బెలగవిలో జరిగిన జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ పేరుతో కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీలలో ఆయన పాల్గొనలేకపోయారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా ఆయన పాల్గొనలేకపోయారు.

### మోదీ వచ్చాకే స్వాతంత్ర్యం వచ్చిందా?

"అయోధ్యలో రామాలయ నిర్మాణం తర్వాతే భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం లభించింది" అని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను రాహుల్‌గాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. మోహన్ భగవత్‌కు భారత తరువాయి 2లో



వక్ఫ్ బిల్లులో ప్రతిపక్షాల

# సవరణల తిరస్కరణ

## అధికార బిజెపి కూటమి ఎంపిల ప్రతిపాదనలకు జెపిసి ఆమోదం

ప్రజాస్వామ్య ప్రక్రియను కూలదోశారని విపక్షాల విమర్శలు

బిల్లును పార్లమెంటు ఆమోదిస్తే కోర్టుకెళతామని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలను వక్ఫ్ బిల్లును పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) తిరస్కరించింది. ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న అధికార బిజెపి కూటమి ఎంపిలు చేసిన ప్రతిపాదనలను జెపిసి సమ్మతించింది. బిజెపి ఎంపి జగదాంబికాపాల్ అధ్యక్షతనగల ఈ సంయుక్త పార్లమెంటరీ కమిటీ సోమవారంనాడు సమావేశమైంది. ఈ సమావేశం తీవ్ర గందరగోళం, వాగ్వాదాలు, ఉద్రిక్తతలమధ్య జరిగింది. బిజెపి నాయకత్వానగల జెపిసి ప్రజాస్వామ్య ప్రక్రియను కూలదోసిందని ప్రతిపక్ష సభ్యులు తీవ్రస్థాయిలో విమర్శించారు. జెపిసిలో ఉన్న ప్రతిపక్ష సభ్యులు ఈ వక్ఫ్ సవరణబిల్లులో ఉన్న మొత్తం 44 క్లాజులకు ప్రతిపాదించిన సవరణలను కమిటీ తిరస్కరించింది. 14 క్లాజులకు అధికార కూటమి సభ్యులు చేసిన ప్రతిపాదనలను ఆమోదించింది. ఈ బిల్లుకు సంబంధించి జెపిసి చేసిన సవరణలు అన్నీ ముందుగానే బయట సిద్ధం చేసి జెపిసిపేరుతో చలామణీ చేశారని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. తాము చెప్పే విషయాలు వినకుండా, తమ వాదన వినకుండా జెపిసి అధ్యక్షుడు పరిశీలనకు వచ్చిన వక్ఫ్ బిల్లుకు సవరణలను ఆమోదించినట్లు తరువాయి 2లో





## ఎసిబికి చిక్కిన అధికారులు

ఖమ్మం జిల్లాలో రూ.2,500, మెదక్ జిల్లాలో రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వినయ్, కృష్ణ

ప్రజాపక్షం/సత్తుపల్లి/మనోహరాబాద్

రాష్ట్రంలో లంచాల పరంపర కొనసాగుతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ముడుపులు ముట్టనిదే అధికారులు పనులు చేయడం లేదు పలువురు అధికారులు ఎసిబికి చిక్కినప్పటికీ లంచాలు తీసుకోవడం మానడం లేదు దీంతో నిత్యం ఎక్కడో ఒక చోట రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడుతూనే ఉన్నారు. తాజాగా ఖమ్మం, మెదక్ జిల్లాలో ఇద్దరు అధికారులు ఎసిబికి చిక్కారు వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలలో పేరు చేర్చాలంటే లంచం కావాల్సిందేనని ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీలో 23వ వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న నల్లంటి వినోద్ డిమాండ్ చేశాడు. దీంతో లంచం ఇచ్చుకోలేని బాధితులు ఈ నెల 24న ఖమ్మం ఎసిబి అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో సోమవారం వల పన్ని పట్టణంలోని పాత సెంటర్‌లో గల తరువాయి 2లో

# టిజిఎస్ ఆర్‌టిసిలో 'సమ్మె సైరన్'

యాజమాన్యానికి నోటీసు ఇచ్చిన ఆర్‌టిసి జెఎసి

సర్కార్ స్పందించకుంటే ఫిబ్రవరి 9 నుంచి సమ్మెబాట : ఈదురు వెంకన్న



ప్రజాపక్షం/హైదరాబాద్

టిజిఎస్ ఆర్‌టిసిలో సమ్మె సైరన్ మోగింది. సంస్థ యాజమాన్యానికి ఆర్‌టిసి జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) కార్మిక సంఘాలు సమ్మె నోటీసులను ఇచ్చాయి. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చక పోతే ఫిబ్రవరి 9వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లుతామని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి వెల్లడించింది. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో అధికారులకు టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసును అందించారు. ఆర్‌టిసి ఎం.డి. సజ్జనార్ సెలవులపై ఉండటంతో బస్ భవన్‌లో ఇడి మునిశేఖర్‌కు నోటీసు ఇచ్చాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని జెఎసి కార్మిక సంఘాలు నోటీసులో స్పష్టం చేశాయి. ప్రభుత్వంలో ఆర్‌టిసి ఉద్యోగుల విలీనం, 2 పిఆర్‌సిల అమలు చేయాలనే అంశం, కండక్టర్, డ్రైవర్ల ఉద్యోగ భద్రత, ఎలక్ట్రిక్ బస్సులు ప్రభుత్వమే ఆర్‌టిసికి కొని ఇవ్వాలనే జెఎసి ప్రధాన డిమాండ్‌లుగా ఉన్నాయి. అలాగే సిసిఎస్, పిఎఫ్ డబ్బులు రూ.2,700 కోట్లు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇవ్వాలని జెఎసి డిమాండ్ చేస్తోంది. వీటిని నెరవేర్చకుంటే ఫిబ్రవరి 9వ తేదీ నుంచి తరువాయి 12లో




వర్గీకరణను మాలలు

# అడ్డుకుంటున్నారు!

ఎప్పటికీ కండువా మార్చను, ఏ రాజకీయ పార్టీలో చేరను

టియుడబ్ల్యుజె 'మీట్ ది ప్రెస్'లో మంద కృష్ణ మాదిగ

ప్రజాపక్షం/హైదరాబాద్

షెడ్యూల్ కులాల (ఎస్‌సి) వర్గీకరణను అమలు చేయకుండా కాంగ్రెస్‌లోని మాల సామాజికవర్గం ప్రజాప్రతినిధులు అడ్డుకుంటున్నారని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీకి ఎంపికైన మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్‌సి వర్గీకరణకు అనుకూలమని ప్రకటించారని, దీనిని గద్వాల్ సభలో రాహుల్ గాంధీ ప్రకటించారని, కాంగ్రెస్ వర్కింగ్ తరువాయి 2లో




ఎఎన్ఎం పోస్టులు

# పెంచాల్సిందే

- 18 సంవత్సరాలు పని చేయించుకుని వట్టి చేతులతో పంపిస్తారా?
- రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలి
- రెండవ ఎఎన్ఎంల ధర్నాలో సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) పరీక్ష నోటిఫికేషన్‌కు అనుగుణంగా మరిన్ని పోస్టులు పెంచాల్సిందేనని, రెండవ ఎఎన్ఎంలు రెగ్యులర్ అయ్యే అవకాశమున్న ఖాళీలను గుర్తించి, భర్తీ చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టుల సంఖ్యను పెంచడంతో పాటు పరీక్షకు అర్హతలేని వారికి రూ.10 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్ తోపాటు 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎఎన్ఎంల పోస్టుల సంఖ్య పెంచడంతోపాటు వయోపరిమతి దాటిని వారికి న్యాయబద్ధమైన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేస్తూ రెండవ ఎఎన్ఎంలు ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఎఎన్ఎంలతో పని చేయించుకున్న ప్రభుత్వాలు చివరకు రిటైర్‌మెంట్ సమయంలో వారిని వట్టి చేతులతో ఇంటికి పంపించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. నూతన ఆర్థిక విధానాలతో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వంటి పేర్లతో ఉద్యోగాలను సృష్టించి అరకొర జీతాలు ఇస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వైపు ఉద్యోగాన్ని వదులుకోలేక మరోవైపు చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని పోషించలేక కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2021వ సంవత్సరంలో పిఆర్‌సి అమలులోకి వస్తే ఇప్పటి వరకు బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండవ ఎఎన్ఎంలు తమను బేషరగా రెగ్యులర్ చేయాలని పోరాటం చేశారని, అది సాధ్యంకాదని అప్పటి ప్రభుత్వం తేల్చి చెప్పిన కారణంగా కనీసం 100 శాతం పూర్తి వేతనాలనైనా ఇవ్వాలని తాము కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ తర్వాత కార్మిక నాయకులతో జరిగిన చర్చల్లో భాగంగా గ్రాస్ తరువాయి 12లో



## ఉత్తరాఖండ్‌లో అమల్లోకి యుసిసి

దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచిన ఉత్తరాఖండ్

పోర్టల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి ధామి

**డెహ్రాడూన్ :** ఉత్తరాఖండ్‌లో సోమవారం నుంచి ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫాం సివిల్ కోడ్ (యుసిసి) అమల్లోకి వచ్చింది. దీంతో దేశంలో యుసిసిని అమలు చేసిన తొలి రాష్ట్రంగా బిజెపి పాలిత ఉత్తరాఖండ్ నిలిచింది. 2022 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉత్తరాఖండ్‌లో యుసిసిని అమలు చేస్తామని కాషాయపార్టీ హామీనిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం యుసిసి అమల్లోకి తెస్తూ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నోటిఫికేషన్ జారీ చేశారు. దాని అమలు నిబంధనావళిని విడుదల చేశారు. అదే విధంగా వివాహాలు, విడాకులు, సహజీవనానికి సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేస్తూ రూపొందించిన పోర్టల్‌ను కూడా ప్రారంభించారు. 'ముఖ్య సేవక్ సదన్'గా పిలిచుకునే ధామి అధికారిక నివాసంలోని ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ధామి మంత్రివర్గ సహచరులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ అన్ని మతాల్లోని పౌరులందరికీ తరువాయి 12లో

యుజిసి మార్గదర్శకాలను

# వ్యతిరేకిస్తున్నాం

## తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్ల (విసి) నియామక విషయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) మార్గదర్శకాలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని, రాష్ట్ర విశ్వవిద్యాలయాలను దెబ్బతీసేలా కేంద్ర నిర్ణయాలు ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. యుజిసి మార్గదర్శకాలను తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్లు ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, తరువాయి 2లో

ఆహార పదార్థాల సరఫరాను

## కేంద్రీకృతం చేయాలి



- అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలలోనూ ఒకే మెనూ
- రాష్ట్ర ప్రభుత్వానికి పలు సిఫార్సుల నివేదికను అందజేసిన తెలంగాణ విద్యా కమిషన్

12

## 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'పై హైకోర్టులో పిల్

**హైదరాబాద్ :** ప్రభుత్వ పథకం 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'పై హైకోర్టులో పిల్ దాఖలైంది. నారాయణపేటకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. భూమి లేని రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు చెల్లించేలా ప్రభుత్వం పథకం రూపొందించిందని, పట్టణ (మున్సిపాలిటీల పరిధి) రైతు కూలీలకు మాత్రం డబ్బులు ఇవ్వడం లేదని శ్రీనివాస్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు హాజరయ్యారు. రాష్ట్రంలోని 129 మున్సిపాలిటీల్లో మొత్తంగా 8 లక్షల మందికి పైగా రైతు కూలీలు ఉన్నారని పిటిషనర్ గవినోళ్ల శ్రీనివాస్ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. గ్రామాల్లోని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చి మున్సిపాలిటీ ల్లోని వారికి ఇవ్వకపోవడం ఏమాత్రం సరికాదన్నారు. రైతు కూలీలు అందరూ సమానమేనని, ఎక్కడ ఉన్నా అందరూ కూలీలే అని పేర్కొన్నారు. కేవలం గ్రామాల్లోని రైతు కూలీలకే పథకం వర్తింపజేయడం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ అన్నారు. ఈ పిటి షన్‌పై నాలుగు వారాల్లో తుది నిర్ణయం వెల్లడించాలని ప్రభుత్వంను హైకోర్టు ఆదేశించింది.

# వేలాదిమంది పాలస్తీనియన్లు కాలినడకన ఇళ్ళకు..

## యెహుద్‌సహా నేడు ఆరుగురు బందీలు విడుదల



**నెట్జారిమ్ కారిడార్ :** ఉత్తరగాజాలోకి పాలస్తీనియన్లను ప్రవేశించనీయకుండా నెట్జారిమ్ కారిడార్‌వద్ద అడ్డుకున్న ఇజ్రాయెల్ సైన్యాలు తమ పట్టు సడలించడంతో పాలస్తినా ప్రజలు ఊరిపి పీల్చుకున్నారు. యెహుద్ (28) సహా ఆరుగురు బందీలను మంగళవారంనాడు విడుదల చేసేందుకు హమాస్ అంగీకరించింది. సోమవారంనాడు వేలాదిమంది పాలస్తినా ప్రజలు ఉత్తరగాజాలోకి కాలినడకన వెళుతున్నారు. శిథిలమైన తమ తమ ఇళ్ళకు వెళ్ళేందుకు ఎంతో ఆత్ర పడుతున్నారు. ఇలా వెళుతున్నవారిలో ఇంజనీర్లు, చిరు వ్యాపారులు,బార్బర్లు, సర్వం కోల్పోయిన ఒంటరి మహిళలూ ఉన్నారు. బిడ్డలను చంకనవేసుకుని, సామాగ్రి మోసుకుంటూ కాలినడకన ప్రయాణం చేస్తున్నారు. ఎంట్రీ పాయింట్ వద్ద ఇజ్రాయెల్ సైన్యం ప్రతి 40 నిమిషాలకు 20 వాహనాలను మాత్రమే ఉత్తరగాజాలోకి వెళ్ళేమార్గంలోకి అనుమతిస్తున్నది. దీంతో 2023 అక్టోబరు 7న గాజాలో యుద్ధం మొదలయ్యాక పారిపోయిన ప్రజలు కోటి ఆశలతో ఇళ్ళకు తిరుగుముఖంపట్టిన ఈ ఘట్టం చరిత్రలో నిలిచిపోనున్నది. మొత్తం 20 లక్షలమంది పాలస్తీనియన్లు యుద్ధం వల్ల ఇళ్ళుకోల్పోయి పొరుగుదేశాల్లో తలదాచుకునేందుకు వెళ్ళారు. ఇజ్రాయెల్‌కు చెందిన మహిళ ఆర్బెల్ యెహుద్ (28) తో సహా మొత్తం ఆరుగురు బందీలను రాబోయే శుక్రవారంలోపే విడుదల చేసేందుకు హమాస్ ఉగ్రవాద సంస్థ అంగీకరించడంతో ఇజ్రాయెల్ సైన్యం తన పట్టు సడలించి పాలస్తీనియన్లను ఉత్తర గాజాలోకి అనుమతించింది. నెట్జారిమ్ కారిడార్ నుండి లోనికి ప్రవేశించే మార్గాలను ఇజ్రాయెల్ సైన్యం తెరవడంతో వేలాదిమంది కాలినడకన, ద్విచక్రవాహనాలపైన, కార్లపైన వెళుతున్నారు. వేలాదిమంది కాలినడకనే వెళుతూ ఉండటంతో కార్లలో వెళ్ళేవారికి ఉత్తరగాజాలో ఇళ్ళకు వెళ్ళేందుకు కొన్ని రోజులు వ్యవధిపట్టే అవకాశాలున్నాయి. జనవరి 19న ఇజ్రాయెల్ –హమాస్ మధ్య గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలు ప్రారంభమైన తర్వాత కూడా వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఐనప్పటికీ రెండు విడతలుగా బందీలు, ఖైదీల పరస్పర మార్పిడి విజయవంతంగానే పూర్తయింది. ఇప్పుడు మూడోవిడత ఆరుగురు బందీలను హమాస్ అప్పగించేందుకు సిద్ధపడింది. ఇదిలా ఉండగా జోర్డాన్, ఈజిప్టు సహా అరబ్ దేశాలు పాలస్తినా శరణార్థులకు గాజాను శుభ్రంచేసేదాకా ఆశ్రయం ఇవ్వాలని ట్రంప్ చేసిన ప్రతిపాదనపై దుమారం చెలరేగింది. పాలస్తినా స్వాతంత్ర్యాన్ని అమెరికా తిరస్కరిస్తోందని హమాస్ మండిపడింది. తమ మాతృభూమిని నిలబెట్టుకుంటామని ప్రతిజ్ఞ చేసింది.

ప్రపంచం

# దక్షిణకొరియా విమాన ప్రమాదం పక్షివల్లే!



**సియోల్ :** దక్షిణ కొరియాలో జరిగిన విమాన ప్రమాదంపై మిస్టరీ దాదాపు వీడిపోయింది. పక్షి ఢీకొనడంవల్లనే విమాన ప్రమాదం జరిగిందని ఒక క్లారిటీ వచ్చింది. విమాన అవశేషాలను పరిశీలించినప్పుడు పంఖారెక్కల్లో పక్షి ఈకల అవశేషాలు దర్యాప్తు అధికారులకు కనిపించాయి. పక్షి రక్తం మరకలు కూడా అవశేషాల్లో కనిపించాయి. సైబీరియాలో గుడ్లు పొదిగేందుకు ఉన్న అత్యంత అనువైన వాతావరణ ప్రాంతం నుండి కొరియాకు తిరిగి వస్తున్న పక్షులవల్లే ఈ ప్రమాదం జరిగిందని దాదాపు ఒక స్పష్టత వచ్చింది. థాయ్‌లాండ్ నుండి దక్షిణకొరియాలో ముయాన్‌కు బయలుదేరిన జేజు కంపెనీ బోయింగ్ 737–800 విమానం కిందికి దిగిన తర్వాత కాంక్రీట్ ప్రహరీ గోడను వేగంగా వెళ్ళిఢీకొని ఒక అగ్నిగోళంలా మంటలలో ఆహుతైంది. ఈ ప్రమాదంలో 179 మంది ప్రయాణికులు మరణించగా కేవలం ఇద్దరు పైలట్లు మాత్రమే బ్రతికి బయటపడ్డారు. ఈ ప్రమాదంపై అనేక కథనాలు వ్యాప్తిలోకి వచ్చాయి. రష్యా సైన్యమే ఈ విమానాన్ని కూల్చేసిందని కూడా తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రమాదానికి నాలుగు నిమిషాల ముందే కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ రికార్డింగులు చేయడం మానేసింది. దక్షిణ కొరియా చరిత్రలో అత్యంత వినాశకరమైన విమానప్రమాదంగా ఇది చరిత్రలో నిలిచిపోయింది. ల్యాండింగ్ గేర్ వైఫల్యం, పక్షి ఢీకొట్టడం, రన్ వే చివరిలో నిర్మించిన కాంక్రీట్ వాల్ వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని దక్షిణ కొరియా, అమెరికా దర్యాప్తు అధికారులు కారణాలు కనిపెట్టేపనిలో నిమగ్నమయ్యారు.

## వ్యతిరేకిస్తున్నాం (మొదటి పేజీ తరువాయి)

ప్రొఫెసర్ ఎస్.కె. మహమూద్, మండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్‌తో కలిసి ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ యూనివర్సిటీలకు కేంద్ర ప్రభుత్వం రూపాయి ఇవ్వదని, కానీ సంస్కరణలు, నిబంధనల పేరుతో విశ్వవిద్యాలయాపైన పెత్తనం చెలాయించడం ఏమిటని యుజిసిని ప్రశ్నించారు. ఫ్యాకల్టీ, విసిల నియామకం పట్ల యుజిసి విడుదల చేసిన ముసాయిదా మార్గదర్శకాలతో విశ్వవిద్యాలయ స్వతంత్రత దెబ్బ తింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. విసిలుగా బ్యూరో క్రాట్స్‌ను నియమించాలనుకోవడం సరికాదని, యుజిసిమార్గదర్శకాలు ప్రైవేటైజేషన్‌ను ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. వర్సిటీలు స్వతంత్రంగా ఉండాలన్నారు. యుజిసి మార్గదర్శకాలతో జరిగే నష్టంపైన ఒక నివేదికను రూపొందించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశామని, ఈ నివేదిక రాగానే రాష్ట్ర ప్రభుత్వానికి ఆ నివేదికను అందజేస్తామని అన్నారు. యుజిసి మార్గదర్శకాలను కేరళ సహా పలు రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని, త్వరలోనే తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కూడా యుజిసికి లేఖ రాస్తారని ఆయన తెలిపారు. యుజిసి తీరును, మార్గదర్శకాలపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ యుజిసికి లేఖలు రాయాలని రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయ విసిలను ఆయన కోరారు.

## అడ్డుకుంటున్నారు! (మొదటి పేజీ తరువాయి)

కమిటీ (సిడబ్ల్యుసి) ఆమోదం లేకుండానే ఎస్‌సి వర్గీకరణకు అనుకూలమని ప్రకటించారా? అని ఆయన ప్రశ్నించారు. తాను ఎప్పటికీ కండువా మార్చబోనని, ఏ రాజకీయ పార్టీలో కూడా చేరబోనని మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. 'లక్ష డప్పులు వేల గొంతుల' కార్యక్రమం నేపథ్యంలో 'తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్'(టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగతో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టియుడబ్ల్యుజె అధ్యక్షులు కె.వీరహత్ అలీ సమన్వయ కర్తగా వ్యవహరించగా, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ వేదికపై ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు మంద కృష్ణ మాదిగ సమాధామిచ్చారు. ఎస్‌సి వర్గీకరణ కోసం గతంలో తాము నిర్వహించిన అనేక పోరాట కార్యక్రమాలలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారని, ఆయన సిఎం అయిన తర్వాత అసెంబ్లీలో ఎస్‌సి వర్గీకరణపై ప్రకటన చేశారని, అందుకే తాము రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా ఒక్క ప్రకటన కూడా చేయలేదని ఆయన వివరించారు. ఎస్‌సి వర్గీకరణకు సిఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా అనుకూలమైనప్పటికీ, ఒక మల్లు కుటుంబం, మరొక వెంకటస్వామి కుటుంబం సిఎం రేవంత్‌రెడ్డికి బ్రేకులు వేశారని, ఆ రెండు కుటుంబాలకు కాంగ్రెస్‌లో మంచి పలుకుబడి ఉందన్నారు. కాంగ్రెస్‌ను శాసిస్తున్న మాల సామాజిక వర్గం వత్తిళ్లకు తలొగ్గి, ఎస్‌సి వర్గీకరణను అమలు చేయవద్దనే కాంగ్రెస్ జాతీయ నాయకుడు కె.సి.వేణుగోపాల్ ఆదేశాల మేరకు సిఎం రేవంత్‌రెడ్డి తలొగ్గి వర్గీకరణను అమలు చేయలేదని, అందుకే ఇప్పుడు హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7వ తేదీన 'లక్ష డప్పులు వేల గొంతుల' పేరుతో సాంస్కృతిక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చి నాలుగు నెలల 26 రోజులు గడుస్తున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఇప్పటివరకు ఎస్‌సి వర్గీకరణను అమలు చేయలేదని మంద కృష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికంటే ముందే ఎస్‌సి వర్గీకరణను తెలంగాణలో అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సిఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం వెనక్కి తగ్గారన్నారు. ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి, నోటిఫికేషన్‌లో ఎస్‌సి వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించి, ప్రస్తుతం వర్గీకరణ విషయం లేకుండానే నోటిఫికేషన్ల జారీ, ఉద్యోగాల భర్తీ చేస్తున్నారని ఆయన విమర్శించారు. గ్రూప్ 1, 2, 3 పోస్టులను కూడా భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. ఈ మూడు మాటలకు రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉంటే తాము రోడ్డు ఎక్కాల్సిన అవసరం ఉండేదికాదని మంద కృష్ణ మాదిగ అన్నారు. ఫిబ్రవరి 7న మాదిగల గుండె చప్పుళ్లు, కోట్లాది మంది ఆకాంక్షలు, కోట్ల గొంతుకలతో ప్రపంచంలోనే మొట్టమొదటి సాంస్కృతిక వాయిద్య ఉద్యమానికి హైదరాబాద్ వేదిక కానుందన్నారు. తెలంగాణలో అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా వర్గీకరణకు మద్దతు ఇచ్చాయని, దేశంలో మేజారిటీ పార్టీలు వర్గీకరణకు మద్దతు ఇస్తున్నాయని పునరుద్ఘాటించారు. ఉమ్మడి రాష్ట్రంలో బిఆర్ఎస్, కాంగ్రెస్, టిడిపి ఎంఎల్‌ఎలు మద్దతు ఇచ్చారన్నారు. అలాగే జాతీయ స్థాయిలో జెడిఎస్, ఆప్, శివసేన, లాలు ప్రసాద్ యాదవ్ పార్టీలు కూడా వర్గీకరణకు మద్దతుగా నిలిచాయని ఆయన వివరించారు.

**లేఖ రాసి ఊరుకున్నారేమో ?**

తనకు పద్మ అవార్డును ప్రకటించడం పట్ల సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారని, కానీ మాల సామాజిక వర్గానికి చెందిన గద్దర్, అందేశ్రీ, గొరటి వెంకన్న లాంటి వారి పేర్లను రాష్ట్ర ప్రభుత్వం పద్మఅవార్డులకు ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వానికి కేవలం లేఖ రాసి ఊరుకున్నట్టుగా కనిపిస్తున్నదని మంద కృష్ణ మాదిగ అనుమానం వ్యక్తం చేశారు. పద్మ అవార్డులు ఇవ్వాల్సిన వ్యక్తుల ప్రతిభను కేంద్రానికి చెప్పి ఇప్పించాల్సిందని మంద కృష్ణ మాదిగ ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

## రూ.569 కోట్లు (మొదటి పేజీ తరువాయి)

నిరుపేదలకు ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా 51,912 కొత్త రేషన్ కార్డులను జారీ చేయడంతో పాటు ఇప్పటికే ఉన్న పాత కార్డుల్లో కొత్తగా 1,03,674 మంది కుటుంబ సభ్యుల పేర్లను నమోదును విజయవంతంగా పూర్తి చేశారు. ఇందులో భాగంగా రైతు భరోసా కింద మొత్తం 32 జిల్లాల్లో 563 గ్రామాలలో 4,41,911 మంది రైతులకు ఎకరానికి తొలి విడతగా ఎకరానికి రూ. 6 వేల చొప్పున పెట్టుబడి సాయంకింద 9,48,333 ఎకరాల విస్తీర్ణానికి మొదటి రోజునే ప్రభుత్వం రూ.569 కోట్లు రైతు ఖాతాలో జమ చేసింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొదటి విడుతగా 18180 మంది వ్యవసాయ కూలీ కుటుంబాలకు రూ. 6వేల చొప్పన ఆర్థిక శాఖ రూ.10.91 కోటు ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమచేశారుతొలి రోజున 531 గ్రామాల్లో 15,414 కొత్త కార్డులను అందజేశారు. వీటిలో 51,912 మంది కుటుంబ సభ్యులు లబ్ధి పొందారు.ఇప్పటికే ఉన్న కార్డుల్లో అదనంగా 1,03,674 మంది కుటుంబ సభ్యులను నమోదు చేసింది. గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో తొలి రోజునే అర్హులైన వారిలో 72 వేల మంది పేదలకు ఇళ్ల పత్రాలను అందించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కుటుంబాల్లో ఆనందం వెల్లువిరిసింది.

## తిరస్కరణ (మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారని, ఇది ప్రజాస్వామ్యం గొంతునొక్కడమేనని కమిటీలో ఉన్న ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద దుర్దినమని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 31వ తేదీ నుండీ పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బిజెపి ఎంపీలు ప్రతిపాదించిన సవరణలతో కూడిన బిల్లును బుధవారంనాడు జెపిసి ఆమోదించనున్నది. పార్లమెంటు ఉభయ సభల్లో మెజారిటీ ఉన్న బిజెపి బడ్జెట్ సమావేశాల మొదటి అర్థభాగంలోనే ఈ బిల్లును ఆమోదించే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ బిల్లును గనుక పార్లమెంటులో ఆమోదిస్తే ఆ కొత్త చట్టాన్ని రద్దు చేయించేందుకు తాము కోర్టుకు వెళతామని జెపిసిలో సభ్యుడుగా ఉన్న డిఎంకె ఎంపీ ఎ.రాజా హెచ్చరించారు. మత ప్రయోజనాలకోసం ఏదైనా భవనాన్ని, లేదా భూమిని, లేదా వాటిల్లో కొంత భాగాన్ని ప్రభుత్వ లేదా యజమానుల సమ్మతి ద్వారా శాశ్వతంగా ఉపయోగించుకుంటున్న వారు ఆ ఆస్తులకు సంబంధించి ఎలాంటి వివాదాలు లేకపోతే, ఆ ఆస్తులు యథాతథంగా కొనసాగుతాయని జెపిసి సవరణల్లో చేసిన ప్రతిపాదన యూజర్లకు కొంత ఊరట కలిగించే విషయం. కాకపోతే పార్లమెంటు ఆమోదం ద్వారా కొత్త చట్టం అమలులోకి వచ్చిన తర్వాత మాత్రం, ఇప్పటివరకూ అధికారికంగా తనిఖీలులేని సంబంధిత ఆస్తుల వినియోగదారులు కొత్తచట్టం ముందు వాటిని రిజిస్టరు చేయించుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా ప్రస్తుత చట్టం ప్రకారం ఇద్దరు ముస్లిమేతరులు వక్ఫ్ బోర్డులో సభ్యులు ఉంటున్నారు. కానీ కొత్త బిల్లులో జెపిసి సవరణల ప్రకాకం నలుగురు ముస్లిమేతరులు సభ్యులుగా ఉంటారు. ఈ సవరణ ఆమోదం విషయంమీద మాత్రం భవిష్యత్తులో అటు ముస్లిం గ్రూపుల నుండి, ఇటు ప్రతిపక్షాల నుండీ కూడా ప్రభుత్వానికి తీవ్రస్థాయిలో ప్రతిఘటన, విమర్శలు ఎదురయ్యే అవకాశాలు ఉంటాయి. అసలు విషయం ఏమిటంటే, ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు మినహా వక్ఫ్ బోర్డు మొత్తం సభ్యుల్లో ఈ సబ్–సెక్షన్ కింద నియమితులయ్యే ఇద్దరు సభ్యులు ముస్లిమేతరులుగానే ఉండాలి. అదేవిధంగా కనీసం ఐదేళ్ళ కంటే ఎక్కువకాలంగా ముస్లిం మతాన్ని ఆచరించేవారే వక్ఫ్ ఆస్తులను ప్రకటించాలి. లేదా వక్ఫ్ ట్రస్టులను ప్రకటించాలి. వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించిన భవంతులలో వ్యాపారాలు చేసేవారిలో చాలా పెద్దసంఖ్యలో ముస్లిమేతరులే ఉంటున్నారు. ఐతే వీటికి వక్ఫ్ పేరుతో స్పష్టమైన పత్రాలు లేవు. ఇలాంటి ఆస్తుల విషయంలో ముస్లిమేతరలందరికీ ఉపశమనం కలుగుతుంది. దీనివల్ల ఢిల్లీ వంటి ప్రాంతాలలో వక్ఫ్ పేరుతో చలామణీ అయ్యే ఆస్తుల్లో ఉన్న ముస్లిమేతర వ్యాపారస్తులకు మేలు జరుగుతుంది. ఎందుకంటే ఇలా వక్ఫ్ పేరుతో ఉన్న ఆస్తుల యజమానులలో చాలామంది దేశ విభజన సమయంలో పాకిస్థాన్‌కు వెళ్ళిపోయినవారు ఉన్నారు. కాగా ముస్లిం చట్టాల పట్ల, ముస్లిం మత న్యాయవ్యవస్థపట్ల అవగాహన, సంబంధిత జ్ఞానం ఉన్న వ్యక్తిని ముస్లిం ట్రైబ్యునల్స్‌లో, ఆయా కమిటీలలో సభ్యులుగా తీసుకోవాలని బిజెపి ఎంపి సంజయ్ జైస్వాల్ చేసిన సవరణ ప్రతిపాదనను కూడా జెపిసి ఆమోదించింది. ప్రస్తుతం ఉన్న వక్ఫ్ చట్టంలోని నిబంధనలన్నింటినీ పునరుద్ధరించాలని కమిటీలో ఉన్న ప్రతిపక్ష ఎంపీలు చేసిన ప్రతిపాదనలను జెపిసి నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులోని అంశాలన్నీ ముస్లిం మతస్తుల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకునేదిగా ఉందనీ, ప్రతిపాదిత బిల్లు చాలా అమానుషంగా ఉందనీ కమిటీలో ఉన్న ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకె, ఎఐఎంఐఎంలకు చెందిన ప్రతిపక్ష ఎంపీలు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. బిజెపి ఎంపీలు ప్రతిపాదించిన సవరణలను ప్రతిపక్ష ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. డిఎంకె ఎంపి ఎ.రాజా జెపిసిలో పరిణామాలపై స్పందిస్తూ, ఈ సమావేశం వట్టి బూటకంగా, పెద్ద వంచనగా మారిందని విమర్శించారు. జెపిసి కమిటీ సవరణల నివేదికను అధికారపార్టీ పార్లమెంటులో ఆమోదించడానికి ముందుగానే సిద్ధం చేసేసిందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం జెపిసి ఆమోదించే సవరణలతో ఈ వక్ఫ్ బిల్లును పార్లమెంటు ఉభయసభల్లో ఆమోదిస్తే తమ పార్టీ కోర్టుకు వెళుతుందని రాజా హెచ్చరించారు. ఐతే జెపిసిలో అందరి సభ్యుల ఆలోచనలను కమిటీ పరిగణనలోకి తీసుకుందనీ, ప్రజాస్వామ్యపద్ధతిలోనే తమ విధిని తాము నిర్వర్తించామని కమిటీ అధ్యక్షుడు జగదంబికా పాల్ అన్నారు. ఐతే మెజారిటీ అభిప్రాయమే ప్రజాస్వామ్యంలో చెల్లుబాటు అవుతుందని ఆయన అన్నారు. ఈ సవరణలతో కూడిన బిల్లు చట్టరూపం ధరిస్తే మరింత సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ చేసిన మార్పులు, చేర్పుల సవరణల సిఫార్సుల నివేదికను ప్రభుత్వం సమ్మతించి తీరాలని ఆయన అన్నారు. ఏదైనా ప్రభుత్వ ఆస్తిపై వచ్చిన వివాదాన్ని సంబంధిత కలెక్టర్ జోక్యంతో నిలిపివేసేందుకు ఉద్దేశించి బిజెపి ఎంపి బ్రిజ్ లాల్ చేసిన ప్రతిపాదనతోపాటు ఇతర సవరణలకు అనుకూలంగా 16 మంది, వ్యతిరేకంగా 10 మంది ఓటు వేశారని జగదంబికాపాల్ చెప్పారు.

## తిరుగులేని బెలారెస్ నేత లుకషెంకో

### చైనా,రష్యా అభినందన



**మిన్స్క్ :** తూర్పు యూరప్ దేశం బెలారస్ అధ్యక్ష ఎన్నికల్లో వరుసగా ఏడోసారి కూడా విజయం సాధించిన అలెగ్జాండర్ లుకషెంకో (71)కు రష్యా,చైనా దేశాలు అభినందనలు తెలియజేశాయి. ఆదివారంనాడు బెలారస్‌లో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. అధికారిక ఎగ్జిట్‌పోల్స్ నివేదిక ప్రకారం లుకషెంకో 87.6 శాతం ఓట్లతో గెలిచే అవకాశం ఉంది. దేశంలో ప్రతిపక్షాలు ప్రవాసంలో ఉన్నాయి. పోటీలో ఉన్న మిగిలిన నలుగురు అభ్యర్థులూ ఆయన అనుకూలురే. 1994లో అధికారం చేపట్టిన లుకషెంకో 30 సంవత్సరాలుగా అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు. ఈ ఎన్నికలు న్యాయబద్ధమైనవిగా అంతర్జాతీయ పరిశీలకులు భావించలేదు. బెలారస్‌లో ఎన్నికల వ్యవస్థ ఏకపక్షంగా ఉందని వారు విమర్శించారు. ఐదేళ్ళకోసారి బెలారస్‌లో ఎన్నికలు జరుగుతాయి. బెలారస్ జాతీయ అసెంబ్లీలోని హౌస్ ఆఫ్ రిప్రజంటేటివ్స్‌లో 110 మంది సభ్యులు, కౌన్సిల్ ఆఫ్ రిపబ్లిక్‌లో 64 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 56 మందిని పరోక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు. వీరిలో ఎనిమిది మంది సభ్యులను దేశాధ్యక్షుడే నేరుగా నియమిస్తారు. 2020 నాటి అధ్యక్ష ఎన్నికల్లో 80 శాతం ఓట్లతో లుకషెంకో గెలిచారు. ప్రతిపక్ష నాయకురాలు స్వెత్లానా సికనౌస్కయా నాలుగేళ్ళక్రితం అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. ప్రస్తుతం ఆమె ప్రవాసంలో ఉన్నారు. లుకషెంకో గెలిచినా, ఉక్రేన్‌కు అమెరికా సహాయాన్ని ఆపినా కూడా తీవ్ర పరిణామాలు ఏర్పడతాయని ఆమె హెచ్చరించారు.

## అధికారులు (మొదటి పేజీ తరువాయి)

ఓ జ్యూస్ సెంటర్ వద్ద బాధితుల నుండి రూ. 2,500/లు లంచం తీసుకుంటుండగా వినోద్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా సత్తుపల్లిలో ఎసిబి అధికారుల రైడ్ జరుగుతుంది అనే సమాచారం దావానంలా వ్యాపించడంతో కొందరు అధికారులు గుట్టు చప్పుడు కాకుండా కార్యాలయాల నుండి పరుగులు పెట్టినట్లు తెలిసింది. ఎక్కడ ఎసిబి అధికారులు తమపై పడతారో అనే ఆందోళనతో కొందరు తమ వాహనాలతో మాయమై పట్టణ శివార్లలోని మారుమూల పల్లెల్లో కాలక్షేపం చేసినట్లు గుస,గుసలు వినిపించాయి. ఇదిలా ఉండగా ఎసిబి డిఎపి వై.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు లంచం అడిగినట్లయితే 1064 నెంబర్ కు డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని, బాధితుల సమాచారాన్ని భద్రంగా ఉంచి, అవినీతి అధికారుల భరతం పడతామన్నారు.

**రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టివేత**

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ విద్యుత్ ఎఇ కృష్ణ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా లంచం తీసుకుంటూ దొరికాడు. కొండాపూర్ గ్రామంలోని లక్కీ ఇండస్ట్రీలో ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ ఇవ్వడం కోసం పరిశ్రమ యజమాని వద్ద రూ.50 వేలు లంచం డిమాండ్ చేయగా రూ.30 వేలకు ఒప్పందం కుదిరించుకున్నారు. రూ.10 వేలు ఈ నెల 18వ తేదీన తీసుకోగా, మరో 20 వేలు సోమవారం తీసుకుంటుండగా ఎసిబి డిఎస్‌పి సుధాకర్ తమ సిబ్బంది మెదక్ రేంజ్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లులతో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు తెలిపారు. విద్యుత్ కార్యాలయంలో రికార్డులను తనిఖీలు చేసి ఎఇ కృష్ణను అదుపులోకి తీసుకొని విచారణ చేయనున్నట్లు ఎసిబి అధికారులు విలేకరుల సమావేశంలో తెలిపారు.

## బానిసగా మార్చారు (మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగంపై విశ్వాసం లేదని అన్నారు. రాజ్యాంగ రూపకల్పకు జీవితాన్ని అంకితం చేసిన అంబేద్కర్ జీవితాన్ని అవమానించినట్లేనని విమర్శించారు. "భారతదేశానికి 1947 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యం రాలేదు, మోదీజీ అధికారంలోకి వచ్చిన తర్వాతే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం లభించింది" అని మోహన్ భగవత్ కొద్దిరోజులక్రితం వ్యాఖ్యానించారు. భగవత్ వ్యాఖ్యలు భారత రాజ్యాంగంపై చేసిన ప్రత్యక్ష దాడిగా రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. "ఇది అంబేద్కర్ రచించిన రాజ్యాంగం, నా చేతులతో పట్టుకున్నాను, కొద్ది రోజుల క్రితం ఈ రాజ్యాంగాన్ని మోహన్ భగవత్ అవమానించారు, రాజ్యాంగం మనకు స్వాతంత్ర్యాన్ని ఇవ్వలేదని, రాజ్యాంగం తనకు అనుగుణంగా లేదని ఆయన అన్నారు, నిజమైన స్వాతంత్ర్యం మోదీజీ అధికారంలోకి వచ్చినప్పుడు మాత్రమే వచ్చిందని అన్నారు, దీని అర్థం ఏమిటి? ఆయనకు రాజ్యాంగంపై నమ్మకం లేదనే అర్థం" అని రాహుల్‌గాంధీ విమర్శించారు. "రాజ్యంగ రూపకల్పనకే అంబేద్కర్ తన జీవితాన్ని ధారపోశారు, అలాంటి రాజ్యాంగాన్ని మోహన్ భగవత్ ప్రత్యక్షంగా అవమానించారు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు, ఇతర పేద సాధారణ కులాలకు చెందిన ప్రజలను బిజెపి ప్రభుత్వం మళ్ళీ బానిసలుగా మార్చేసింది" అని రాహుల్‌గాంధీ విమర్శించారు. మీ జీవితం నాశనం అవుతుంటే మీరు మౌనంగా చూస్తూ ఉండిపోవడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోందని ఆయన అన్నారు. "రామ మందిరం ప్రారంభోత్సవ వేడుకలలో ఒక పేదవ్యక్తిని మీరు ఎక్కడైనా చూశారా? ఒక గిరిజన జాతికి చెందిన దేశ రాష్ట్రపతిని ఆ ఆలయంలోపలికి వారు అనుమతించలేదు, వారు దళితులను, వెనుకబడినవారిని లోనికి వెళ్ళేందుకు అనుమతించలేదు, పార్లమెంటు ప్రారంభోత్సవం రోజున కూడా రాష్ట్రపతిని ఆ కొత్త భవనం లోపలికి అనుమతించలేదు, మోదీజీ చెప్పారు, మీరు గిరిజనులు, మీరు లోపలికి వెళ్ళకూడదని" అని రాహుల్‌గాంధీ అన్నారు. "స్వాతంత్ర్యానికి పూర్వం దళితులు, వెనుకబడిన తరగలుతుల, గిరిజనులకు ఎలాంటి హక్కులూ లేవు, కేవలం రాజాలు, మహారాజాలే హక్కులను అనుభవించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మాత్రమే మార్పులు సంభవించాయి, మీరు భూమి దక్కింది, హక్కులు లభించాయి, బిజెపి–ఆర్ఎస్ఎస్‌లు ఇప్పుడు సామాన్య ప్రజలకు ఎలాంటి హక్కులూ లేని స్వాతంత్ర్యానికి పూర్వంనాటి పరిస్థితులు మళ్ళీ రావాలని కోరుకుంటున్నాయి, కేవలం అదానీ, అంబానీలాంటి వారికి మాత్రమే హక్కులు ఉండాలని కోరుకుంటున్నాయి, పేదలు మళ్ళీ మౌనంగా ఉండిపోయి కష్టాలు అనుభవించాలని కోరుకుంటున్నాయి, వేలకోట్లు సంపాదించినవారు దేశాన్నినడుపుతుంటే బతుకులు బాగుపడాలని పేదలు కలలు కనకూడదని బిజెపి–ఆర్ఎస్ఎస్ కోరుకుంటున్నాయి" అని రాహుల్‌గాంధీ విమర్శించారు.

**తెలంగాణ,కర్ణాటకలలో కులగణన వివరాలు త్వరలో చెబుతాం**

అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వివాహ వేడుకలను ఆయన ప్రస్తావిస్తూ, "బిలియనీర్లు వేలకోట్ల రూపాయలు తమ బిడ్డల పెళ్ళిళ్ళ కోసం ఖర్చు పెడుతున్నారు, కానీ మీరు మీ పిల్లలకు పెళ్ళి చేయాలనుకున్నప్పుడు అప్పులు చేస్తున్నారు, అదానీ, అంబానీలే దేశంలో ప్రగతి సాధించారు, సంపద మరింతగా వారి చేతుల్లో పోగుపడుతోంది, సామాన్య ప్రజల్లో నిరుద్యోగం తాండవిస్తోంది, దేశంలో చివరకు ఐఐటి, ఐఐఎం విద్యార్థులకు కూడా ఉద్యోగాలు రావడంలేదు" అని విమర్శించారు. వస్తు సేవల పన్ను, కరెన్సీ ఉపసంహరణ వంటివన్నీ పేదలను అంతం చేసే ఆయుధాలుగా మారాయని విమర్శించారు. "అవన్నీ పథకాలు కాదు, ఆయుధాలు, లక్షలకోట్లరూపాయల మేరకు జిఎస్‌టి పేదల జేబుల్లోంచి వెళ్ళిపోతోంది, బిలియనీర్లు చేసిన 16 లక్షల కోట్ల అప్పులను ప్రభుత్వం రద్దుచేసింది, అది మీ సొమ్ము, నేను అడగదల్చుకున్నాను, ఏ రైతుకి, ఏ కార్మికుడికి, ఏ విద్యార్థికి రుణాలను మీరు మాఫీ చేశారు?" అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. జిఎస్‌టి, కరెన్సీ ఉపసంహరణ కారణంగా చిన్న మధ్యతరహా వ్యాపారులు నాశనమయ్యారన్నారు. భారతదేశంలో ఉన్న 500 అతిపెద్ద కంపెనీలలో ఎంతమంది దళితులు, వెనుకబడిన తరగతులకు చెందిన యజమానులు ఉన్నారని ప్రశ్నించారు. దేశ సంపద పంపిణీచేసే బడ్జెట్ ప్రక్రియలో కూడా కనీసం దళితులు, గిరిజనుల భాగస్వామ్యం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులలో ఈ వర్గాలకు చెందినవారు లేరన్నారు. "పాలనాయంత్రాంగంలో మీ భాగస్వామ్యంలేదు, బడ్జెట్ నిర్ణయాల్లో, విశ్వవిద్యాలయాల నిర్వహణలో, ఆసుపత్రులు, ఇతర రంగాల నిర్వహణలో మీ పాత్రలేదు, మీరు కార్మికులుగానో, లేదా జైళ్ళలోనో ఉండాలని మోదీ కోరుకుంటున్నారు, ఇదే ఆయన 21వ శతాబ్దపు దార్శనికత, అందువల్ల దేశంలో కుల గణన జరగాలి, కొంతకాలంలోపు మేం తెలంగాణలో గిరిజనులు, దళితులు, వెనుకబడిన కులాలవారి వాటా ఎంతో ప్రకటిస్తాం, ఈ విషయంలో తెలంగాణలో, కర్ణాటకలో మా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది, కుల గణన సర్వే వివరాలు వస్తాయి, ఇదొక విప్లవాత్మకమైన చర్య, వారి న్యాయబద్ధమైన వాటా ఏమిటో ప్రజలకు తెలుస్తుంది,నరేంద్రమోదీ భయపడుతున్నారు, ఈ వివరాలు తెలుసుకోవడం ఆయనకు ఇష్టం లేదు, బిజెపి దీనిని ఎప్పటికీ అమలు చేయదు, తాను ఓబిసి అని మోదీజీ ప్రకటించుకుంటారు, కానీ వారి బలం ఎంతుందో ఇప్పటికీ ఆయనకు తెలియదు, ఇది అన్యాయం, అందుకే కాంగ్రెస్‌పాలిత రెండు రాష్ట్రాలలో మేం కుల గణన చేపట్టామని రాహుల్‌గాంధీ చెప్పారు.

రాజ్యాంగాన్ని సమూలంగా నాశనం చేయాలని బిజెపి కోరుకుంటున్నదన్నారు. గడచిన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో 400 సీట్లు ఇవ్వాలని ప్రజల్లో ప్రచారం చేశారని, రాజ్యాంగాన్ని మార్చేయాలనే ఉద్దేశంతోనే అలాంటి ప్రచారం చేశారని అన్నారు. కాంగ్రెస్‌తోపాటు దేశంలోని ప్రతిపక్షాలు కూడా లోక్‌సభ ఎన్నికల్లో మోదీపై పోరాటం చేశాయనీ, చివరకు ప్రజాతీర్పు ముందు, రాజ్యాంగం ముందు మోదీ తల వంచారని అన్నారు. రాజ్యాంగాన్ని కార్మికులు కాపాడాలని కోరారు.

**గంగలో మునిగితే పేదరికం పోదు :ఖర్గే**

బిజెపి, ఆర్ఎస్ఎస్ ద్రోహులనీ, వారికి దేశ స్వాతంత్ర్యపోరాటంలో ఎలాంటి భాగస్వామ్యంలేదని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ర్యాలీలో అన్నారు. పార్టీ కార్యకర్తలు దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఏకం కావాలని కోరారు. మహాకుంభమేళాకు వెళ్ళి గంగానదిలో మునిగినంత మాత్రాన దేశంలో పేదరికం నశించదన్నారు. ఐతే ఎవ్వరి మత విశ్వాసాలను గాయపరచాలని తాను భావించడంలేదన్నారు. గంగానదిలో మునిగేందుకు బిజెపి నాయకులు ఒకరితో మరొకరు పోటీ పడుతున్నారన్నారు. ప్రతి మసీదులోని గర్భంలో శివలింగాలు ఉంటాయని ప్రకటనలు చేయవద్దని, దేశంలో ప్రజలను రెచ్చగొట్టవద్దనీ అన్నారు. పేదరికం, నిరుద్యోగం నుండి బయటపడాలంటే రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. ఐక్యంగా ఉండాలన్నారు.

# 4,41,911 మందికి రైతు భరోసా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులు ఏడాది కాలంగా ఎదురు చూస్తున్న 'రైతు భరోసా' పథకం ఎట్టకేలకు ప్రారంభమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినట్లుగానే గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రైతు భరోసా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దీంతో సోమవారం నుంచి ఒక ఎకరం వరకు ఉన్న కొంత మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. మొదటి రోజు సోమవారం మొత్తం 32 జిల్లాలలోని 563 మండలాలకు చెందిన 577 గ్రామాలలోని 4,41,911 మంది రైతులకు సంబంధించి 9,48,333 ఎకరాలకుగాను మొత్తం రూ.569 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సాగులో ఉన్న ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేస్తున్నామని మంత్రి వెల్లడించారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక్కో గ్రామం చొప్పున ఎంపిక చేసి ముందుగా నిధులను విడుదల చేశామని తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా వివరాలను మంత్రి తుమ్మల నాగేశ్వరావు మీడియాకు విడుదల చేశారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్ ప్రారంభం కావడం, ఇదే సమయంలో ప్రభుత్వం పంట పెట్టుబడి సహాయం అందిస్తుండడం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

| జిల్లా | మండలాలు | గ్రామాలు | రైతులు | విడుదల కోట్లలో |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 17 | 21 | 6,411 | రూ. 14.49 కోట్లు |
| భద్రాద్రి కొత్తగూడం | 23 | 25 | 22,242 | రూ.39.07 కోట్లు |
| హన్మకొండ | 12 | 12 | 12,545 | రూ. 14.30 కోట్లు |
| జగిత్యాల | 20 | 20 | 22,242 | రూ. 39.07 కోట్లు |
| జనగామ | 12 | 12 | 12,320 | రూ. 15.91 కోట్లు |
| జయశంకర్ భూపాలపల్లి | 12 | 12 | 7,073 | రూ. 8.67 కోట్లు |
| జోగులాంబ గద్వాల | 13 | 13 | 7,829 | రూ.12.47 కోట్లు |
| కామారెడ్డి | 22 | 24 | 9,062 | రూ.8.35 కోట్లు |
| కరీంనగర్ | 15 | 15 | 14,226 | రూ. 15.96 కోట్లు |
| ఖమ్మం | 21 | 21 | 20,802 | రూ. 28.42 కోట్లు |
| కోమురంభీం ఆసిఫాబాద్ | 15 | 19 | 4,344 | రూ. 8.62 కోట్లు |
| మహబూబాబాద్ | 18 | 19 | 14,611 | రూ. 18.14 కోట్లు |
| మహబూబ్ నగర్ | 16 | 16 | 14,575 | రూ. 17.27 కోట్లు |
| మంచిర్యాల | 16 | 17 | 7,143 | రూ. 8.72 కోట్లు |
| మెదక్ | 21 | 21 | 14,833 | రూ. 14.06 కోట్లు |
| మేడ్చల్ | 5 | 5 | 2,706 | రూ. 3.14 కోట్లు |
| ములుగు | 9 | 9 | 6,678 | రూ. 8.26 కోట్లు |
| నాగర్ కర్నూల్ | 20 | 20 | 16,806 | రూ. 23.05 కోట్లు |
| నల్లగొండ | 31 | 31 | 35,568 | రూ. 46.93 కోట్లు |
| నారాయణపేట | 13 | 13 | 9,348 | రూ. 13.87 కోట్లు |
| నిర్మల్ | 18 | 18 | 7,912 | రూ. 10.56 కోట్లు |
| నిజామాబాద్ | 31 | 31 | 35,568 | రూ. 46.93 కోట్లు |
| పెద్దపల్లి | 13 | 13 | 9,885 | రూ. 10.14 కోట్లు |
| రాజన్న సిరిసిల్ల | 12 | 12 | 9,724 | రూ. 12.26 కోట్లు |
| రంగారెడ్డి | 21 | 1 1 | 5,597 | రూ. 20.32 కోట్లు |
| సంగారెడ్డి | 25 | 25 | 19,933 | రూ. 24.15 కోట్లు |
| సిద్దిపేట | 26 | 26 | 31,170 | రూ. 36.76 కోట్లు |
| సూర్యాపేట | 23 | 23 | 29,352 | రూ. 37.84 కోట్లు |
| వికారాబాద్ | 20 | 20 | 8,609 | రూ. 11.18 కోట్లు |
| వనపర్తి | 15 | 15 | 9,441 | రూ. 12.25 కోట్లు |
| వరంగల్ | 11 | 11 | 11,386 | రూ. 12.86 కోట్లు |
| యాదాద్రి భువనగిరి | 17 | 17 | 17,576 | రూ. 26.95 కోట్లు |
| మొత్తం | 563 | 577 | 4,41,911 | రూ.569 కోట్లు |

# పర్యాటక కేంద్రంగా సింగూర్ ప్రాజెక్టు అభివృద్ధి

### రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి :** పర్యాటక కేంద్రంగా సింగూర్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆయన సోమవారం నాడు అధికారులతో కలిసి సింగూరు ప్రాజెక్టును పరిరక్షణంగా మార్చడానికి క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ప్రాజెక్టు ఐలాండ్‌లోని వాచ్‌టవర్‌పై రెస్టారెంట్ ఫుడ్‌కోర్టు ఏర్పాటు చర్యలు, ప్రాజెక్టు దిగువ భాగంలో 29 ఎకరాల్లో రెస్టారెంట్ ఆధునిక కాటేజీల ఏర్పాటు చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో సింగూరు డ్యాంపై భాగంలో బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. పర్యాటకుల సౌకర్యం కోసం డ్యాంపై వెళ్లడానికి అవసరమైన మెట్ల నిర్మాణం, డ్యాం బండ్ వెంట పార్కు అభివృద్ధి, సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టు పరిసరాలలో సెంట్రల్ లైటింగ్‌కు అవసరమైన ప్రతిపాదనలను ఫిబ్రవరి మొదటి వారంలోపు రూపొందించాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంతో పాటు ఇరుగు, పొరుగు రాష్ట్రాల పర్యాటకులు సింగూరు ప్రాంతంకు వచ్చేలా వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. సింగూరు ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకులకు ఆధునాతన వసతులతో కూడిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాలకు చెందిన పర్యాటకులను ఆకర్షించేలా అవసరమైన అన్నిరకాల ఏర్పాట్లు ప్రాజెక్టు దిగువ భాగంలో ఐలాండ్‌లో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకలు సౌలభ్యం కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని దామోదర్ రాజనర్సింహ్మ అధికారులును ఆదేశించారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో పెద్దారెడ్డిపేట ఎక్స్ రోడ్డు నుంచి సింగూరు డ్యాం వరకు రహదారులుగా విస్తరణ చేపట్టాలని, రహదారి వెంట అధునాతన లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అందోల్ ఆర్డీఒ పాండు, నీటిపారుదల శాఖ అధికారులు జైభీమ్, నాగరాజు, ఆర్అండ్‌బి ఇంజనీర్లు రవీందర్, జగదీశ్వర్, పర్యాటక శాఖ అధికారి నటరాజ్, రెవెన్యూ శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అయిచి ప్రిఫెక్చర్‌తో ద్వైపాక్షిక సంబంధాలకు రెడీ

### మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జపాన్‌లోని అయిచి రాష్ట్రం (ప్రిఫెక్చర్)తో ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలకు తెలంగాణా ఆహ్వానం పలుకుతోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. సోమవారం తనతో భేటీ అయిన అయిచి ప్రిఫెక్చర్ ప్రతినిధులతో ఆయన సచివాలయంలో మాట్లాడారు. రెండు రాష్ట్రాలు వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో పరస్పరం సహరించుకోవాలని శ్రీధర్ బాబు సూచించారు. అయిచీ రాష్ట్రం టొయోటా కార్ల పరిశ్రమతో పాటు, ఏరోస్పేస్, ఆటోమొబైల్, రోబోటిక్స్, యంత్ర పరికరాల తయారీలో అగ్రగామిగా ఉంది. ఇటీవలే ఆ రాష్ట్రం 'స్టేషన్ ఎఐ' పేరుతో జపాన్‌లోనే అతిపెద్ద అంకుర సంస్థల ఇన్ క్యుబేషన్ కేంద్రాన్ని ప్రారంభించింది. తెలంగాణా రాష్ట్రంలోని టీ హబ్ కూడా అంకుర సంస్థల ప్రోత్సాహంతో దేశంలో ప్రముఖంగా నిలుస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. అయిచీ అసెంబ్లీ సభ్యుడు, ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన హిరోహిటో కొండో 2026లో తమ రాష్ట్రంలో జరిగే 20వ ఏషియా క్రీడలకు మంత్రి శ్రీధర్ బాబును ఆహ్వానించారు. అక్కడి గిబ్లి యానిమేషన్ పార్క్ ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆహ్వానిస్తోందని కొండో మంత్రి దృష్టికి తెచ్చారు. ద్వైపాక్షిక సంబంధాలతో ఇరు ప్రాంతాలు ప్రయోజనం పొందేలా సహకారం కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. సమావేశంలో ఇండోబాక్స్ ఇండియా ఎండి డైసుకే టాంజీ, షిన్యా సుకాడా, నాచారంలోని సపల ఆర్గానిక్స్ సిఇఒ పైడి ఎల్లారెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డా.వి.నర్సింహాచార్యులు, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. జి.చంద్రశేఖర్ రెడ్డి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టిజిఐఐసి ఎండి డా. విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సరస్వతి నది పుష్కరాలకు..

## రూ.25 కోట్లు మంజూరు

### మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం క్షేత్రంలో ఈ యేడాది మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతి నది పుష్కరాల ఏర్పాట్ల కోసం అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం రూ.25 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు కొండా సురేఖ దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సరస్వతీ నది పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వచ్చే పరిస్థితుల నేపథ్యంలో భక్తులకు మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు, స్నాన ఘట్టాల నిర్మాణం, రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం తదితర పనులను పకడ్బందీగా చేపట్టాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్‌లను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనులు చేపట్టి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని మంత్రి సురేఖ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పూర్వం 2013లో వచ్చిన సరస్వతీ నది పుష్కరాలను కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్వహించిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో గతంలో కంటే మిన్నగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా, అత్యంత వైభవోపేతంగా సరస్వతీ నది పుష్కరాలను నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

### భారత సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న ..

## యుజిసి ముసాయిదా మార్గదర్శకాలను ఉపసంహరించుకోవాలి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగిస్తూ, భారత సమాఖ్య స్ఫూర్తిగా విరుద్ధంగా ఉన్న యుజిసి ముసాయిదా మార్గదర్శకాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిజాం కళాశాల ఆవరణలో యుజిసి విడుదల చేసిన 2025 ముసాయిదా మార్గదర్శకాలను వెనక్కి తెసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో వైస్ ఛాన్సలర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు సంబంధించి నిబంధనల మార్పుల కోసం ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యుజిసి) జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలు మన ఉన్నత విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని, ఇది స్పష్టంగా ఉన్నత విద్యను అణగదొక్కే ప్రయత్నమేనన్నారు. అంతేకాకుండా యుజిసి మార్గదర్శకాలు ప్రతిష్టాత్మక సంస్థల అధికారంలో ఆర్ఎస్ఎస్ అనుకూల వ్యక్తుల ప్రవేశాన్ని సులభతరం చేసేందుకు అవకాశం కల్పించడంతో ఎవరైనా పరిశ్రమ నిపుణులు, అలాగే ప్రభుత్వ రంగాలకు చెందిన సీనియర్ నిపుణులను నేరుగా విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లుగా నియమించుకునే విధంగా ఉన్నాయన్నారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సంస్థల నాణ్యతను కూల్చివేసేందుకు ఇలాంటి మార్గదర్శకాలను రూపొందించేలా చేస్తోందని ఆరోపించారు.
ఇదే జరిగితే విశ్వవిద్యాలయాలను ఫ్యాక్టరీలుగా నడిపించే వైస్‌చాన్సలర్లుగా మారి, విద్యార్థులను కార్మికులుగా మార్చే కుట్రలోభాగమన్నారు. ప్రతిపాదిత ముసాయిదాతో రాష్ట్ర, డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు తప్పనిసరిగా వర్తిస్తుందని పేర్కొందని, దీంతో వీసిల నియామకాలు ఇప్పుడు చాన్సలర్లు అంటే గవర్నర్ల చేతుల్లోకి వస్తాయని ఇదిరాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను లాక్కోవడమే అన్నారు. ఇది భారత రాజ్యాంగం నిర్దేశించిన భారత సమాఖ్య నిర్మాణానికి పెద్ద ఆటంకం అని, విద్య అనేది ఉమ్మడి జాబితా కిందకు వచ్చే అంశం అని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్ర విశ్వవిద్యాలయాలపై నిబంధనలను బలవంతంగా యుజిసి అమలు చేయకూడదని తెలిపారు. మరీ ముఖ్యంగా, మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఎం.ఇ.) లేదా మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ (ఎంటెక్)లో కనీసం 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉన్న వ్యక్తులు అర్హత సాధించకుండానే అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయిగా నియమించుకోవడానికి అనుమతించే నిబంధనను యుజిసి ప్రవేశపెట్టిందని, తద్వారా విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి విద్యార్థుల భవిష్యత్తును పూర్తిగా నాశనం చేయాలని బిజెపి యోచిస్తోందని ఆరోపించారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వ్యక్తం చేస్తున్న విమర్శలను పరిగణనలోకి తీసుకుని యుజిసి ఈ ముసాయిదాను తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలని పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, నాయకులు జ్ఞానేశ్వర్, ప్రవీణ్, రూపేష్,శివాని, నిఖిత, వైష్ణవి పాల్గొన్నారు.

## కొంపముంచిన మద్యం మత్తు

### హుస్సేన్‌సాగర్ పడవ ప్రమాదంలో యువకుడు గల్లంతు..
### ఎనిమిది మందికి గాయాలు
### ఇద్దరి పరిస్థితి విషమం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హుస్సేన్‌సాగర్ పడవలో చోటుచేసుకున్న బాణాసంచా పేలుళ్లకు మద్యం మత్తే కారణమని విశ్వసనీయంగా తెలిసింది. బాణాసంచా కాల్చేందుకు వచ్చిన నిర్వాహకులు పడవలో మద్యం సేవించి మత్తులో కాల్చడం వల్లనే ప్రమాదం చోటుచేసుకుని ఉంటుందని పడవలో లభించిన మద్యం సీసాలే ఇందుకు నిదర్శనమి తెలిసింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలుకాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. అయితే హుస్సేన్‌సాగర్ పడవలో జరిగిన బాణాసంచా పేలుళ్లలో అజయ్ అనే యువకుడు గల్లంతయ్యాడు. అతని ఆచూకీ సోమవారం రాత్రి వరకు కూడా లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం నక్లెస్‌రోడ్డులోని పీపుల్స్‌ప్లాజా వద్ద భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతమాత మహా హారతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మహా హారతి ఇస్తున్న సమయంలో సాగర్‌లోని రెండు బోట్‌లలో బాణాసంచా పేల్చేందుకు సిద్ధమవుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే మహేందర్ అనే టూరీజం శాఖ కార్మికుడు మహేందర్ స్పీడ్ బోట్‌ను నడిపి ప్రాణాలకు తెగించి అనేక మందిని కాపాడాడు. ఈ ప్రమాదంలో గాయపడిన మహేందర్, ప్రేమ్ అనే కార్మికులు గాయాలతో యశోధ ఆసుపత్రిలో ఔట్ పేషెంట్స్‌గా చికిత్స పొందుతుండగా ప్రణీత్, సునీత్ అనే కార్మికులు ఇన్‌పేషెంట్స్‌గా చికిత్స పొందుతున్నారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పడవలో బాణా సంచా పేల్చేందుకు కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తికి 90 శాతం కాలిన గాయాలయ్యాయి. వీరితో పాటు వచ్చిన అజయ్ అనే వ్యక్తి ఆచూకీ లభించలేదు. ఇతనికి ఈత కూడా రాదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. లుంబినీపార్క్ అధికారి జి.ప్రభుదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెక్రటేరియట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గల్లంతైన అజయ్ కోసం కూడా గాలిస్తున్నారు.

**కొంప ముంచిన మద్యం మత్తు...**

రంగంపల్లి రాజు అనే వ్యక్తి బాణాసంచా కాల్చేందుకు కాంట్రాక్ట్ కుదుర్చుకున్నాడు. ఇతను రాజమండ్రి నుండి బాణసంచా తయారు చేసే వారిని ఇక్కడికి తీసుకొచ్చాడు. దీనికిగాను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వద్ద ఎనిమిది లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఆదివారం రంగంపల్లి రాజు తన స్నేహితులైన కృష్ణ, అర్జున్, శ్రీధర్, సుధాకర్, కిషోర్, జహంగీర్‌లను పడవలో అక్కడికి తీసుకెళ్లాడు. ప్రమాదం జరిగినప్పుడు వారు అక్కడే ఉన్నారు. వీరిలో కొందరికి గాయాలయ్యాయి. అయితే ప్రమాదం జరిగినప్పుడు వీరు నీళ్లలోకి కిందికి దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. అయితే వీరంతా ప్రమాదం జరగకముందు పడవలో కూర్చుని మద్యం సేవించినట్లు తెలిసింది. బాణసంచా కాల్చే వారికి కూడా వీరు మద్యాన్ని తాగించినట్లు తెలిసింది. ముందుగా రంగంపల్లి రాజు కాల్చేందుకు ప్రయత్నించగా అవి తిరిగి పడవలోకి దూసుకు వచ్చి ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

**గాయపడిన టూరిజం కార్మికులకు న్యాయం చేయాలి...రాజమౌళి**

హుస్సేన్‌సాగర్ బోట్ ప్రమాదంలో గాయపడిన టూరిజం కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ టూరిజం డెలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి డిమాండ్ చేశారు. గాయపడిన ప్రతి కార్మికుడికి రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. వీరందరికి ప్రభుత్వమే ఉచితంగా వైద్యం అందించాలని, ఇలాంటి ఈవెంట్స్ పేరుమీద జరుగుతున్న ఫైర్‌వర్క్స్ కార్యక్రమాలను రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు పెంచకపోతే యుద్ధమే

### రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసెంబ్లీలో బిల్లు పెట్టి బిసి రిజర్వేషన్లు పెంచాలని, రాజ్యసభ సభ్యులు, అధ్యక్షులు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, వార్డు మెంబర్లలో బిసి రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచకపోతే యుద్ధమే జరుగుతుందని హెచ్చరించారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. బిసి కులగణన పూర్తి చేశారని, దాదాపు 55 శాతం జనాభా ఉన్నట్లు తెలిసిందని, రిజర్వేషన్లు పెంచడానికి జాప్యం ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం బిసి రిజర్వేషన్లు పెంచాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ప్రకటించారని, ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు పెంచడానికి సంబంధించిన ప్రక్రియను ప్రారంభించాలన్నారు. మొదట బిసి రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించాలన్నారు. బిసి జనాభా లెక్కలు ఉన్నాయని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు ఉందని, ఇంకా అసెంబ్లీలో చట్టం చేస్తే చట్టపరమైన, న్యాయపరమైన అవరోధాలు ఉండవని యన అన్నారు. ప్రభుత్వం వచ్చే ఫిబ్రవరి నెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు కులగణన చేయాలని పూర్తి చేశారు. దీని ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలి. కులగణన చేసిన తరువాత రిజర్వేషన్లు పెంచితే న్యాయపరమైన చట్టపరమైన అవరోధాలు ఉండవన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50 శాతం సీలింగ్ అని చెప్పి బిసి రిజర్వేషన్లు పెంచకుండా తప్పించుకుంటే సహించేదిలేదన్నారు. ఇప్పటికే అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టి 50 శాతం సీలింగ్‌పై పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేసిందని, అగ్ర కులాలకు రిజర్వేషన్లు పెంచడానికి మూడు రోజులలో లోక్‌సభ, రాజ్యసభలో రాజ్యాంగ సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారన్నారు. కానీ 50 శాతం జనాభా గల బీద కులాలకు రాజ్యాంగ సవరణ ఎందుకు చేయడంలేదని, దేశంలో ఇదేమి న్యాయమని, పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు.




## ఉద్యోగుల వయోపరిమితి పెంచే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలి

### ఎఐవైఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగుల వయోపరిమితిని పెంచే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్ నగర్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఖండించారు. రాష్ట్రంలో ఉద్యోగుల వయోపరిమితి వయస్సు పెంచాలనే ప్రతిపాదన వల్ల రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో 58 ఏళ్లుగా ఉన్న పదవీ విరమణ వయస్సును ఇప్పటికే 61 ఏళ్లకు పెంచారని, తిరిగి దీనిని మరింత పెంచాలనే ప్రతిపాదన సరైంది కాదన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే ప్రధాన ధ్యేయమని ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, మరో వైపు నిరుద్యోగులను మోసం చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 45లక్షల మంది నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ఈ తరుణంలో ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్లు వేసి తక్షణమే ఉద్యోగ భర్తీని చేపట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఒకవేళ మరోసారి ఉద్యోగ వయోపరిమితి వయస్సును పెంచాలనే కుట్ర చేస్తే ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణ, మజీద్, కళ్యాణ్, అనీల్, అరుణ్ పాల్గొన్నారు.



## సర్వీసు రూల్స్‌ను రూపొందించి, పదోన్నతులను కల్పించాలి

### ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాఠశాల విద్యాశాఖలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీసు రూల్స్‌ను వెంటనే రూపొందించి, ఎంఇఒ, డిప్యూటీ ఇఒ, డైట్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులను కల్పించాలని ఎస్‌టియు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పర్వత్ రెడ్డి, జి.సదానందం గౌడ్, మాజీ ఎంఎల్‌సి పూల రవీందర్, బిసిటిఎ రాష్ట్ర అధ్యక్షుడు కె. కృష్ణుడు, ఎస్‌టియు అసోసియేట్ అధ్యక్షులు జుట్టు గజేందర్, కరుణాకర్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రపతి ఉత్తర్వులు (పిఒ 2018) ఆధారంగా రాష్ట్రంలో ఉపాధ్యాయులకు నూతన సర్వీసు రూల్స్ రూపొందించుకునే వెసులుబాటు ఉన్నదని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం ఇదేనని వివరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారు యోగితా రాణాకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో తొలి ఉపాధ్యాయ సంఘంగా ఎస్‌టియు సంఘం డైరీని అందజేశారు. ఇటీవల జరిగిన స్పౌస్ బదిలీల్లో కొన్ని జిల్లాలలో సీనియారిటీ, సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.



## రైతుల కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### బిసి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతుల కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బిసి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు మంజూరు చేయడం కాంగ్రెస్ పార్టీ వేసిన మరో ముందు అడుగు అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ 4 కీలక పథకాలతో రైతులు, రైతు కూలీలు, ఇళ్లు లేని నిరుపేదలతో పాటు రేషన్ కార్డు లేని పేదలకు ఎంతో మేలు జరగనుందన్నారు. గత 10 ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని వెనుకబడిన తరగతుల వారికి (బిసిలకి) అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు యావత్తు తెలంగాణ రాష్ట్రానికి ఒక ముందడుగు అన్నారు.
దావోసులో జరిగిన ఆర్థిక సదస్సు 2025 తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వరద రావడం హర్షనీయమని శ్రీకాంత్ అన్నారు. ఎవరేమి అనుకున్నా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలోనూ బిసి కులాల కార్యకర్తలంతా స్థానిక సంస్థల ఎన్నికల్లో సమర శంఖారావం పూరించి, గ్రామీణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ఏర్పాటు చేసేందుకు మీ వంతు కృషి చేయాలని బిసి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు.


**CHANGE OF NAME**

I, **LAKAVATHU RAVINDER** (old name), R/o. H.No. 17-81, Kazanagandi Thanda, Jaffergadh Mandal, Jangaon Dist, Telangana State, India. here by declare that I have changed my name **LAKAVATH RAVINDER** (new name) for all purpose.

**CHANGE OF NAME**

I, **BYRUGONDA KARTHIK** (Old Name), **S/o. BHUPAL**, R/o. H.No. 7-92/63/1/990, Devendarnagar, Boduppal Muncipal Corporation, Medipally Mandal, Medchal Dist. - 500092, Telangana. here by declare that I have changed my name **BIRUGONDA MANIKANTA** (New Name) for all purpose.

తెలంగాణ ప్రభుత్వం
**వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయము, గడ్డిఅన్నారం.**

నెం.వ్య.మా.క.గ./ఆర్.బి.జెడ్/1/2/టెండర్స్/2024-25 — టెండరు నోటీసు — తేది: 27-01-2025

వ్యవసాయ మార్కెట్ కమిటి, గడ్డిఅన్నారం పరిధిలోని రైతు బజారు సరూర్ నగర్ నందు ఈ క్రింద చూపబడిన పనికి గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

| క్ర.సం. | టెండరు పేరు | ధరావత్తు (రూ.లు) | టెండరు షెడ్యూల్ (రూ.లు) |
|---|---|---|---|
| 1 | సరూర్ నగర్ రైతుబజార్ నందు ఒక సంవత్సర కాలం Maintenance of Toilet Blocks. | 15,000/- | 1,500/- |
| 2 | వనస్థలిపురం రైతుబజార్ నందు ఒక సంవత్సర కాలం పాటు పార్కింగ్ నిర్వహణ. | 50,000/- | 3,000/- |

1. టెండరు షెడ్యులు కార్యాలయ పనివేళల్లో తేది: 03-02-2025 న జారీచేయబడును.
2. టెండర్ షెడ్యులు దాఖలు చేయు తేది: 07-02-2025 నాడు ఉదయం 10:00 ని.ల నుండి మ.12:00 గ.ల వరకు స్వీకరించబడును మరియు అదే రోజు టెండరు దారుల సమక్షంలో మధ్యాహ్నం 12.30 గం.లకు తెరువబడును.
3. టెండరు షెడ్యులు ధర మరియు ధరావత్తు సొమ్ము రూపాయలు డిమాండు డ్రాఫ్టు ద్వారా Selection Grade Secretary (RBZ), Agril. Market Committee, Gaddiannaram నందు చెల్లుబాటు అగునట్లు ఉండవలయును. ధరావత్తు డి.డి.ని టెండరు షెడ్యూళ్లతో పాటు జతపరిచి దాఖలు చేయవలెను లేనియెడల మీ యొక్క టెండర్ అనుమతించబడదు.

ఎటువంటి కారణము లేకుండానే టెండర్ నిలుపుదల చేయుటకు గాని, రద్దు పరుచుటకు గాని ఈ క్రింది సంతకము దారునికి అధికారము కలదు. ఇతర వివరములకు కార్యాలయము పని వేళలలో ఉ. 10:30 నుండి సా. 5:00 గ.లకు స్వయముగా సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, గడ్డిఅన్నారం.

DIPR R.O. No. : 9705-PP/CL/ADVT/1/2024-25, Date: 27-01-2025

ప్రజాపక్షం
మంగళవారం, జనవరి 28

# సందిగ్ధావస్థలో ఆర్థికమంత్రి

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ సాధనకోసం భారతీయ జనతాపార్టీ బహు ఉదారంగా ఉచిత సహాయ పథకాలు ప్రకటించింది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న 2025–26 యూనియన్ బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పిస్తారు. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు. ఢిల్లీ ప్రజలకు ప్రకటించిన పథకాలు యావత్‌దేశ ప్రజలకు వర్తింపజేయాలా, లేదా? కేంద్రబడ్జెట్‌లో వాటికి స్థానం లేకపోతే ఆమ్ ఆద్మీ పార్టీ అడ్వాంటేజ్ తీసుకుని బిజెపి మోసకారితనాన్ని చెండాడుతుంది. పోలింగ్‌లో ఆప్‌కు మేలు చేస్తుంది. కాగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధి మందగమనంలో ఉండగా, వచ్చే సంవత్సరం ఆశాజనకంగా లేనందున వనరుల కటకట ఆర్థికమంత్రి ముందరికాళ్లకు బంధం వేస్తున్నది. అయినా విద్య, ఆరోగ్యం, మహిళా సంక్షేమాలకు ప్రాధాన్యత తప్పనిసరి. ఇందుకు రెండు కారణాలు చెప్పుకోవచ్చు – 2047 నాటికి వికసిత్ భారత్ వంటి దీర్ఘకాలిక వృద్ధి ఆకాంక్షలు నెరవేరటానికి ఇవి ఆవశ్యకమైన అంశాలు. రెండు, గత సంవత్సరంగా దేశంలో జరిగిన ఎన్నికల్లో కనిపిస్తున్నట్లు యువత, మహిళలు, బిజెపికి ఓటు బ్యాంక్‌గా మారారు.

> ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, ఒత్తిళ్లున్నా బడ్జెట్ కేటాయింపులు పెంచక తప్పదు. దేశంలో వృద్ధిచెందిన సంపదను సొంతం చేసుకున్న కుబేరులపై 2 శాతం సంపద పన్ను విధిస్తే, ఆదాయ పన్ను రేటు పెంచితే అవసరానికి మించి ఆదాయం చేకూరుతుంది. మోదీ ప్రభుత్వానికి ఆ ధైర్యం ఉందా?

ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో బిజెపి విద్య, వైద్యం, మహిళలకు ఎన్నో హామీలు గుప్పించింది. ఈ హామీలకు భిన్నంగా కేంద్ర బడ్జెట్ సమర్పిస్తే అది ఢిల్లీలోనే కాదు, 2025చివర్లో జరిగే బిహార్ ఎన్నికల్లో కూడా అది బిజెపి కూటమికి ఎదురుదెబ్బ కావచ్చు. హామీలు అమలు జరపటం ఆశలు రేకెత్తించినంత సులువుకాదు. ఢిల్లీలో బిజెపి వాగ్దానాలు చూదాం! కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య, పోటీపరీక్షలకు తయారయ్యే యువతకు ఆర్థిక సహాయం. ప్రజలకు రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం, మహిళలకు నెలకు రూ.2500 ఉచిత సహాయం. విద్య, ఆరోగ్యం, మహిళా సంక్షేమం రంగాల్లో ఆప్ పాలన మంచి అభివృద్ధి సాధించింది, ఈ ఎన్నికలకు అదనపు హామీలు గుప్పించింది. బిజెపికి అధికారమిస్తే ఈ ప్రాజెక్టులను ధ్వంసం చేస్తుందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ప్రచారం చేస్తున్నారు. వీటి విషయంలో కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెంచకపోతే అది ఆప్ చేతికి కొరడా ఇచ్చినట్లు కాదా?

మరి వనరులు ఎలా? అనే సంశయం ఆర్థికమంత్రిని పీడిస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థ 2024–25 జులై–సెప్టెంబర్ త్రైమాసికంలో నిజవిలువలో చూచినపుడు 5.4శాతమే వృద్ధి సాధించింది. ఆర్‌బిఐ అంచనా 7 శాతానికి భారీ తూటు పడింది. ఈ సంవత్సరం మొత్తంమీద వృద్ధిరేటు లోగడ అంచనా వేసిన 7.2శాతానికి భిన్నంగా 6.6 శాతమే ఉంటుందని తాజా అంచనా. 2021–22లో 8.7శాతం, 2022–23లో 7.2శాతం, 2023–24లో 8.2శాతం వృద్ధిరేటుతో పోల్చితే వర్తమాన సంవత్సరం ప్రభుత్వానికి ఎంతటి కటకటో ఊహించుకోవచ్చు.

దేశ విద్యారంగం ప్రస్తుతం పరివర్తన దశలో ఉంది. 2020 నూతన విద్యావిధానాన్ని విద్య అన్ని స్థాయిల్లో అమలు చేయాలి. రెండు, నైపుణ్యాలు వృద్ధిచేస్తూ డిజిటల్ విద్యను, ఎఐ ప్రవేశంతో విద్య–టెక్‌ను ప్రవేశపెట్టాలి. విద్యకు 2024–25 బడ్జెట్‌లో కేటాయింపు రూ.1,20, 628కోట్లు. దీని పెంపుదల అవసరం. ప్రజారోగ్య వసతులను, సేవలను విస్తరించాల్సి ఉన్నందు న వైద్య రంగం బడ్జెట్‌ను 2024–25 కేటాయింపు రూ.87,657 నుండి లక్షకోట్లకు పైగా పెంపు చేయాల్సి ఉంది. పెంచకపోతే ప్రధాని మోదీ ప్రకటించిన ప్రజారోగ్య పథకాలు సరైన అమలుకు నోచుకోకుండా అప్రతిష్ఠ చేకూర్చుతాయి. తమ ప్రజారోగ్య బడ్జెట్‌ను కనీసం 10శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తద్విరుద్ధంగా వ్యవహరించగలదా? ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, ఒత్తిళ్లున్నా బడ్జెట్ కేటాయింపులు పెంచక తప్పదు. దేశంలో వృద్ధిచెందిన సంపదను సొంతం చేసుకున్న కుబేరులపై 2 శాతం సంపద పన్ను విధిస్తే, ఆదాయ పన్ను రేటు పెంచితే అవసరానికి మించి ఆదాయం చేకూరుతుంది. మోదీ ప్రభుత్వానికి ఆ ధైర్యం ఉందా?

# శ్రమజీవుల ప్రజా రిపబ్లిక్ ఉద్యమం



డివివిఎస్ వర్మ

1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చింది. దేశం రిపబ్లిక్‌గా అవతరించింది. నాటినుండి ప్రభుత్వ పరంగా రిపబ్లిక్ దినోత్సవాలు జరుగుతున్నాయి. అవి ప్రభుత్వ శాఖలు, సంస్థలకే పరిమితమై, ప్రజల భాగస్వామ్యం లేకుండా సాగిపోతున్నాయి. రాజ్యాంగం మనందరిదీ. మనకు మనమే సమర్పించుకున్న రాజ్యాంగం. ఈ రాజ్యాంగానికి మనమే యజమానులం.

దేశంలో అత్యధిక సంఖ్యాకులు శ్రమజీవులు. పరిశ్రమలలో కార్మికులుగా, అసంఘటితరంగ శ్రామికులుగా, వృత్తి సంఘాల సభ్యులుగా, వ్యవసాయకూలీలుగా, కౌలు రైతులుగా, స్వయంగా సాగుచేస్తున్న రైతులుగా పలు రంగాల్లో వున్నారు. అలాగే వివిధ రంగాల్లో సమాజానికి సేవలు అందిస్తున్న వారు వున్నారు. దేశ సంపద ఉత్పత్తిలో ఈ శ్రమజీవులే కీలక పాత్ర పోషిస్తున్నారు. దేశంలో అన్ని రంగాలకు శిరోధార్యంగా వున్న రాజ్యాంగ కార్యకలాపాల్లో ప్రజల భాగస్వామ్యం వుండితీరాలి. అలాంటి భాగస్వామ్యాన్ని మనకు మనమే కల్పించుకోవాలి. ప్రజా రిపబ్లిక్ దినోత్సవం మనకోసం మనమే నిర్వహించుకోవాలి.

ఆర్థికరంగంలో సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్న సకల రంగాల శ్రమజీవులు రాజకీయరంగంలో కేవలం ఓటర్లుగానే మిగిలిపోకూడదు. రాజ్యాంగం మీద రాజకీయంగా జరుగుతున్న దాడిని రాజకీయంగా ప్రతిఘటించడానికి సిద్ధపడాలి.

కేంద్రంలో అధికారంలో వున్న మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరిచి, దానిని మార్చడానికి అడుగులు వేస్తున్నది. మోదీ ఎలాంటి దాపరికం లేకుండా తనకు తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. మెజారిటీ జాతీయవాదానికి వీలుగా పౌరసత్వ చట్టాలను తెచ్చారు. మత విద్వేష రాజకీయాలు చేస్తున్నారు.

## రాజ్యాంగ రక్షణకు శ్రమజీవులు నడుం కట్టాలి

బిజెపి మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ బహిరంగంగానే రాజ్యాంగాన్ని సవాలు చేస్తున్నది. హిందూ రాష్ట్ర నినాదం త్వరలోనే సాకారం కానున్నదని ప్రకటించింది. భారత రాజ్యాంగం పట్ల ఆర్‌ఎస్‌ఎస్ వైఖరి అందరికీ తెలిసిందే. రాజ్యాంగం ఆమోదించినప్పుడే వారు వ్యతిరేకించారు. ఇది అతుకుల బొంత రాజ్యాంగం అన్నారు. దీనిలో జాతీయత లేదన్నారు. అంతటితో సరిపెట్టుకోలేదు. ప్రపంచ ప్రశంసలు పొందిన మనుధర్మ శాస్త్రమే దేశానికి తగిన రాజ్యాంగం అని ప్రకటించారు.

ఇప్పుడు జరుగుతున్నది రాజ్యాంగానికి, ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదానికి మధ్య సంఘర్షణ. రాజ్యాంగాన్ని మట్టుపెట్టే యత్నాలకు వ్యతిరేకంగా ఈ సంఘర్షణలో శ్రమజీవులు పాత్రధారులు కావాలి. ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదం దేశాన్ని మత రాజ్యంగా మారుస్తుంది. మత రాజ్యాలలో రాజ్యాంగాలు వుండవు. మత గ్రంథాలే రాజ్యాంగం పాత్ర నిర్వహిస్తాయి. హిందూ రాష్ట్రలో మనుధర్మ శాస్త్రం రాజ్యాంగం అవుతుంది.

శ్రమజీవుల పని విభజన అర్హతను బట్టి కాకుండా కులాలనుబట్టి నిర్ణయమౌతుంది. హిందూ రాష్ట్రలో శ్రమజీవులు శాశ్వతంగా కట్టుబానిసలౌతారు. కుల విభజన శ్రమజీవుల ఐక్యతకు భంగం కలిగిస్తుంది. మత రాజ్యాలలో ప్రజాస్వామ్యం వుండదు. పౌర హక్కులకు చట్టబద్ధత వుండదు.

శిక్షలు తప్పును బట్టి కాకుండా కులాల ఆధారంగా వుంటాయి.

మత రాజ్యాలలో ఓటు హక్కు, ఎన్నికలు వుండవు. నియంతలే వుంటారు. ప్రస్తుతం ఓటు హక్కు వున్నందునే వివిధ పథకాలు పేరుతో రాజకీయం శ్రమజీవులను పట్టించుకోక తప్పడంలేదు. ప్రభుత్వాలను మార్చే శక్తి మన ఓటులో వుంది.

మత రాజ్యాలలో వివక్ష వుంటుంది. మైనారిటీ మతస్థులు సమాన హక్కులు లేని రెండవ తరగతి పౌరులౌతారు. మహిళలు, దళితులు, బహుజనుల పట్ల వివక్ష కొనసాగుతుంది.

అందువల్ల శ్రమజీవులు సమైక్యంగా రాజ్యాంగ రక్షణకు పూనుకోవాలి. హిందూ రాష్ట్ర నినాదాన్ని రాజకీయంగా ఎదుర్కొనాలి.

ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదం దాడి నుండి రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ఎంత అవసరమో రాజ్యాంగ ఫలాలను దక్కించుకోడానికి తగిన విధంగా దానిని అమలు చేయించడానికి ఉద్యమించడమూ అంతే అవసరం. ఈ ఉద్యమానికి కూడా ప్రజా రిపబ్లిక్ దినోత్సవం వేదిక కావాలి.

## రాజ్యాంగం పీఠిక ఆదేశం ఏమైంది?

రాజ్యాంగం పీఠిక ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించాలని ప్రకటించింది. కాని సామాజిక రంగంలో కుల వివక్ష, మహిళల పట్ల వివక్ష, మైనారిటీల పట్ల వివక్ష నేటికీ కొనసాగుతున్నది. అమానుషమైన దాడులు, అత్యాచారాలు, హత్యాకాండ సాగిపోతున్నది.


> ఇప్పుడు జరుగుతున్నది రాజ్యాంగానికి, ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదానికి మధ్య సంఘర్షణ. రాజ్యాంగాన్ని మట్టుపెట్టే యత్నాలకు వ్యతిరేకంగా ఈ సంఘర్షణలో శ్రమజీవులు పాత్రధారులు కావాలి. ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదం దేశాన్ని మత రాజ్యంగా మారుస్తుంది. మత రాజ్యాలలో రాజ్యాంగాలు వుండవు. మత గ్రంథాలే రాజ్యాంగం పాత్ర నిర్వహిస్తాయి. హిందూ రాష్ట్రలో మనుధర్మ శాస్త్రం రాజ్యాంగం అవుతుంది.

వివక్ష వున్నచోట సమానత్వం వుండదు. ప్రజాస్వామ్య విలువలు వుండవు. సమాన అవకాశాలు వుండవు. శ్రమజీవులు వివక్షకు తావులేని ప్రజా రిపబ్లిక్‌ను సాధించుకోవాలి. రాజ్యాంగం అందరికీ ఆర్థిక న్యాయం జరగాలని ప్రకటించింది. దీనికి సమాజంలో అంతరాలు తగ్గాలి. అందరికీ అవకాశాలు లభించాలి. కాని గత 10 సంవత్సరాలలో అంతరాలు విపరీతంగా పెరిగాయి.

1 శాతం మంది కార్పొరేట్లు, బిలియనీర్ల దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడింది. 10శాతం మంది దగ్గర 78శాతం దేశ సంపద గుట్ట పడింది.

ఈ కార్పొరేట్లకే కేంద్ర ప్రభుత్వం 20 లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు, రుణమాఫీలు ఇచ్చింది. 60శాతంగా వున్న సామాన్యులు, పేదల దగ్గర కేవలం 5 శాతం సంపద మాత్రమే వుంది. అత్యధిక ఆర్థిక అంతరాలున్న దేశాల్లో మన దేశం అగ్రస్థానంలో వుంది. దేశ ప్రజలకు ఆర్థిక న్యాయం అన్నది అర్థరహితంగా మారింది.

సకల తరగతుల శ్రామికులు కేవలం నెల జీతగాళ్ళు, రోజు వారీ కూలీలు మాత్రమే కాదు. వీరే సరుకులను, సంపదను, సేవలను



భారత రాజ్యాంగ పీఠిక

భారతదేశ ప్రజలమైన మేము, భారత దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి పౌరులందరికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, నమ్మకం, ఆరాధనల్లో స్వాతంత్ర్యాన్ని, హోదాల్లోనూ, అవకాశాల్లోనూ సమానత్వాన్ని చేకూర్చడానికి మరియు వారందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ ఐక్యతను మరియు సమగ్రతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి 1949, నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్‌లో ఎంపిక చేసుకొని శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాం.

సృష్టిస్తున్నారు. ఈ సంపదలో తగిన వాటా వారికి దక్కడం లేదు.

## ఆదేశిక సూత్రాలు అటకెక్కాయి

రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం దేశ సంపద, సహజవనరులు ప్రజలందరికీ చెందాలి. దీనికి విరుద్ధంగా మోదీ ప్రభుత్వం అడవులను, గనులను, సముద్రతీరాలను తన కార్పొరేట్ మిత్రులకు ధారాదత్తం చేసింది. వాటినుండి కోట్లాది రూపాయల సంపదను ప్రయివేటు వ్యక్తులు సొంతం చేసుకుంటున్నారు.

మరో ఆదేశిక సూత్రం ప్రకారం సంపద కొద్దిమంది దగ్గర పోగుపడకూడదు. కాని పోగుపడింది. దానిని వికేంద్రీకరించాలి. ఈ సంపదలలో తగిన వాటా శ్రమజీవులకు దక్కాలి. కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపదను పునఃపంపిణీ చెయ్యాలి. కార్పొరేట్ పన్ను పెంచడం, వారసత్వ పన్ను, సంపద పన్ను విధించడం ద్వారా దాదాపు 20 లక్షల కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరుతుందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ అదనపు నిధులతో జాతీయ సంక్షేమ నిధిని ఏర్పాటు చెయ్యాలి.

ఈ సొమ్ముతో శ్రమ జీవులందరికీ హక్కుగా నివాసం, ఆహార భద్రత, విద్య, వైద్య సదుపాయాలు, కనీస మౌలిక ఆదాయం కల్పించాలి. ఈ నిధుల నుండి రైతుల పంటలకు లాభసాటి ధరలు, నిరుద్యోగానికి శాశ్వత పరిష్కారాలు సాధించాలి.

ఆదేశిక సూత్రాలలో కార్మికులకు పరిశ్రమల యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించాలని సూచిస్తే దానికి విరుద్ధంగా కార్పొరేట్ల ప్రయోజనాలకోసం కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను ఈ ప్రభుత్వం తెచ్చింది. కార్మికులకు హేతుబద్ధమైన పనిగంటలు వుండాలని ఆదేశిక సూత్రాలు ఘోషిస్తుంటే ఈ ప్రభుత్వం 12–16 గంటల పని దినానికి జెండా ఊపింది. ఈ తరహా రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైన ప్రతి చర్యను శ్రమజీవులు ప్రతిఘటించాలి.

ప్రజా రిపబ్లిక్ అన్నది శ్రమజీవుల రాజకీయ నినాదం.బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ల రాజకీయాలను, భావజాలాలను ఓడించడం ఒక లక్ష్యం. కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపద పునఃపంపిణీ ద్వారా శ్రమజీవులందరికీ గౌరవప్రదమైన స్వతంత్ర జీవనాన్ని సాధించడం మరో లక్ష్యం. దోపిడీ, వివక్షలు లేని సమాజాన్ని సాకారం చేసుకునే అంతిమ లక్ష్యానికి సాగిపోవాలి. పలు రంగాలలో చీలిపోయిన శ్రమజీవులు, వివక్ష తరగతుల సమూహాలు ఒక్కటైతే అది ప్రజా ఉద్యమం అవుతుంది, ఉప్పెనగా మారుతుంది. అసాధ్యాలను సుసాధ్యం చేస్తుంది.

**'దారి దీపం' సంపాదకులు , 8500678977**

# బ్రిటిష్ పాలకుల సింహస్వప్నం 'పంజాబ్ సింహం'



పంజాబ్, దుడుకే గ్రామంలో ఒక సాధారణ కుటుంబంలో మున్షీ రాధాకృష్ణ గులాబ్ దేవి దంపతులకు 28, జనవరి 1865న జన్మించిన లాలా లజపతి రాయ్ చిన్ననాటి నుంచే తల్లిదండ్రుల నుంచి ప్రేరణను పొంది దేశభక్తి, అంకితభావం, క్రమశిక్షణలతో పెరిగారు. స్వంత గ్రామంలో పాఠశాల విద్యను పూర్తిచేసి లాహోర్ ప్రభుత్వ కళాశాలలో న్యాయ పట్టా పొందారు. ఆర్య సమాజ్ ఉద్యమం నడిపిన స్వామి దయానంద్ సరస్వతి ప్రేరణతో సంఘ సంస్కర్తగా, జాతీయ భావాలను నరనరాన జీర్ణించుకున్నా రు.

**పంజాబ్ కేసరి.. లాలా లజపతి రాయ్:**

స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, రచయిత, దార్శనికుడు అయిన లాలా లజపతి రాయ్ ధైర్యసాహసాలు అనన్య సామాన్యమైనవి. బెంగాల్ విభజన, సహాయ నిరాకరణ, సైమన్ కమీషన్ వ్యతిరేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని వేలమంది సాధారణ ప్రజలను స్వతంత్ర పోరాటంలో పాల్గొనే విధంగా మేల్కొలిపారు. నా శరీరంపై తెల్లోడి ప్రతి దెబ్బ బ్రిటీష్ పాలన శవపేటికకు మేకులు అవుతాయి అనే వాక్యం లాలా లజపతిరాయ్ దేశభక్తి, భరతమాత స్వేచ్ఛలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. స్వయంపాలన కోసం స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్న లాలా లజపతి రాయ్ తన మిత్రులు బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్లతో కలిసి లాల్‌బాల్‌పాల్ అనే పేరుతో త్రయంగా పోరాటాలు కొనసాగించారు. స్వతంత్ర పోరాటంతో పాటు ప్రముఖ రచయితగా యంగ్ ఇండియా, ఇంగ్లాండ్స్ డెట్టు ఇండియా, ది స్టోరీ ఆఫ్ మై డిపోర్టేషన్ అనే పుస్తకాలు రచించారు. దీనికి తోడుగా విద్య ప్రాధాన్యాన్ని ప్రచారం చేయడం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా అవగాహన, మహిళా సాధికారత లాంటి సంఘ సంస్కరణ యజ్ఞాల్లో సమిధగా సేవలు అందించారు. స్వతంత్ర భారత చరిత్రలో ఒక ముఖ్య అధ్యాయంగా లాలా లజపతి రాయ్ నిలుస్తున్నారు. వారి ఆదర్శ, నిస్వార్థ, త్యాగమయ జీవితం నేటి యువభారతానికి దారిదీపం కావాలని ఆశిద్దాం.

**డా॥బిఎంఆర్**

# బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యతివ్వాలి

లేఖ

విద్య ఒక ప్రాథమిక హక్కు అలాంటి విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 10శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని అనేక కమిషన్లు సూచించాయి. అయినా కేంద్ర ప్రభుత్వం ఆ సూచనలు పట్టించుకోవడం లేదు. ఆ స్థాయిలో కేటాయింపులు చేయలేదు. గత పది ఏళ్లుగా బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆశించినంతమేర బడ్జెట్‌లో విద్యకు నిధులు ఇవ్వలేదు. దేశంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి 10శాతం నిధులు కేటాయిస్తేనే విద్యారంగం ముందుకు వెళ్తుంది. దేశంలో ప్రవేట్, విదేశీ యూనివర్సిటీలను ప్రోత్సహించకుండా ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులను కేటాయిస్తే భారతదేశంలో ఉన్నత విద్య మరింత బలోపేతం అవుతుంది. ప్రభుత్వం బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంతం నుంచి విద్య బలోపేతం అయ్యేలా నిధులు కేటాయించాలి. గ్రామాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఉండే పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, మరుగుదొడ్లు, రక్షిత మంచినీటి సౌకర్యం, విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంపు వంటి వాటిపై నిధులు కేటాయించాలి. యూనివర్సిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్ లు సకాలంలో విడుదల చేసేలా నిధులు కేటాయించాలి.

తెలంగాణ విభజన హామీ చట్టం ప్రకారం కేటాయించాల్సిన వాటిని పది ఏండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి బిజెపి ప్రభుత్వం పదిసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా.. విభజన హామీ ప్రకారం తెలంగాణకి కేటాయించాల్సిన విద్యా సంస్థలను కేటాయించలేదు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపిలు ఉంటే అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ లో కేటాయింపులు అధికంగా జరగడం లేదు.

ఎన్నికల సందర్భంగా అనేక సభల్లో ఆనాటి పిసిసి అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే విద్యకు బడ్జెట్ లో 15 శాతం నిధులు కేటాయిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించారు. వాస్తవానికి రాష్ట్ర బడ్జెట్ లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని కొఠారి కమిషన్ సూచించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం చివరగా 11 శాతం నిధులు కేటాయించగా.. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ళలో కేవలం 7శాతం నిధులు ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ 15 శాతం కేటాయిస్తామని అంటే అందరు నమ్మారు. కానీ పార్టీ అధికారంకి వచ్చిన మొదటి బడ్జెట్‌లో 7శాతం నిధులు మాత్రమే కేటాయించారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన గదుల నిర్మాణం వారికి పెట్టే ఒకపూట భోజనం అయిన నాణ్యమైన భోజనం అందించాలి. యూనివర్సిటీలకు అధిక ప్రాధాన్యత నిస్తూ నిధులు కేటాయించాలి. రాష్ట్రంలో విద్యాశాఖ సిఎం రేవంత్ రెడ్డి గారి దగ్గర ఉంది. అలాంటప్పుడు రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి బడ్జెట్‌లో అధికశాతం నిధులు కేటాయించి విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలి.

**కసిరెడ్డి మణికంఠ రెడ్డి**

# పని గంటల పెంపునకు పెట్టుబడిదారుల ఒత్తిడి

**అరుణ్ శ్రీవాస్తవ**

దేశంలో కార్పొరేట్ రంగం ఆకస్మికంగా కార్మికుల పనిగంటలు పెంచేందుకు ఒత్తిడి చేయడం, తక్కువ వేతనాలు చెల్లించడం కార్మికుల శ్రమ విలువకు ఎంతమాత్రం పొసగ దు. ఇలాంటి ఒత్తిడులన్నీ భారత ఆర్థికవ్యవస్థ స్వభావం మార్పులకు గురవుతున్నదనీ, పారిశ్రామిక పెట్టుబడి సంబంధాలు భారత ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా ఆవరించుకుంటున్నాయన్న భయంకరమైన సందేశాన్ని తెలియజేస్తున్నాయి. అవసరమైనదానికంటే మరింతగా ఉత్పత్తి చేసేందుకు ఎక్కువ గంటలు పనిచేసేలా కార్మికులను పెట్టుబడిదారులు దోపిడీ చేస్తారని కారల్‌మార్క్స్ తన సిద్ధాంతం ద్వారా ప్రపంచానికి తెలియజెప్పారు. పారిశ్రామిక అధిపతులు సరిగ్గా ఈ వాదనే చేస్తున్నారు. కానీ ఉద్యోగులు, కార్మికుల వేతనాలు పెంచాలా? లేక వారి పనిగంటలకు అనుగుణంగా వేతనాలు పెంచాలా? అనే విషయాన్ని ఏ ఒక్క కార్పొరేట్ అధిపతిగానీ, పెట్టుబడిదారులుగానీ ఇప్పటివరకూ ఒక స్పష్టమైన ప్రకటన చేయలేదు. అదనపు పనిగంటలతో శ్రమశక్తి దోపిడీవల్ల లభించే మిగులు విలువను విక్రయించి, తద్వారా వచ్చే లాభాలతో మళ్ళీమళ్ళీ పునరుత్పత్తు లు చేయాలనే పెట్టుబడిదారీ మూలసిద్ధాంతానికి శ్రామికు ల పని గంటలకు మధ్య వివాదం ఉంది. ఇప్పుడు పని కాలా న్ని పెంచాలన్న పారిశ్రామికవేత్తల వైఖరి వారి దోపిడీ సంకల్పాన్ని ధృవీకరిస్తున్నది. భారత పారిశ్రామికాధిపతులు దేశంలో పని వేళలను వారానికి 70 గంటలకు పెంచాలని బొబ్బలు పెడుతున్నారు. వారిలో మరి కొందరు 90 గంటల కు పెంచాలని వాదిస్తున్నారు. దీనివల్ల కార్మికుడు కుటుంబ జీవితాన్ని, విశ్రాంతి సమయాన్ని తను పనిచేసే పరిశ్రమ అభివృద్ధి ప్రయోజనాలకోసం బలవంతంగా త్యాగం చేయవలసి వస్తుంది. చాలా వైరుధ్యమైన, పరిహాసాస్పదమైన విషయం ఏమిటంటే, దేశంలో పారిశ్రామిక తయారీ ఉత్పత్తులు క్రమంగా క్షీణిస్తున్నాయి. ప్రతి పరిశ్రమలో జోడించి న స్థూల విలువ (జివిఎ) 2022–2023 ఆర్థిక సంవత్సరం కంటే 2023–2024 ఆర్థిక సంవత్సరంలో 6.7 శాతం మేరకు పడిపోయింది. అదే సమయంలో ప్రతి కార్మికుడి స్థూల విలువ జోడింపు (జివిఎ)4.2 శాతం మేరకు తగ్గింది. చట్టబద్ధంగా రిజిస్టరు కాని కార్పొరేటేతర, ప్రభుత్వేతర రంగం (ఎఎస్‌యుఎస్ఇ)లో ఉత్పత్తి, ఉత్పాదకత, సేవలకు సంబంధించి చేసిన వార్షిక సర్వే ప్రకారం అటు వ్యవస్థాగత, వ్యక్తిగతస్థాయిల్లో కూడా ఉత్పాదకత తగ్గింది.

ప్రస్తుతం ప్రపంచంలో నెలకున్న ఆర్థిక పరిస్థితుల్లో, కార్మికుల పనిగంటలను పెంచడానికి ప్రభుత్వాన్ని ప్రభావి తం చేసేందుకు జరిగే ప్రయత్నాలు రాబోయే కాలానికి అరిష్ట సంకేతం. తయారీ రంగం క్షీణిస్తున్న సమయంలో పరిశ్రమల్లో కార్మికుల పనిగంటలు పెంచాలన్న డిమాండ్‌ను ముందుకు తీసుకురావడం, చర్చకు పెట్టడం ఎంతమాత్రం యాదృచ్ఛికం కాదు,అది భారత కార్మికవర్గాన్ని సమూలంగా అణచివేసేందుకు మితవాద రాజకీయశక్తుల సహాయం తో పారిశ్రామిక అధిపతులు చేస్తున్న ఉద్దేశపూర్వ క చర్య. కేంద్రంలో అధికారంలో ఉన్న కాషాయశక్తుల అభివృద్ధికి, వారి విస్తరణ మార్గానికీ భారత కార్మికవర్గం అతిపెద్ద ఆటంకంగా పరిగణించబడుతున్న ది.

ప్రస్తుతం భారత కార్మిక విపణి చాలా అధ్వాన్నస్థితిలో ఉంది. నిరుద్యోగం తీవ్రస్థాయిలో ఉంది. ప్రత్యేకించి యువతరంలో నిరుద్యోగం ఎక్కువగా ఉంది. 15ఏళ్ళు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న యువతరంలో నిరుద్యోగం 3.2 శాతం కంటే ఎక్కువగా ఉంది. 15–29 మధ్య వయసుగల యువతరంలో నిరుద్యోగం 10.2 శాతానికి పెరిగిం ది. గ్రామీణ ప్రాంతాలలోకంటే పట్టణ ప్రాంతాలలోనే నిరుద్యోగం ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాలలో మహిళలకంటే పట్టణ ప్రాంతాలలో మహిళలలోనే నిరుద్యోగం ఎక్కువగా ఉంది. సాధారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలోకంటే పెట్టుబడిదారీ దేశాలలో కార్మికులకు పనిగంటలు తక్కువగా ఉంటాయి. ఈ పెట్టుబడిదారీ దేశాలలో కొన్ని ఇటీవలికాలంలో ఆ పని గంటలను కూడా తగ్గించాయి. కానీ భారతీయ పెట్టుబడిదారీ పరిశ్రమాధిపతులు మాత్రం దేశంలో కార్మికుల పనిగంటలను పెంచడంకోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో కార్మికులకు వేతనాలు, ఆదాయాలు పెరుగుతూ ఉంటాయి. దాంతోపాటు కార్మికులకు మరింత ఎక్కువ విశ్రాంతి సమ యం కూడా దొరుకుతుంది. కానీ భారతదేశంలో పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. భారతదేశంలో విశ్రాంతి సమయం అనేదానికి వక్రభాష్యాలు తప్ప సరైన అవగాహనలేదు.

పనిగంటలను పెంచడంద్వారా లాభాలను బహుముఖంగా పెంచుకోవాలని పెట్టుబడిదారులు ఆశిస్తున్నారా? అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశంలో ఉన్నతాధికారులు కూడా ఇదే ఆలోచనను నమ్ముతున్నారా? జాతీయ ఆదాయానికీ, సగటు పని గంటలకు మధ్య ఒక సంబంధం ఉంది. వ్యాపార, వాణిజ్యాలపరంగా కార్పొరేట్ రంగం వైఖరి స్వభావం మారింది. తయారీరంగంలో ధనాన్ని భారీ గా పెట్టుబడిగా పెట్టేందుకు వారు సిద్ధంగా లేరు. అత్యంత ధనికదేశంగా, అభివృద్ధిచెందిన దేశంగా మార్చేందుకు జరుగుతున్న అన్వేషణలో భాగంగా కార్పొరేట్ రంగంలోని వారంతా ఇప్పుడు అడ్డదారులు తొక్కుతున్నారు. తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా వారంతా స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ ద్వారా భారీ లాభాలు సాధించడంపైనే మోజు చూపిస్తున్నారు.



ఉత్పత్తిదారులకు, కొనుగోలుదారులకు మధ్య దళారులుగా ట్రేడింగ్ కంపెనీలు పనిచేస్తున్నాయి. అది ఉత్పత్తుల పంపిణీకి మార్గం సుగమం చేస్తాయి. అనేక కర్మాగారాల నుండి వివిధ రకాలైన వస్తూత్పత్తుల జాబితాను సంపాదించి తమవద్ద ఉంచుకుంటాయి. చైనా ఉత్పత్తులు భారతీయ మార్కెట్‌లను ముంచెత్తుతున్నాయి. ఐతే భారత కార్పొరేట్ రంగం మాత్రం మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సరికొత్త, విభిన్నమైన వస్తువులను సృష్టించి మార్కెట్‌లోకి పంపేందుకు ఆసక్తి చూపడంలేదు. ఎందుకంటే ఈ పనిచేయాలంటే చాలా పెట్టుబడి పెట్టాలి. అది ఖరీదైన వ్యవహారం. కానీ ట్రేడింగ్ విషయానికి వస్తేమాత్రం, చాలా సులభంగా లాభాలు సంపాదించుకోవచ్చు. తయారీరంగంలో పెట్టుబడికంటే ఎక్కువ ప్రయోజనం ఇక్కడే లభిస్తుందని భావిస్తున్నారు. సరుకుల సేకరణలో వ్యాపారానికి ట్రేడింగ్ కంపెనీలదే కీలకపాత్ర.

భారత ప్రభుత్వ జాతీయ గణాంకాల కార్యాలయం "భారత్‌లో పనిగంటల వినియోగం–2019" అనే విషయంపై ఒక నివేదిక ప్రచురించింది. దీని ప్రకారం దిగ్భ్రాం తి కలిగించే వాస్తవాలు వెల్లడయ్యాయి. దేశంలో 15 నుండి 59 ఏళ్ళు లోపు వయసుగల పట్టణ ప్రాంత కార్మికులు ఒక రోజుకు సగటున 521నిమిషాలు పని ప్రదేశాల్లో పని చేస్తున్నారు. అంటే లెక్కగడితే వారానికి 60 గంటల 47 నిమిషా లు వారు ప్రత్యక్ష ఉద్యోగాలు, సంబంధిత కార్యకలాపాల్లో నే గడుపుతున్నారు. దీని ప్రకారం చూస్తే చట్టబద్ధంగా వారానికి 48 గంటలు మాత్రమే పనిచేయాలనే నియమం బూటకం అవుతుంది. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలో కూడా 15 నుండి 59 ఏళ్ళు లోపు వయసుగల మహిళలు జీతం తీసుకున్నా, తీసుకోకున్నా సగటున రోజుకు 13 గంటలు పనులు చేస్తున్నారు. ఇది వారి రోజువారీ నిత్యజీవన విధాన వాస్తవాలను వెల్లడిస్తున్నది.

ఈ అధికారిక నివేదికల్లో వాస్తవాలను అణగదొక్కిన నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారీ అనుకూల ప్రయోజనాలను మాత్రమే ప్రోత్సహిస్తున్నది. దీని ఫలితంగా ఈ వాస్తవాల గురించి రాజకీయ వర్గాల్లో చర్చ జరగడంలేదు. ఈ పరిస్థితుల్లో దేశంలో కార్మికుల పని గంటలను పెంచినట్లయితే వినాశకరమైన పరిణామాలు సంభవిస్తాయి. బహుముఖ కష్టాలు వచ్చిపడతాయి. ఈ పరిస్థితులు 1886 లో అంటే 137 ఏళ్ళ క్రితం అమెరికాలో కార్మికులు చేసిన త్యాగపూరితమైన చారిత్రక పోరాటాలను గుర్తుచేస్తున్నా యి. ఎనిమిది గంటల పనిహక్కును సాధించుకోవడంకోసం ఆనాడు అమెరికాలో కార్మికులు వీధుల్లోకి వచ్చారు. ఎనిమిది గంటలు పనిప్రదేశంలో గడపడం, మరో ఎనిమిది గంటలు విశ్రాంతి తీసుకోవడం, మరో ఎనిమిది గంట లు తమ పనులకోసం విరామంగా గడపడం అనే డిమాండ్‌ను సాధించుకోవడానికి వారు పోరాటం చేశారు. ఆ పోరాటం ద్వారా యావ త్ ప్రపంచంలో కార్మికవర్గం తమ హక్కులు సాధించుకుంది.

కానీ పారిశ్రామికవేత్తలు కూడా కార్మికవర్గానికి నిర్దేశించిన ఈ మార్గదర్శకాలను నిర్లక్ష్యం చేయాలనే చూస్తారు. వారు పెట్టుబడిదారీ పద్ధతులలో వస్తు తయారీ, ఉత్పత్తి నమూనాలను అనుసరించినప్పటికీ వారి వైఖరి మాత్రం సంపూర్ణంగా భూస్వామ్య పద్ధతులలోనే ఉంటున్నది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 48 గంటలు కంటే ఎక్కువగా కార్మికులు పనిచేయడం మితిమీరిన శ్రమేనని చెప్పిన విషయాన్ని ఈ నేపథ్యంలో గుర్తుచేసుకోవాలి. ఎందుకంటే అంతకంటే ఎక్కువ గంటలు గనుక కార్మికులు పనిచేస్తే వారి ఆరోగ్యం, భద్రత, ఉత్పాదకతలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. పని గంటలకు, వ్యక్తిగత జీవితానికిమధ్య సమతుల్యత దెబ్బతింటుంది. చివరకు కార్మిక ఆర్థికవేత్తలు కూడా ఈ విషయాలనే సమర్థిస్తున్నారు. అలసిపోయిన కార్మికుడి నుండి, ఎక్కువ గంటలు పనిచేసిన కార్మికుడి నుండీ నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉత్పత్తిని ఆశించలేం.

మహీంద్రాగ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా చెప్పిన మాటలు ఎవరికైనా మనసుకు సంతోషం, ఆహ్లాదం కలుగుతుంది. "ఒక కార్మికుడు ఎన్ని గంటలు పనిచేశాడనే విషయానికంటే ఆ కార్మికుడు ఎంత నాణ్యతా ప్రమాణాలతో పనిచేశాడనే విషయానికే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది" అని ఆనంద్ మహీంద్రా చెప్పారు. పని గంటలు పెంచాలనే వాదనలకు విరుద్ధంగా ఆయన బాహాటంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఎంతో ప్రభావశీలమైన పనిని తక్కువ సమయంలో కూడా చేయవచ్చునని ఆయన అన్నారు. లారెన్స్ అండ్ టుబ్రో కంపెనీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రమణ్యన్ చేసిన వాదనను ఆయన వ్యతిరేకించారు. కార్మికులు వారానికి 90గంటలు పనిచేయాలని సుబ్రమణ్యన్ వాదిస్తున్నారు. స్నేహితులతో, కుటుంబంతో కార్మికు లు సమయాన్ని గడపడం, పుస్తకాలు చదవడం వంటి చర్యలన్నీ వారు ఉత్తమ నిర్ణయాలు తీసుకోవడానికి దోహదం చేస్తాయని ఆనంద్ మహీంద్రా చెప్పారు.

*(ఐపిఎ సర్వీస్)*

# నాది 'ఇండియన్.. డిఎన్ఎ'నే

ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో వెల్లడి

రాష్ట్రపతి ముర్ము ఏర్పాటు చేసిన విందులో మాట్లాడిన గణతంత్ర దినోత్సవాల ముఖ్యఅతిథి

ఇండోనేషియాకు, భారత్‌తో లోతైన సంబంధాలు ఉన్నాయని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** ఇండోనేషియాకు భారతదేశంతో లోతైన సంబంధాలు ఉన్నాయని, ఇండోనేషియా పేర్లు సంస్కృతం నుంచే వచ్చాయని ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబౌవో సుబియాంటో చెప్పారు. తనకు 'ఇండియన్ డిఎన్ఎ' ఉన్నదని ఆయన నొక్కిచెప్పారు. ఆదివారం రాజధాని న్యూఢిల్లీలో జరిగిన 76వ రిపబ్లిక్ డే ఉత్సవాలకు సుబియాంటో ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన విందులో ప్రబోవో సుబియాంటో మాట్లాడుతూ భారతీయ సంగీతం విన్నప్పుడల్లా తాను పరవశుడునై డ్యాన్స్ చేస్తానని చెప్పారు. భారతదేశంలో కొద్ది రోజులపాటు ఉండటానికి తాను వచ్చానని, కానీ తాను ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వం నుంచి చాలా నేర్చుకున్నానని, పేదరికం నివారణ కోసం ఆయన అంకితభావంతో చేపట్టే కార్యక్రమాలు చాలా బాగున్నాయన్నారు. 'సమాజంలోని బలహీనవర్గాలకు సహాయం చేయడానికి మీ (మోదీ) అంకితభావం ఎంతగానో సహాయపడుతోంది. అది మాకు ఎంతో స్ఫూర్తిని ఇస్తుంది. ఒక మంచి ఉదాహరణను ఎందుకు అనుసరించకూడదు. ప్రత్యేకించి మన ముందు ఎన్నో మంచి ఉదాహరణలు ఉన్నప్పుడు వాటిని స్వీకరించడం శ్రేయస్కరం కదా'అని అన్నారు. భారతదేశం, ఇండోనేషియా మధ్య ఉన్నటువంటి పురాతన నాగరికత సంబంధాలను సుబియాంటో ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'అత్యంత ముఖ్యమైన విషయమేమిటంటే మా భాష సంస్కృతం నుంచి వచ్చింది. మా పేర్లు ఇండోనేషియాలో అనేక పేర్లు వాస్తవంగా సంస్కృతం పేర్లు. అత్యంత బలిష్టమైన పురాతన భారతీయ నాగరికత నుంచి మా రోజువారీ జీవన విధానం ప్రభావితం అయ్యింది. బహుశా నేను అనుకుంటా అది మన జన్యుశాస్త్రంలో భాగం అని నేను అనుకుంటా' అని సుబియాంటో పేర్కొన్నారు. 'నేను రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఉపరాష్ట్రపతికి నివేదించడానికి ఇష్టపడుతున్నాను. కొద్ది వారాల క్రితం నేను నా జన్యుశ్రేణి పరీక్ష, నా డిఎన్ఎ పరీక్షను చేయించుకున్నా. వారు నాకు భారతీయ డిఎన్ఎ ఉందని చెప్పారు' అని ప్రబోవో సుబియాంటో తెలిపారు. ఈ వ్యాఖ్యలు సందర్శనకు వచ్చిన ప్రముఖుడి పక్కన కూర్చున ప్రధానమంత్రి మోదీ, వైస్ ప్రసిడెంట్ జగ్‌దీప్ ధన్కర్, హాజరైన మొత్తం సమీకరించబడినవారిని విడదీశాయి. ఈ ఈవెంట్‌కు బాలీవుడ్ సినిమాను జోడిస్తూ ఇండోనేషియా ప్రతినిధి 'కుచ్‌కుచ్ హోతా హై' సూపర్ హిట్ సాంగ్‌ను కూడా పాడి వినిపించారు. ఇండోనేషియా అధ్యక్షుడు మాట్లాడుతూ భారతదేశం, ఇండోనేషియా మధ్య సహకారాన్ని, ప్రతీకాత్మక సంబంధాన్ని వేగవంతం చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. 'అతి ముఖ్యమైన రంగాలైన హెల్త్, ఫార్మాస్యూటికల్స్, విద్య, సాంస్కృతిక, నిర్మాణ సామర్థ్యాలు, రక్షణ, డిజిటల్ సహకారం, సముద్ర భద్రత, సెక్యూరిటీ అంశాలపై సన్నిహిత అవగాహనకు వచ్చాం. మా అన్ని ఒప్పందాలు, ఏకాభిప్రాయాన్ని అమలు చేయాలని అనుకుంటున్నాం' అని ఆయన చెప్పారు. 'ఇండోనేషియా తొలి అధ్యక్షుడు, స్వాతంత్ర్య ప్రచారకర్త సుకర్నో. ఇది నిజంగా నాకు దక్కిన గొప్ప గౌరవం. రిపబ్లిక్ ఇండోనేషియా వ్యవస్థాపక పితామహుడి అడుగుజాడలలో నేను నడుస్తున్నాను' అని ప్రబోవో సుబియాంటో తెలియజేశారు. ఈ సందర్భంగా సుబియాంటోను స్వాగతిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భారతదేశం, ఇండోనేషియా మధ్య నాగరికత సంబంధాలు వేల సంవత్సరాల క్రితం నుంచి పరిఢవిల్లుతున్నాయన్నారు. భారతదేశ తూర్పు పాలసీ చట్టం, ఇండోపసిఫిక్ విజన్‌లో మూలస్తంభం అని ముర్ము నొక్కిచెప్పారు.

# విద్యార్థులకు 'ఫ్రీబస్'

సగం ధరకే మెట్రో టికెట్

'15 గ్యారంటీ'లతో ఆప్ మేనిఫెస్టో విడుదల

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సోమవారం మేనిఫెస్టో విడుదల చేశారు. మహిళలకు నెలకు రూ.2,100 సహాయం, 24 గంటల పరిశుభ్రమైన నీరు, వృద్ధులకు ఉచిత ఆరోగ్య సంరక్షణ, విద్యార్థులకు 50 శాతం మెట్రో ఛార్జీల రాయితీ వంటి 15 హామీలను ఇచ్చారు. మరోసారి అధికారంలోకి వస్తే ఇప్పటికే ప్రవేశపెట్టిన ఉచిత విద్య, ఆరోగ్య సంరక్షణ, మహిళలకు బస్సు ప్రయాణం, నీరు, విద్యుత్ వంటి పథకాలను కొనసాగిస్తామన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తీసుకువచ్చిన ఉచిత పథకాలను నిలిపివేస్తుందని ఆయన ఆరోపించారు. ఫలితంగా, ఢిల్లీ ప్రజలు నెలకు రూ.25,000 భారాన్ని భరించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 'కేజ్రీవాల్‌కి గ్యారంటీ' అనే మేనిఫెస్టోను విడుదల చేస్తూ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి దేశ రాజధానిలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే ఆప్ ప్రభుత్వం మహిళలకు నెలకు రూ.2,100 ఇవ్వడం ప్రారంభిస్తుందన్న హామీ కార్డుపై తొలి సంతకం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, ముందుగా తమ తల్లులు, సోదరీమణుల కోసం 'మహిళా సమ్మాన్ రాశి యోజన' ప్రారంభిస్తానని హామీ ఇస్తున్నానన్నారు. ఆప్ పథకాలనే బిజెపి కాపీ కొడుతుందని విమర్శించారు. దేశంలో మొదటగా 'గ్యారంటీ' అనే పదాన్ని తామే సృష్టించామని, ఆ తర్వాత, బిజెపి దానిని దొంగిలించిందన్నారు. అయితే రెండింటికీ తేడా ఉందని, తాము హామీలు అమలు చేస్తామని, వారు చేయరని ఎద్దేవా చేశారు. మేనిఫెస్టోలో పేర్కొన్న 15 హామీలలో... మహిళా సమ్మాన్ యోజన పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.2,100 ఆర్థిక సాయం, సంజీవని పథకం కింద 60 ఏళ్లు నిండిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో ఉచిత వైద్యం, నీటి సరఫరా బిల్లులు మాఫీ, 24 గంటల నీటి సరఫరా, యూరప్‌లో మాదిరిగా రోడ్ల నిర్మాణం, యమునా నది శుభ్రం చేయడం, డా.అంబేద్కర్ స్కాలర్‌షిప్ స్కీమ్ కింద విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం, ఢిల్లీ మెట్రో ప్రయాణంలో 50 శాతం రాయితీ, పూజారులు, గ్రంథీలు ఒక్కొక్కరికి రూ.18 వేలు, అద్దెదారులకు ఉచిత కరెంటుతో పాటు ఉచిత నీటి సౌకర్యం, మురుగు నీటి వ్యవస్థను పరిష్కరించడం, రేషన్ కార్డులు మంజూరు చేయడం, ఆటో, టాక్సీ, ఈరిక్షా డ్రైవర్ల కుమార్తెల వివాహాలకు రూ.1లక్ష అందజేత, వారి పిల్లలకు ఉచిత కోచింగ్, జీవిత బీమా, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యుఎ)లకు ప్రైవేటు గార్డులను ఆప్ అందించనుంది.




# మహారాష్ట్రలో కొత్త సిండ్రోమ్‌తో ఒకరి మృతి




**ముంబయి :** మహారాష్ట్రలో గిలియన్ బారె సిండ్రోమ్ (జిబిఎస్) బాధితుడు ఒకరు చనిపోయారు. మృతికి కారణంపై ఇంకా స్పష్టత రానప్పటికీ వైద్యులు మాత్రం జిబిఎస్ వల్లే మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. రాష్ట్రంలో జిబిఎస్ బాధితుల సంఖ్య 101కి చేరింది. వారిలో 16 మందికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. రాష్ట్రంలో కలకలం సృష్టిస్తున్న ఆ జిబిఎస్‌కు సంబంధించి వైద్యులు పలు కీలక విషయాలు వెల్లడించారు. సాధారణంగా శరీరంలోకి ప్రవేశించిన ఇన్ఫెక్షన్ కారక క్రిములకు బదులు నరాలపై దాడి చేస్తుందని, ఇది చాలా అరుదుగా జరుగుతుందని వారు తెలిపారు. జిబిఎస్ బారిన పడినవారిలో తిమ్మిర్లు, కండరాలు బలహీనంగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వారు తెలియజేశారు. కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం వల్ల డయేరియా వస్తుందనేది విదితమే. దీనికి కారణం కలుషిత ఆహారం ద్వారా శరీరంలోకి చేరే కాంపిలో బ్యాక్టర్ జెజునీ బ్యాక్టీరియా అని నిపుణులు చెబుతున్నారు. తాజా జిబిఎస్ కేసులకు కూడా ఇదే బ్యాక్టీరియా కారణమని వైద్య నిపుణులు అనుమానిస్తున్నారు. ఈ ఇన్ఫెక్షన్ విషయంలో శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ చేసే పొరపాటే జిబిఎస్‌కు దారి తీస్తుందని, ప్రతి వెయ్యి మందిలో కేవలం ఒకరికి ఈ పరిస్థితి ఎదురవుతుందని వారు తెలిపారు. ఈ సిండ్రోమ్ బాధితుల్లో డయేరియా, పొత్తికడుపు నొప్పి, జ్వరం, వాంతులు మొదలైన లక్షణాలు కనిపిస్తాయని వారు చెప్పారు. అంటువ్యాధి కాదుజిబిఎస్ అంటువ్యాధి కాదని, ఒకరి నుంచి మరొకరికి సోకదని వైద్యులు స్పష్టం చేశారు. జిబిఎస్ బాధితులకె సరైన చికిత్స అందిస్తే కోలుకుంటారని వారు ధైర్యం చెప్పారు. సుమారు 80 శాతం మంది బాధితులు చికిత్స అనంతరం ఆరు మాసాల్లో కోలుకుంటారని వారు తెలిపారు. కొందరిలో మాత్రం ఏడాది వరకు ప్రభావం కనిపిస్తుందని వారు చెప్పారు. అయితే, చికిత్స చాలా ఖరీదైందని అధికారులు తెలిపారు. చికిత్సలో భాగంగా రోగికి ఇచ్చే ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్ ధర ఒక్కొక్కటి వేలల్లో ఉంటుందని వారు సూచించారు. ఈ నేపథ్యంలో జిబిఎస్ బాధితులకు ఉచిత వైద్యం అందిస్తామని మహారాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి అజిత్ పవార్ వెల్లడించారు.

# ఇన్ని.. పాముకాటు మరణాలా?!

దేశవ్యాప్తంగా ప్రబలడంపై 'సుప్రీంకోర్టు' తీవ్రఆందోళన

అన్ని రాష్ట్రాల బోర్డు ద్వారా 'ఏదైనా చేయండి' అని కేంద్రాన్ని కోరిన ధర్మాసనం

భారత్‌లో ప్రతీఏటా 58,000 స్నేక్‌బైట్ మరణాలతో 'వరల్డ్‌టాప్'లో ఉందని అడ్వకేట్ చాంద్‌ఖురేషీ వెల్లడి



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా పాము కాట్లు పెరిగిపోతుండటంపై సోమవారంనాడు సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పాముకాటుకు సంబంధించిన సమస్య దేశమంతటా ప్రబలంగా ఉన్నదని, వైద్యసదుపాయాలలో పాముకాటు చికిత్సను అందుబాటులో తీసుకురావడానికి కేంద్రం అన్ని రాష్ట్రాల బోర్డును ఏర్పాటు చేసి ఏదో ఒకటి చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. పాముకాటుకు చికిత్స చేయడంలో కీలకమైన యాంటీవెనమ్ కొరత కారణంగా దేశం ఒక పెద్ద ప్రజారోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బిఆర్.గవాయ్, ఎస్‌విఎన్.భట్టితో కూడిన ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'మీరు స్టేట్స్‌తో ఒక బోర్డును తీసుకోండి. ఈ సమస్య దేశవ్యాప్తంగా ఉన్నది' అని ధర్మాసనం కేంద్రం తరపు న్యాయవాదికి చెప్పింది.'రాష్ట్రాలకు చెందిన అందరు ప్రతినిధులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయండి. సమావేశం ఏదైనా చేయడానికి ప్రయత్నించవచ్చు. ఇది విరోధి వ్యాజ్యం కాదు' అని బెంచ్ తెలిపింది. కాగా ఈ అంశంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను రికార్డులో ఉంచుతామని ప్రభుత్వం తరపు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు.కొన్ని రాష్ట్రాల న్యాయవాదులు ఈ విషయంలో కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేస్తామని చెప్పారని, ఈ విషయంలో బెంచ్ తమకు ఆరువారాల గడువును మంజూరుచేసి, ఆ తర్వాత ఈ విషయాన్ని పోస్ట్ చేసిందన్నారు. గత ఏడాది డిసెంబరు 13న న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం కేంద్రం సహా ఇతర రాష్ట్రాల స్పందనను కోరింది. బాధితుల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్యకేంద్రాలు, మెడికల్ కాలేజీలలో యాంటీవెనమ్, పాముకాటు చికిత్సను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. అడ్వకేట్ చాంద్ ఖురేషీ దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక పాముకాటు మరణాల రేట్లు భారతదేశంలోనే సంభవించాయని, ప్రతీ ఏటా 58,000 పాముకాటు మరణాలు భారతదేశంలో సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తపరిచారు. ఇంత అత్యధిక మరణాల రేటు ఉన్నప్పటికీ భారత్‌లో యాంటీవీనమ్ (పాలీవీనమ్) కొరత ఉన్నదని వాదించారు. దేశంలోని అనేక గ్రామాలలో యాంటీవీనమ్ స్టాక్ సరిపోను లేనందువల్ల స్నేక్‌బైట్ బాధితులకు చికిత్స ఆలస్యమై మరణిస్తున్నారని పిటిషన్ తెలిపింది. స్నేక్‌బైట్ ప్రివెన్షన్ హెల్త్ మిషన్ ఈ పాముకాటు మరణాలను నివారించేందుకు ప్రజలలో అవగాహన పెంపొందించే కార్యక్రమాలను ప్రత్యేకంగా గ్రామీణప్రాంతాలలో నిర్వహించాలని కోరింది. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలలో ప్రామాణిక వైద్య నిబంధనలు రూపొందించి, ఈ చికిత్సలో ప్రత్యేక ట్రైన్డ్ డాక్టర్లను నియమించేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు.

## ఢిల్లీ ఎన్నికల బరిలో అత్యధికులు

# 41-50 ఏళ్ల మధ్య ఉన్నవారే...



46 శాతం మంది అభ్యర్థులు 5-12 తరగతి చదివినవారు : ఎడిఆర్

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో ఫిబ్రవరి 5వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 699 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. వారి వయస్సు, విద్యార్హతలు, కేసులపై అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) విశ్లేషణ చేసింది. అనంతరం నివేదికను విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం.... 46 శాతం మంది (324 మంది) అభ్యర్థులు 5–12వ తరగతి మధ్య విద్యను అభ్యసించారు. 322 మంది అభ్యర్థులు ఉన్నత విద్యను అభ్యసించగా, 126 మంది గ్రాడ్యుయేట్లు. 84 మంది గ్రాడ్యుయేట్ ప్రొఫెషనల్స్, 104 మంది పోస్టుగ్రాడ్యుయేట్లు. 8 మంది అభ్యర్థులు డాక్టరేట్ డిగ్రీలను పొందిన వారు ఉన్నారు. వీరికి అదనంగా మరో 18 మంది అభ్యర్థులు డిప్లొమా చేసిన వారు ఉండగా, దానికి తోడు సాంకేతిక, ఒకేషనల్ నిపుణులుగా ఉన్నారు. ఇక ఆరుగురు అభ్యర్థులు అధికారిక విద్య లేకుండా అక్షరాస్యులమని తమకు తాము ప్రకటించుకున్నారు. మరో 29 మంది నిరక్షరాస్యులుగా ఉన్నారు. 2020 ఎన్నికలతో పోల్చితే ఈసారి 672 నుంచి 699 మంది అభ్యర్థుల అఫిడవిట్లను ఎడిఆర్ విశ్లేషించింది. వాటిని నిశితంగా పరిశీలించగా అనేక ధోరణులు వెల్లడయ్యాయి. కాగా, ఈసారి గ్రాడ్యుయేట్ ప్రొఫెషనల్స్ సంఖ్య 62 నుంచి 84కు చేరగా, పోస్టు గ్రాడ్యుయేట్లు 90 నుంచి 104కు చేరగా, డాక్టరేట్లు పొందిన వారి సంఖ్య మాత్రం 11 నుంచి 8కి తగ్గింది. అదే విధంగా నిరక్షరాస్యుల సంఖ్య 16 నుంచి 29కు పెరిగింది. ఇదిలా ఉండగా, పోటీలో ఉన్న అభ్యర్థుల్లో అత్యధికులు 41–50 ఏళ్ల మధ్య వయస్కులేనని ఎడిఆర్ తన నివేదికలో వెల్లడించింది. 2020లో ఈ వయస్సుగల వారి సంఖ్య 199గా ఉండగా, ఈసారి 235కి పెరిగింది. అయితే 70 ఏళ్లకుపైగా ఉన్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎడిఆర్ విశ్లేషించిన మేరకు పోటీ చేస్తున్న 19 మంది అభ్యర్థుల వయస్సు 70 ఏళ్లుగా ఉంది. 2020లో వీరి సంఖ్య 11గా ఉంది. ఆమ్ జన్మత్‌పార్టీ తరపున పోటీ చేస్తున్న రాజేందర్ అత్యధిక ఎక్కువ వయస్సు కలిగిన వారు కాగా, ఆయనకు ఇప్పుడు 88 ఏళ్లు ఉన్నాయి. అయితే 25–30 ఏళ్ల మధ్య ఉన్న వారి సంఖ్య 2020తో పోల్చితే తగ్గింది. గత ఎన్నికల్లో ఈ వయస్సు గల వారు 57 మంది పోటీలో ఉండగా ఈసారి 46 మంది బరిలో ఉన్నారు. భావన (స్వతంత్ర), హర్షద్ చాధ (బిఎస్‌పి) ఈ ఇద్దరు కూడా అత్యంత పిన్న వయస్కులు. వీరి వయస్సు 25 ఏళ్లు. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో 19 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎడిఆర్ పేర్కొంది. 2020 ఎన్నికలతో పోల్చితే ఒక శాతం మేర తగ్గాయి. ఈసారి 12 శాతం మంది తీవ్ర నేరపూరిత కేసులను ఎదుర్కొంటున్నారు. ఈ సంఖ్య గతంతో పోల్చితే మూడు శాతం తగ్గింది.

# అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధాని మోదీ ఫోన్



**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధాని నరేంద్రమోదీ ఫోన్ చేశారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వారం రోజులకు మోదీ ఆయనకు ఫోన్ చేశారు. వరుసగా రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌కు అభినందనలు తెలియజేశారు. 'చరిత్రాత్మకంగా రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ప్రియ మిత్రుడికి అభినందనలు' అని మోదీ ట్వీట్ కూడా చేశారు. 'అమెరికా అధ్యక్షుడైన నా ప్రియమిత్రుడు ట్రంప్‌తో మాట్లాడటం చాలా సంతోషంగా ఉంది. చరిత్రాత్మకంగా రెండోసారి అధ్యక్షుడైన ఆయనను అభినందిస్తున్నా. పరస్పరం రెండు దేశాల ప్రయోజనాల కోసం కలిసి పనిచేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. ప్రపంచ శాంతి, సామరస్యం, భద్రత, ప్రజల సంక్షేమం కోసం మేం కలిసి పనిచేస్తాం' అని మోదీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

## సనాతన ధర్మంపై కేసు..

# ఉదయనిధికి ఊరట



**న్యూఢిల్లీ :** తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. సనాతన ధర్మంపై వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన మూడు రిట్ పిటిషన్లను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఇవి ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నించిన జస్టిస్ బేలా ఎం.త్రివేదీ, జస్టిస్ ప్రసన్న బి.వరాలేలతో కూడిన ధర్మాసనం.. ఈ పిటిషన్లను తోసిపుచ్చింది. సెప్టెంబరు 2023లో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి అంటూ వ్యాఖ్యానించారు. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమన్నారు. అనంతరం తన వ్యాఖ్యలు ఎవరి మనోభావాలు దెబ్బతీసే ఉద్దేశంతో చేసినవి కావని పేర్కొన్నప్పటికీ.. హిందూ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలోనే ఉదయనిధిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీం కోర్టులోనూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

# ఆష్విట్జ్ మృత్యుకేంద్రంలో 80వ విముక్తి వార్షికోత్సవం

10.10 లక్షలమంది యూదులను ఊచకోత కోసిన నాజీలు

**బెర్లిన్ :** హిట్లర్ కాలంలో నాజీ జర్మనీ ప్రభుత్వం లక్షలమంది యూదులను మృత్యు శిబిరాల్లోకి తరలించి బలవంతంగా సామూహికంగా హతమార్చింది. ఆనాటి నాజీ మృత్యు శిబిరాలలో పేరెన్నికగన్నది ఆక్రమిత పోలెండ్ భూభాగంలో ఉన్న ఆష్విట్జ్ నాజీ మృత్యుకేంద్రం. సామూహిక ఊచకోతకు గురైన యూదులను స్మరించుకుంటూ ఈ కేంద్రంలో సోమవారంనాడు విముక్తి వార్షికోత్సవం జరిపారు. సోవియట్ యూనియన్ జర్మనీపై యుద్ధ విజయం సాధించిన తర్వాత 1945 జనవరి 27వ తేదీన ఈ ఆష్విట్జ్ సామూహిక మృత్యుకేంద్రాన్ని కనుగొని వందలమంది యూదులను సజీవులుగా బయటకు విడుదల చేసింది. ఫ్రాన్స్ నుండి ఈ విధంగా ఆనాడు 1.50 లక్షలమంది యూదులను నాజీ మూకలు ఆష్విట్జ్ సామూహిక ఊచకోతల కేంద్రానికి తరలించాయి. వీరిలో మూడుశాతం మంది మాత్రమే తిరిగి సురక్షితంగా ఇళ్ళకు చేరారు. ఇందుకు గుర్తుగా ఫ్రాన్స్ ప్రభుత్వం కూడా ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో (యూదులను తరలించిన రోజు) చివరి ఆదివారంనాడు ఆష్విట్జ్ సంస్మరణదినం పాటిస్తుంది. మొత్తం మీద ఈ ఆష్విట్జ్ కేంద్రానికి నాటీలు 13 లక్షలమంది యూదులను తరలించారు. వీరిలో రెండు లక్షలమంది మినహా మిగిలినవారు సామూహిక ఊచకోతకు గురయ్యారు. మరణించిన యూదులను స్మరించుకోవడానికి ఆష్విట్జ్–బిర్కెనౌ ఒక ప్రధాన సంస్మరణ స్థలంగా మారింది. ఆనాడు ఈ మృత్యు కేంద్రాన్ని చూసి సోవియట్ యూనియన్ సేనలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. నాజీ సైనిక మూకలు చేసిన దారుణమైన సామూహిక ఊచకోత చర్యలను చూసి చెలించిపోయాయి. సోవియట్ యూనియన్ సేనలు ఈ మృత్యుకేంద్రాన్ని కనుగొని యూదులను విడుదల చేసి ఈనాడు జనవరి 27వ తేదీ సోమవారం నాటికి 80 సంవత్సరాలు పూర్తయింది. ప్రతి సంవత్సరం జనవరి 27ను ఆష్విట్జ్ నాజీ నియంత సేనల మృత్యుగహ్వర విముక్తి దినోత్సవంగా పాటిస్తారు. ఆక్రమిత పోలెండ్ భూభాగంలో ఉన్న ఈ ఆష్విట్జ్ నాజీ మృత్యు గహ్వరకేంద్రాన్ని 1947లో ఒక మెమోరియల్ మ్యూజింగా మార్చారు.

# 'చిల్కపల్లి'కి ఇన్నేళ్లకు విద్యుత్!

స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారిగా ఊరికి కరెంట్



**రాయ్‌పూర్ :** మన దేశానికి స్వాతంత్ర్యం 1947లోనే వచ్చినా, ఆ ఊరిలో విద్యుత్ తొలి వెలుగులు మాత్రం 2025లోనే ప్రసరించాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కేంద్రానికి 50 కి.మీ దూరంలోని మారుమూల గ్రామం చిల్కపల్లిలో ఎట్టకేలకు ఇప్పుడు విద్యుత్ పంపిణీ మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నియాద్ నెల్లనార్ యోజన' అనే పథకం కింద ఈ ఊరిలో విద్యుద్దీకరణ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ స్కీమ్ ద్వారా బీజాపూర్ జిల్లాలో విద్యుద్దీకరణను పూర్తి చేసుకున్న ఆరో గ్రామం చిల్కపల్లి. జనవరి 23 నాటికే ఈ ఊరిలో విద్యుత్ పంపిణీ లైన్ల ఏర్పాటు, ఇంటింటికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం వంటి పనులు పూర్తయ్యాయని బీజాపూర్ జిల్లా కలెక్టర్ సంబిత్ మిశ్రా వెల్లడించారు. సుదూరంగా ఉన్న ఈ పల్లెల్లో విద్యుత్ వెలుగులను చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. రాబోయే కొన్ని నెలల్లో జిల్లాలోని మరిన్ని మారుమూల గ్రామాల్లోనూ విద్యుద్దీకరణ పనులు పూర్తవుతాయన్నారు. సాధ్యమైనంత త్వరగా ఆ పనులన్నీ పూర్తయ్యేలా పర్యవేక్షిస్తానని కలెక్టర్ తెలిపారు.

**ఇకపై రాత్రి కూడా మా పిల్లలు చదువుకోగలరు!**

'ఇప్పటి వరకు మా ఊరు విద్యుత్‌ను చూడలేదు. ఇప్పుడు ఊరిలోని ప్రతీ ఇంట్లో విద్యుత్ వెలుగులు కనిపిస్తున్నాయి. ఈ పరిణామం మా జీవితాలను మారుస్తుంది. రాత్రి టైంలో ఇక మా పిల్లలు చదువుకోగలరు. మేం వంట లు కూడా చేయగలం' అని చిల్కపల్లికి చెందిన ఓ గిరిజన మహిళ చెప్పుకొచ్చింది.

**ఊరికి వెలుగు :** 'చాలా దశాబ్దాల తర్వాత మా ఊరిలోకి విద్యుత్ వెలుగులు వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఇప్పుడు మేం టీవీ చూడగలం. విద్యుత్‌తో వంట వండగలం. భయం లేకుండా రాత్రి పూట ఊరిలో తిరగగలం' అని చిల్కపల్లికి చెందిన మరో గ్రామస్తుడు తెలిపారు.

**నాలుగు నెలలు శ్రమించి విద్యుత్ లైన్ వేశాం: విద్యుత్ ఉద్యోగి**

'విద్యుత్ స్తంభాలు, విద్యుత్ పంపిణీ లైన్లను చిల్కపల్లి గ్రామంలో ఏర్పాటు చేయడం మాకు పెద్ద సవాల్‌గా మారింది. ఎందుకంటే అక్కడికి ప్రయాణం చేయడమే చాలా పెద్ద కష్టం. రోడ్డు సరిగ్గా ఉండదు. ఏది ఏమైనా మేం శ్రమించి 4 నెలల్లోనే ఆ ఊరిలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేశాం' అని బీజాపూర్ జిల్లాలోని విద్యుత్ విభాగం ఉద్యోగి ఒకరు తెలిపారు.

**గతంలో మావోయిస్టుల ప్రభావంతో సతమతం**

కొన్నేళ్ల క్రితం వరకు చిల్కపల్లి గ్రామంపై మావోయిస్టుల ఆధిపత్యం ఉండేది. మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్లు, సీఆర్పీఎఫ్ బలగాల మోహరింపు జరిగిన తర్వాత ఇక్కడి పరిస్థితులు మారాయి. ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల వికాసంపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే చిల్కపల్లి లాంటి మారుమూల పల్లెలకు విద్యుత్ వసతి, రోడ్డు సౌకర్యం కల్పించేందుకు 'నియాద్ నెల్లనార్ యోజన' పథకాన్ని అమల్లోకి తెచ్చింది.

# కుంభమేళాలో అమిత్‌షా

**ప్రయాగ్‌రాజ్ :** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాకు భారీగా భక్తులు క్యూ కడుతున్నారు. సాధారణ ప్రజలతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కూడా త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ కుంభమేళాలో పాల్గొన్నారు. గంగ, యమున, సరస్వతి నదీ సంగమం వద్ద పుణ్యస్నానం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, యోగా గురు బాబారామ్ దేవ్ కూడా పుణ్యస్నానమాచరించారు మరోవైపు జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళా వైభవోపేతంగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది. విదేశాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో పోటెత్తున్నారు. ఈనెల 29న మౌని అమావాస్య కావడంతో 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు (అమృత స్నానం) ఆచరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం వల్ల 12 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి లభించిందని అంచనా. తాత్కాలిక వైద్య శిబిరాలతో 1.5 లక్షల మంది నర్సులు, పారామెడికల్స్, ఇతర వైద్య సిబ్బందికి అవకాశాలు లభించాయి.

## లాకప్ డెత్ కేసు.. ఐజి సహా

# 8 మంది పోలీసులకు జీవితఖైదు

**న్యూఢిల్లీ :** లాకప్ డెత్ కేసులో దోషులుగా తేలిన 8 మంది పోలీస్ అధికారులకు సీబీఐ ప్రత్యేక కోర్టు జీవితఖైదు విధించింది. అంతేగాక ఒక్కొక్కరు లక్ష రూపాయల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశించింది. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఈ లాకప్ డెత్ కేసు విచారణ చేపట్టిన సీబీఐ స్పెషల్ కోర్టు జడ్జి అల్కా మాలిక్.. ఈ నెల 18న నిందితులను దోషులుగా తేల్చారు. ఇవాళ శిక్ష ఖరారు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లా జిల్లాలో 2017 జూలై 4న 16 ఏళ్ల బాలికపై ఏడుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపై ఆమెను హత్య చేసి నిర్మానుష్య ప్రదేశంలో పడేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కొట్ఖాయ్ స్టేషన్ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఘటనకు బాధ్యులైన ఏడుగురిని గుర్తించి అరెస్ట్ చేసింది. సిట్ విచారణ జరుగుతుండగా నిందితుల్లో ఒకడైన సూరజ్ లాకప్‌లో మరణించాడు. దాంతో పోలీసులు అత్యాచారం కేసులో మరో నిందితుడైన రాజిందర్ ఈ కేసులో హంతకుడిగా చేర్చి తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. విషయం బయటికి రావడంతో ప్రభుత్వం ఆ రెండు కేసుల దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. సీబీఐ అధికారులు సూరజ్ లాకప్ డెత్‌కు హిమాచల్‌ప్రదేశ్ ఐజీ జహూర్ హైదర్ జైదీ సహా 8 మంది పోలీసులను నిందితులుగా చేర్చింది. మిగతా ఏడుగురిలో డీఎస్పీ మనోజ్ జోషి, ఎస్సై రాజిందర్ సింగ్, ఏఎస్సై దీప్‌చంద్ శర్మ, హెడ్ కానిస్టేబుళ్లు మోహన్ లాల్, సూరత్ సింగ్, రఫీ మహ్మద్, కానిస్టేబుల్ రంజిత్ సతేరా ఉన్నారు. నిందితుడిగా ఉన్న ఎస్పీ డీడబ్ల్యూ నేగిని కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. దోషులుగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్షలు విధించింది.



## దేవరకొండ మునిసిపాల్టీ సమగ్రాభివృద్ధి చేస్తా

దేవరకొండ ఎంఎల్ఎ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణ కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు సభ్యులు, మరియు కో ఆప్షన్ సభ్యుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ ఎంఎల్ఎ బాలునాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ మునిసిపల్ చైర్మన్, వార్డు సభ్యులు పట్టణ అభివృద్ధికి చేసిన కృషిని అభినందించి, పట్టణ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. బాధ్యతల నుండి విరమించినా, అభివృద్ధి కోసం ఎల్లప్పుడు అందరూ అందుబాటులో ఉండాలని, సమాజానికి తాము చేసిన సేవలు సదా గుర్తుండిపోతాయని అన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ద్యేయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాజీ ఎంపిపి జాన్‌యాదవ్, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, ఏఈ రాజు పాల్గొన్నారు.

## లారీ దొంగల అరెస్టు

నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి వెల్లడి

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** పార్క్ చేసి ఉన్న లారీలే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి తెలిపారు.సోమవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని రామ్ నగర్ కు చెందిన పాలడుగు రాజు తన లారీని తిప్పర్తి పోలీస్ స్టేషన్ పక్కన గల మార్కెట్ యార్డ్‌లో పార్కింగ్ చేయగా డిసెంబర్ 24న ఆ లారీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిప్పర్తి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. దర్యాప్తులో భాగంగా శాలిగౌరారం సిఐ, ఎస్‌ఐ తిప్పర్తి వారి పోలీస్ సిబ్బంది ఆదివారం సాయంత్రం తిప్పర్తి సెంటర్‌లో నకిరేకల్ రోడ్డు వైపు వాహనాల తనిఖీలు చేస్తుండగా రెండు ఎర్టిగా కార్లు నెంబర్ ప్లేట్ లేకుండా అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో కారులో ఉన్న నలుగురు వ్యక్తులను ఆపి విచారించగా ఆ నలుగురు వ్యక్తులు పోలీస్‌లకు పట్టుబడి నంబర్ ప్లేట్ లేని కారులో రాత్రిపూట తిరుగుతూ రహదారుల వెంబడి మీద చీకటి ప్రదేశాల్లో పార్క్ చేసిన లారీలను దొంగతనం చేసి విజయవాడలోనీ ఆటో నగర్ ఏరియాలో దొంగలించిన లారీలను అమ్మి సులువుగా డబ్బులు సంపాదిస్తామని నేరాన్ని ఒప్పుకున్నారని డిఎస్‌పి వెల్లడించారు. నేరస్థుల వద్ద నుండి రెండు కేసులలో రెండు ఎర్టిగా కార్లు, 8.50 వేలు విలువ గల రెండు లారీలు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని వీరిలోఏ4 కొండా సురే ష్, ఏ6 షేక్ హబీబ్ లు పరారీలో ఉన్నారని తెలిపారు. ఈలారీ దొంగత నం కేసును చేదించిన శాలిగౌరారం సిఐ కొండల్ రెడ్డి, తిప్పర్తి ఎస్‌ఐ బి. సాయి ప్రశాంత్ ,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి, రాము తిప్పర్తి పోలీస్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్‌పి శరత్ చంద్రపవార్ అభినందించారని తెలిపారు.

## ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/కోదాడ:** రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఐజెయు) జిల్లా అధ్యక్షులు కోలా నాగేశ్వర్ రావు, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గింజల అప్పిరెడ్డిలు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో యూనియన్ డైరీని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికి ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫథకాలను కూడా వర్తింప చేయాలన్నారు. హెల్త్ కార్డుల ద్వారా సరైన వైద్య సదుపాయాలు కల్పించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ దాడుల నిరోదక కమిటీ అధ్యక్షులు బాదె రాములు, నాయకులు సతీష్ కుమార్, కోట రాంబాబు, ఆవుల మల్లికార్జున్ రావు, రాయపూడి చిన్న, హరినాథ్ పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత




**ప్రజాపక్షం/మానవపాడు:** జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం సోమవారం మధ్యాహ్నం 1:00 సమయంలో ఆర్‌డిఎస్ కాల్వ రోడ్డు పై జల్లాపురం స్టేజి దగ్గర్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నారు. కర్నూలు జిల్లా పంచలింగాల శివారులోని తుంగభద్ర నది నుంచి ఇసుక లోడ్ తో జల్లాపు రం గ్రామం వైపు వస్తున్న టిప్పర్ను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పోలీస్ స్టేషన్ కు తరలించారు. కానిస్టేబుల్ హరిబాబు ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ వెంకట ప్రతాప్ నాయుడు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడమైనది మండల ఎస్‌ఐ చంద్రకాంత్ ప్రజపక్షం న్యూస్ పత్రికకు తెలిపారు.

## బాల బ్రహ్మేశ్వరస్వామి సేవలో డిఎస్‌పి

**ప్రజాపక్షం/ ఎర్రవల్లి :** అలంపూర్ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలు గద్వాల జిల్లా డిఎస్పి మొగులయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆయన ప్రధాన అర్చకుడు ఆనంద శర్మ స్వాగతం పలికారు. వీరితో పాటు ఎస్‌ఐ వెంకటస్వామి ఉన్నారు.

## సిపిఐ జిల్లా కార్యదర్శి సత్యంకు పరామర్శ

**ప్రజాపక్షం /మునుగోడు:** సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాతృమూర్తి పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం మండలంలోని ఎలాగలగూడం గ్రామంలో ఫిష్,గోట్ మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ పార్వతమ్మ చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం అట్టడుగు వర్గాల కోసం తన బిడ్డను జాతికి అంకితం చేసిన వీర వనిత పార్వతమ్మ అని ఆయన ఆయన గుర్తు చేశారు. ఆమె మరణం తీరని లోటని తెలిపారు. ఆయన వెంట మాజీ యంపిపి కర్నాటి స్వామి, కుండే వెంకటేష్, మాజీ సర్పంచ్ సూరిగి చలపతి, పాలకూర నరసింహ , ఈదుల కంటి కైలాస్, శంకర్, కర్నాటి రాంబాబు పాల్గొన్నారు.



జల వివాదాల కేరాఫ్ అడ్రస్

# సాగర్ రిజర్వాయర్!

కృష్ణా జలాలపై తెలంగాణ ,ఆంధ్ర జలజగడం ఇంకెన్నాళ్లు?



**ప్రజాపక్షం/నందికొండ:** కృష్ణా నది జలాలే కేంద్రంగా జల వివాదం అనేది 2023 ఎన్నికల సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఒక్కసారి అగ్గి రాజుకుంది. నాటి నుండి నేటి వరకు రిజర్వాయర్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. నీటి వాటాల్లో స్పష్టత లేక ప్రతిసారి ఇదే సమస్య పునరా వృతమవుతోంది. రాష్ట్ర విభజన ప్రక్రియ జగిరిన 2014 నుంచి ఇప్పటి వరకు ఇరు రాష్ట్రాల మధ్య సయో ధ్య ఏనాడూ కుదరలేదు. నీటి కేటాయింపుల్లో ఏపీ ప్రతిపాదనపై తెలంగాణ ప్రతియేటా అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తోంది. చట్టాలు, తీర్పులు, ఒప్పందాలన్నీ ఉల్లం ఘనకు గురవుతున్నాయని వివాదాలు పరిష్కారం కాకుండా నీటి వినియోగం ఎలా చేస్తారని తెలంగాణ ఎప్పుడు ప్రశ్నిస్తూనే ఉంది. ఈ క్రమంలో కృష్ణా నదీ జలాల యాజ మాన్య బోర్డు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తూ ఇప్పటికే అనేక పర్యాయాలు తెలంగాణ రాష్ట్ర వాదనను పట్టించుకోని యాజమాన్య బోర్డు ఇప్పటికీ సమస్యను నానుస్తూనే ఉంది. రాష్ట్ర పునర్విభజన తరువాత రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలు ఒక ఏడాదికి మాత్రమే పరిమి తమని తెలంగాణ వాదిస్తోంది. ఈ నెల 21న కృష్ణా నది యాజమాన్య బోర్డు చైర్మన్ అతులైన్ అధ్యక్షతన జరిగి న సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఇంజినీర్లు, ఇరు రాష్ట్రాల ఉన్నతా ధికారులు పాల్గొనగా అసమావేశంలో కృష్ణా జలాలలో తెలంగాణకు 71 శాతం వాటా ఇవ్వా ల్సిందేనని ఆ 71 శాతం ఖరారు చేసే వరకూ ఇరు రాష్ట్రాలకు చెరి సగం వాటా 50:50 నిష్పత్తి చొప్పున ఇవ్వాలని తెలంగాణ అధికారులు కృష్ణా నది యాజమాన్య బోర్డును డిమాండ్ చేశారు. అందుకు ఏపీ అధికారుల అభ్యంతరం తెలియజే యడంతో వివాదం మళ్లీ మొదటికొచ్చింది. అయితే తెలంగాణ రాష్ట్రంలో కృష్ణా పరివాహక ప్రాంతం 71 శాతం ఉందని, ఆ మేరకు నీటి వాటా రావాల్సిందేనని 66:34 చొప్పున వాటాలను అప్పట్లో ఒక్క ఏడాది కోసం మాత్రమే ఒప్పుకున్నారని, 71:29 వాటాలను కేటాయించాలనినేది తెలంగాణ హక్కు అని 71 శాతం ఖరారు చేసే వరకు చెరి సగం వాటా ఇవ్వాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ నాడు తెలియజేయటం జరిగింది. అదేవిధంగా చెన్నై తాగునీటి సరఫరా కోసం 1976/77లో కుదుర్చుకున్న ఒప్పందాలకు లోబడి నిబంధనలు ఖరారు చేసి అమలు చేయాలని, శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల వద్ద జల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన నిబంధనలను సవరణ చేయాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. అయితే ఆంధ్ర అధికారులు తెలంగాణ డిమాండ్లకు అభ్యంతరం తెలుపుతూ తెలంగాణ అడిగిన 50:50 నిష్పత్తిని అంగీకరించబోమని 66:34 నిష్పత్తి ప్రకారమే కొనసాగించాలని వారు పట్టుబట్టారు. దానితో ఇరు రాష్ట్రాల నీటి పంపకాలపై చర్చ ఎటు తేలకుండా పోయింది. మరి ఈ జలజగడం ఇలా సంవత్సరాల తరబడి కొనసాగుతుందా లేక పరిష్కారమవుతుందా లేక వివాదాలకు కేంద్ర బిందువుగా మారనుందా ఈ సమస్య ఎటువైపుకు దారితీస్తుందో వేచి చూడాలి.



## ప్రజావాణి అర్జీలు పెండింగ్ ఉండొద్దు

**ప్రజాపక్షం/యాదాద్రి :** వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 42 అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 19, హౌసింగ్ 5, వ్యవసాయ శాఖ 4, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ 3, మున్సిపాలిటీ 2, మెప్మా, పశు సంవర్ధ శాఖ, సర్వే ల్యాండ్, పంచాయితీ శాఖ, వైద్య శాఖ, జిల్లా వెనకబడిన తరగతులు శాఖ, రవాణా శాఖ, చేనేత మరియు జౌళి శాఖ, ఇరిగేషన్ శాఖలకు క్కొకటి చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా పరిషత్ కార్య నిర్వహణ అధికారి శోభ రాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 93 దరఖాస్తులు

ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల నుండి పలు సమస్యలపై 93 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఫిబ్రవరి 3 నుండి 22 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 5 నుండి 25 వరకు థిరి పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద సిఆర్‌పిసి సెక్షన్ ప్రకారం 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రాల సమీపంలో జీరాక్స్ కేంద్రాలను బంద్ చేయాలన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, పరీక్ష సమయాన్ని అన్ని రూట్లలో విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఆర్‌టిసి బస్సులు నడపాలన్నారు. రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థులకు సకాలంలో చేరుకునేలా సంక్షేమ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య, ఆరోగ్యశాక అధికారులు, ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు పరీక్ష కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు, డిఆర్‌డిఓ వివి అప్పారావు, సిపిఓ ఎల్ కిషన్, ఎల్‌డిఎం బాపూజీ, వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, డిటిడిఓ శంకర్, డిఇఓ అశోక్, ఎస్‌సి అభివృద్ధి అధికారి లత, బిసి అభివృద్ధి అధికారి అనసూయ, మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీష్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతి ల్యాబ్‌లో రెండు సిసి కెమెరాలు

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని

అధికారులకు కలెక్టర్ ఆదేశం

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** ఈనెల 29 నుండి ఫిబ్రవరి 22 వరకు, అలాగే మార్చి 5 నుండి మార్చి 25 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షల నిర్వహణపై సోమవారం ఆమె ప్రజావాణి కార్యక్రమం అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ల్యాబ్ లో తప్పనిసరిగా 2 సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ,ప్రైవేటు కళాశాలల్లో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు ల్యాబులలో సిసి కెమెరాలు తప్పనిసరిగా యాజమాన్యాలు ఏర్పాటు చేయాలని ఒక వేళ లేనట్లయితే ఆ కళాశాలలకు ప్రాక్టికల్ ,థియరీ పరీక్షల కేంద్రాలను రద్దు చేయడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు.ఈనెల 29న ఎథికల్, హ్యూమన్ వాల్యూస్ ఎగ్జామినేషన్ ,30న ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్, ఈనెల 31, ఫిబ్రవరి 1న ఇంగ్లీష్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ పరీక్షలు ఉంటాయని తెలిపారు .ఫిబ్రవరి 3 నుండి 22 వరకు ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ప్రతిరోజు రెగ్యులర్ ,ఒకేషనల్ విద్యార్థులకు రెండు పూటల ఉదయం 9 నుండి 12 వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రునాయక్, జిల్లా పరిశ్రమల అధికారి కోటేశ్వరరావు ,గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, డిఎస్‌ఓ వెంకటేశ్వర్లు, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ డిమాండ్

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్ డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతురావుకి సిపిఐ ప్రతినిధి వర్గంతో పాటు అర్హులతో ప్రజావాణిలో మెమోరాండం సమర్పించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన ఏర్పాటు చేశారన్నారు. ఇట్టి ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని ఈనెల 21 నుండి 24 వరకు జరిగిన గ్రామ వార్డు సభలలో జాబితాలో పేర్లు రానటువంటి వారు చాలామంది ఉన్నారన్నారు. అద్దె ఇంట్లో ఉంటున్నవారు పెంకుటిల్లు, రేకుల ఇల్లు దివ్యాంగుల వారికి జాబితాలో చదివిన తర్వాత ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఇప్పటికైనా ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి వాస్తవికంగా ఎవరికి ఇల్లు లేదు అని పరిశీలన చేసి ఇల్లు మంజూరు చేయాలన్నారు. సెల్ ఫోన్లో ఫోటోలు తీసిన ప్రకారంగా చాలామంది అనర్హులుగా ఉన్నారన్నారు. ఈ పరిస్థితులు భువనగిరి, మండలం పట్టణంలో పరిశీలన సమగ్రంగా జరగలేదన్నారు. ఇప్పటికైనా కొత్త దరఖాస్తులు పాత దరఖాస్తులు పునః పరిశీలన చేసి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మ య్య, ఎండి.రేష్మ, తస్లీమా బేగం, ఉడుత రమేష్, బొజ్జ కరుణాకర్, మచ్చ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



## ఫిబ్రవరి నుండి సిపిఐ గ్రామ, మండల మహాసభలు

పార్టీ శ్రేణులకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ పిలుపు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఫిబ్రవరి నుండి జరిగే సిపిఐ గ్రామ, మండల మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా కావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవనంలో ఎల్లావుల రాములు అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశ గడ్డపై వందేళ్ళ మహోజ్వల పోరాటాలు, త్యాగాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని కొనియాడారు. స్వాతంత్రం నా జన్మ హక్కు అని పోరాటాలు జరుగుతున్న క్రమంలో 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పుర్‌లో సిపిఐ ఆవిర్భవించిందన్నారు. దేశంలో దోపి, అంతరాలు, సమ సమాజం స్థాపన కోసం పెట్టుబడి దారి విధానాలను వ్యతిరేకంగా కార్మిక, కర్షక ప్రజా దోపిడి పాల్పడుతున్న వర్గాలను వ్యతిరేకంగా మార్క్ సిద్దాంతాన్ని ఆచరిస్తూ నిరంతరం అన్ని రంగాలలో కార్మిక శ్రేయస్సు కోసం ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలు సాధించినట్లు తెలిపారు. గ్రామాన మండలంలాల్లో మహాసభలు జరుపుకోవాలని జిల్లా, రాష్ట్ర, జాతీయ మహాసభలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణరెడ్డి, కంబాల శ్రీనివాస్, ఎల్లంల యాదగిరి, కృష్ణారెడ్డి, డి మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు తోట్ల ప్రభాకర్, మూరగుండ్ల లక్ష్మ య్య, ఖమ్మంపాటి రాము, కొండ కోటయ్య, రెమిడిల రాజు, దొడ్డ వెంకటయ్య పాల్గొన్నారు.

## 4సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలి

సంక్షేమ పథకాల అమలును విజయవంతం చేసిన అధికారులకు అభినందనలు : కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాలను విజయవంతం చేసిన గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి అధికారులకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అభినందనలు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో వెబెక్స్ వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం ఈనెల 16 నుండి 20వ తీదీ వరకు క్షేత్ర స్థాయి విచారణ, 21 నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహణకు ప్రజలు సహకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో కొన్ని తప్పులు జరిగినట్లు తన దృష్టికి రావడం జరిగిందని అధికారులు జాగ్రత్తగా పరిశీలించాలని, అర్హులైన లబ్దిదారులకు మాత్రమే అందేలా చూడాలన్నారు. భద్రత కార్డులు కొరకు సోషల్ ఎకనామిక్స్ సర్వే మీసేవా, ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఇవ్వాలని, ఉద్యోగులు, ఇన్‌కం టాక్స్ కట్టే వారికి దరఖాస్తులు రిజక్ట్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కూడా ఒ కుటుంబానికి ఒక ఇల్లు ఒకే కుటుంబంలో ఇద్దరికి మంజూరు చేయవద్దన్నారు. నాలుగు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి రాంబాబు, డిఆర్‌డిఓ వివి అప్పారావు, డిఇఓ అశోక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సీతారాం నాయక్, పశుసంవర్థక శాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు రాజేశ్వర్ రావు, నరసింహారావు, శ్రీనివాస్ నాయక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరువుహత్యా... పాతకక్షా...?

సూర్యాపేటలో కలకలం రేపుతున్న వడ్లకొండ కృష్ణ హత్య



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఓ యువకుడి హత్య సోమవారం వెలుగులోకి వచ్చింది. ఇతడి హత్య పరువు హత్యనా.. లేక పాత కక్షలతోనేనా జరిందనే విషయం పోలీస్ దర్యాప్తులో తేలాల్సి ఉంది. దీనికి సంబంధించిన మృతుని/కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. సూర్యాపేట పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అతని మృతదేహం సోమవారం పిల్లలమర్రి గ్రామానికి వెళ్లే మూసీ కాల్వ కట్టపై లభ్యమైంది. పిల్లలమర్రి గ్రామానికి చెందిన నవీన్‌తో మృతుడు కృష్ణలు మంచి స్నేహితులు. ఈ క్రమంలో అతని చెల్లి భార్గవితో కృష్ణ పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. కృష్ణను పెళ్లి చేసుకుంటానని భార్గవి చెప్పడంతో కులం అడ్డువచ్చి ఆమె కుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో వారు పెద్దలను ఎదురించి ఆరు నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరి పెళ్లికి ఆ యువతి కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పెద్దలను ఎదురించి ఇంట్లో నుండి వెళ్లిపోయి ఒక్కటయ్యారు. పెళ్లి చేసుకున్న రోజే ఎన్నటికైన నిన్ను హత్య చేస్తానంటూ నవిన్ కృష్ణను హెచ్చరింటినట్లు అతని చెల్లి భార్గవి విలేకరుల బోరున విలపిస్తూ చెప్పింది. ఈ క్రమంలోనే నవీన్ కృష్ణ హత్యకు పథకం పన్ని తాళ్ళగడ్డకు చెందిన బైరు మహేష్‌తో కృష్ణకు ఫోన్ చేసి రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన విషయం మాట్లాడేది ఉంది రమ్మంటూ ఫోన్ చేసి రమ్మనడంతో సాయంత్రం 5గంటలకు తమ ఫోన్ తీసుకోకుండానే బయటికి వెళ్లిపోయాడు. కృష్ణ ఇంటికి తిరిగి రాత్రి 3గంటల వరకు కూడా రాలేదు. ఇదే విషయం అతని స్నేహితులకు ఫోన్ చేసి తెలుసుకున్నా ఫలితం లేదు. తనను ఫోన్ చేసి పిలిచిన బైరు మహేష్ ఫోన్‌కు ఫోన్ చేయగా స్వీచ్ ఆఫ్ వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం 6:30గంటలకు కృష్ణ భార్య భార్గవికి పోలీసులు ఫోన్ చేసి నీ భర్త ఇంటి వద్ద ఉన్నాడా... ఏ బట్టలు వేసుకున్నాడు.., కటింగ్ ఏలా చేసుకున్నా అనే వివరాలను అడిగారు. కృష్ణ మృతి చెందిన విషయం ఆమెకు చెప్పకుండా గోప్యంగా ఉంచారు. అతని స్నేహితులు హత్యకు గురైన విషయాన్ని ఆమెకు చెప్పడంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహం కృష్ణదిగా గుర్తించారు. వెంటనే మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని వారికి పోలీసులు అప్పగించారు. దీంతో భార్గవి కుటుంబ సభ్యులే కృష్ణను హత్య చేశారని తన భార్య భార్గవితో పాటు బంధువులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉంటే కృష్ణ పాత నేరస్తుడు. గతంలో ఇతనిపై రెండు హత్యయత్నం కేసులు పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యాయి. పాత కక్షలతోనే ఏవరైన హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదిఏమైన పోలీస్ విచారణలో నిజనిజాలు తెలాల్సి ఉంది.

## భువనగిరి మున్సిపల్ ప్రత్యేక అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/భువనగిరి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌన్సిల్ కాలపరిమితి ముగిసినందున జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.గంగాధర్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామాంజుల రెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన పేదల దరికి ప్రభుత్వ పథకాలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులైనవారికి ప్రభుత్వ పథకాలు చేరాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలోని 15వ డివిజన్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించి రూ.8.45 కోట్లతో అల్లిపురం మెయిన్‌రోడ్డు నుంచి రామకృష్ణాపురం వరకు, అల్లిపురం నుండి జంగాల కాలనీ వరకు, అల్లిపురం ఎన్‌టిఆర్ విగ్రహం నుండి ధంసలాపురం వరకు చేపట్టిన మూడు రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈప్రాంతంలో కొంతమంది రైతులు ఆయిల్‌పామ్ పంటలు బాగా వేశారని మిగిలిన రైతులు కూడా ఆయిల్ పామ్ సాగు చేయాలని కోరారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.52వేల సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మిర్చి, పత్తి, వరి పంటల కంటే అధికంగా ఆయిల్ పామ్ సాగు చేస్తే ఎకరానికి మూడులక్షల వరకు ఆదాయం లభిస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులు మూడేళ్ల వరకు కూరగాయలు, ఇతర అంతర పంటలు కూడా సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ప్రస్తుతం పత్తి, మిర్చి పంటల్లో తెగుళ్ల సోకి దిగుబడులు తగ్గుతున్నాయని రైతులు ఈ అంశాలను గమనించి ఆయిల్ పామ్ సాగు చేయాలన్నారు. ఆయిల్ పామ్ సాగుతో కోతుల బెడద, తుఫాన్, దొంగల బెడద ఉండదన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం, రూ.500 గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ క్రింద రూ.10లక్షల వైద్య సేవలు వంటి పథకాలు అమలు చేశామన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా పథకాలను ప్రారంభించామన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో అసలైన అర్హులకు పథకాలు చేరాలని ఎవరైనా అనర్హులు పథకాలకు ఎంపికైతే అధికారులకు సంపూర్ణ సమాచారం అందించాలని మంత్రి సూచించారు. ఖమ్మం నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని అందించనున్నట్లు తెలిపారు. అర్బన్ పార్కులో ప్లాస్టిక్ నిషేధమని మంత్రి తెలిపారు. 15వ డివిజన్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చిన తర్వాత బిటి రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. చేసిన పని పది కాలాల పాటు ఉండాలని అధికారులకు సూచించారు. రోడ్లపై ర్యాంపుల నిర్మాణం చేపట్టవద్దని అలాంటి వాటిని తొలగించాలన్నారు. 15వ డివిజన్‌లో ఉన్న విద్యుత్ మీటర్ల సమస్య, పాసుపుస్తకాల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఆర్‌డిఒ జి.నర్సింహారావు, పిఆర్ ఇఇ వెంకటరెడ్డి, ఆర్అండ్‌బి ఇఇ యుగంధర్‌రావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, ఎఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్ రావూరి కరుణ సైదబాబు, కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకుడు శంకర్ మృతి

సంతాపం తెలిపిన నాయకులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలం భాగ్యనగర్ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు గుగులోత్ శంకర్‌నాయక్ గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతిచెందారు. శంకర్ నాయక్ గతంలో సిపిఐ తరుపున ఎంపిటిసిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయినప్పటికి, పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ప్రజా ఉద్యమాలలో ముందుండేవారు. శంకర్‌నాయక్‌కు భార్య. కుమారుడు, కూతురు అన్నారు. శంకర్ నాయక్ మృతదేహానికి సోమవారం సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్రాబాబు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాయకులు ఇస్లావతు భావ్‌సింగ్, గుగులోత్ మాంగు, కీల్యా, హరిసింగ్, ఎఐటియుసి భూపాలపల్లి బ్రాంచ్ నాయకులు ఇస్లావత్ ధళసింగ్, గుగులోత్ చందా రాందాబు, మాజీ జెడ్‌పిటిసి వాంకుదోత్ జగన్, గుగులోత్ భావ్‌సింగ్, నాగేష్, తదితరులు ఉన్నారు.

## తాగునీరు సమస్య పరిష్కరించాలని ఖాళీబిందెలతో రోడ్డెక్కిన మహిళలు



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడలోని ఫారెస్ట్ ఆఫీసర్ ఏరియాలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం వాటర్ సప్లయి అవుతున్న బోరు వద్ద ఖాళీ బిందెలతో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. వారంరోజుల నుండి తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోకవటం లేదని వారు ఆరోపించారు. బోరు చెడిపోతే వాటర్ ట్యాంక్ ద్వారా నీళ్లు అందించి మంచినీటి ఇబ్బందులు తీర్చాలి గాని, బోరుకు ఎటువంటి మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని మండిపడ్డారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈలప్రోలు నాగమణి, బొడ్డు జయ, సిరిగి నాగేశ్వరి, బీరెల్లి లక్ష్మి , గుల్ఫర్ అఖిల తదితరులు పాల్గొన్నారు.

## మరణంలో వీడని బంధం

భర్త మరణించిన గంటల వ్యవధిలోనే భార్య మృతి



**ప్రజాపక్షం/మణుగూరు :** మూడు ముళ్లు, ఏడడుగులతో ఏర్పడిన ఆ బంధం కాటికి చేరే వరకూ అలాగే సాగింది. అనారోగ్యంతో భర్త మృతి చెందిన గంటల వ్యవధిలో భార్య కూడా కన్ను మూసింది. ఈ విషాద ఘటన మణుగూరు మండలం పగిడేరు గ్రామంలో జరిగింది. పగిడేరు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కర్నె రవి తండ్రి సోమయ్య అనారోగ్యంతో ఈనెల 24న మృతి చెందారు. కాగా తన భర్త మరణాన్ని తట్టుకోలేని భార్య కర్నె నాగమ్మ సోమవారం గుండెపోటుతో మృతిచెందింది. గ్రామానికి చెందిన భార్యభర్తలు గంటల వ్యవధిలోనే చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు రవి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం తెలిపారు.

## ఘనంగా 'ఎలక్ట్రీషియన్ డే'

జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే వెంకట్రావ్



**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎలక్ట్రీషియన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ జరిపారు. అనంతరం ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు జెండా ఎగురవేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ కార్మికులంతా ప్రభుత్వం ద్వారా లేబర్ కార్డు పొంది ఉండాలని, తద్వారా కార్మికులకు ప్రమాదబీమా రూ.6 లక్షలు, మరెన్నో ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో రత్నం రమాకాంత్, నర్రా రాము, చింతాడి వెంకటరెడ్డి, భీమవరపు వెంకటరెడ్డి, నాగేంద్ర, పుల్లగిరి నాగేంద్ర, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆకుల వెంకటేష్, జిల్లా ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అధ్యక్షులు చుక్క సుధాకర్, కార్యదర్శి ఎస్కే రహీం, కోశాధికారి మండా పుల్లారావు, నాగేంద్ర, జయనాగు, భరత్, రాజేష్, వాసు, లోకేష్, రవితో పాటు యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలందించాలి

ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి



**ప్రజాపక్షం/పెనుబలి :** పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో పేషెంట్స్‌కి అందిస్తున్న చికిత్స సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రిలోని వైద్యులతో చర్చించి వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పలురకాల రికార్డులను తనిఖీ చేశారు. నూతన వాటర్ ట్యాంక్, వాటర్ పైప్లు ఏర్పాటు వెంటనే పూర్తి చేయాలని ఎంపిడిఒ అన్నపూర్ణను ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ అనిత, డాక్టర్ బి.యన్.రెడ్డి, డాక్టర్ వరుణ్ కుమార్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ స్రవంతి, డాక్టర్ విజ్ఞ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం





అదనపు కలెక్టర్ డా..పి.శ్రీజ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్ అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, కలెక్టరేట్ ఎఒ అరుణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నులిపురుగుల నివారణకు చర్యలు

నులిపురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీజ నులిపురుగుల నివారణ, కుష్టు వ్యాధిగ్రస్తుల చికిత్స తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 19 ఏళ్ల లోపు ఉన్న పిల్లలందరికీ తప్పనిసరిగా మాత్రలు వేయించాలని అధికారులకు సూచించారు. నులిపురుగులు చాలా ప్రమాదకరమని వీటి వల్ల రక్త హీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వీటిని నివారిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలిపారు. ఫిబ్రవరి 10న మాత్రలు అందించని విద్యార్థులకు ఫిబ్రవరి 17న తప్పనిసరిగా అందించాలని ఆమె తెలిపారు. జనవరి 30న గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి కుష్టువ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. అవగాహనతోనే కుష్టువ్యాధి నివారించవచ్చన్నారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.కళావతి బాయి, ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణ అధికారి, అడిషనల్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ వెంకటరమణ, డిఇఒ సోమశేఖరశర్మ, డిడబ్ల్యూఒ కె.రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## కేసు విచారణలో జాప్యం తగదు

ఎస్‌పి రోహిత్‌రాజ్





**ప్రజాపక్షం/భద్రాచలం :** కేసుల విచారణలో ఎలాంటి జాప్యానికి తావుండరాదని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. ఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నెలవారీ సమీక్షలో జిల్లాలోని పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి రోహిత్ మాట్లాడుతూ ప్రతీ కేసులో క్వాలిటీఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. పోలీస్ అధికారులంతా బాధ్యయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిషేధిక గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలైన యువత వారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాలు విక్రయించే వారిపై నిఘా పెట్టి అరెస్టు చేయాలన్నారు. దొంగలను పట్టుకుని సొత్తు రికవరీ చేయాలని, నేరాల నివారణకు, సిసి కెమోరాలు ఏర్పాటు చేయాలన్నా . సైబర్ నేరాలపై బాధితులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుండాలని, జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదు పోగొట్టుకుంటే వేగంగా స్పందించి రికవరీ చేసేందుకు కృషిచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అప్రమత్తపు బోర్డులను అమర్చాలని, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని, లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే వారిని గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని, వారి వల్ల ఇతరులకు ఇబ్బందులు వస్తున్నారని దానిపై నిఘాపెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గతనెలలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఎస్‌పి ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో ఎఎస్‌పి విక్రాంత్‌సింగ్, కొత్తగూడెం డిఎస్‌పి రెహమాన్, పాల్వంచ డిఎస్‌పి సతీష్, ఇల్లందు డిఎస్‌పి చంద్రభాను, మణుగూరు డిఎస్‌పి రవీందర్‌రెడ్డి, డిసిఆర్బి డిఎస్‌పి మల్లయ్యస్వామి, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆ గ్రామాల్లో రైతుల ఖాతాల్లోకి భరోసా

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవ సందర్భంగా అమలు చేయనున్న రైతుభరోసా నగదు ఎంపిక చేసిన గ్రామాల్లో రైతుల ఖాతాల్లో జమ చేశారు. మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి ఆయా గ్రామాల రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు జమ చేశారు. ఖమ్మంజిల్లాలోని 21 మండలాల్లో 21 గ్రామాలను ఎంపిక చేశారు. 21 గ్రామాల్లో 20,802 మంది రైతులకు రూ.28.42 కోట్లను ఆయా రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 మండలాలకు 25 గ్రామాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాల పరిధిలోని 22242 మంది రైతులకు రూ.39.07 కోట్లను జమ చేశారు ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు నగదు డ్రా చేసుకోవచ్చునని అర్హత కలిగిన ప్రతి రైతు ఖాతాలో నగదు జమ చేస్తామని ఆయన తెలిపారు.

## ప్రజావాణిలో పాల్గొన్న మేయర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు రాని వారు మరల దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేస్తారని మేయర్ తెలిపారు. కార్యక్రమంలో ఓసిపి వసుంధర, ఆర్ఒ జి.శ్రీనివాస్, జేఏవో శివలింగం, లింగయ్య, సిసి రాంబాయి, సూపర్‌వైజర్ సాంబయ్య పాల్గొన్నారు.



## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా కోరారు. చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్‌లో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన వెలుగు కిరణం గ్రామ సమాఖ్య కార్యాలయాన్ని సోమవారం అయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు పొంది వ్యాపారాలవైపు అడుగులు వేయడం ద్వారా ఆర్థిక అవసరాలు తీర్చుకొని కుటుంబానికి బాసటగా నిలవాలన్నారు. బ్యాంకులు సకాలంలో రుణాలు మంజూరు చేసి సంఘాలను ప్రోత్సహించాలని కోరారు. సమాఖ్య సౌకర్యార్థం భవన నిర్మాణానికి దాతలు ముందుకురావడం అభినందనీయమన్నారు. స్థానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో నియోజకవర్గం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని, కూనంనేని చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, నాయకులు, దాతలు వర్ధన్ రావు, శ్యామ్, కృష్ణ, కృష్ణమూర్తి, నాగేశ్వర్ రావు, రాంబాబు, మని, రామకృష్ణ, ప్రభ, సామినేని రామారావు, మాగోరెడ్డి, రాణి, ప్రసాద్, వివిధ బ్యాంకు అధికారులుపాల్గొన్నారు.

### గిరిజన రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించండి



**లక్ష్మీ దేవిపల్లి :** లక్ష్మీ దేవిపల్లి మారుమూల ఏజెన్సీ గ్రామాల పోడు రైతులకు సాగునీటి సౌకర్యం ఏర్పాటు కోసం విద్యుత్, మోటార్లు ఏర్పాటు చేయాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా కోరారు. మండలంలోని లక్ష్మీపురం, బొజ్జలగూడెం, చింతకుంట గ్రామపంచాయతీల్లో పర్యటించి అక్కడి పోడు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ మూడు గ్రామపంచాయతీల్లోని గిరిజన రైతులు అనాదిగా పోడు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారని, వీరి భూములకు సాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు 120 మంది గిరిజన రైతులు తమ భూములకు విద్యుత్, బోర్లు ఏర్పాటు చేయాలని దరఖాస్తులు చేసుకున్నారని ఆయన తెలిపారు. అధికారులు స్పందించి త్రిఫేస్ విద్యుత్, బోర్లు ఏర్పాటు చేయడం ద్వారా గిరిజనులకు సాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సాబీర్‌పాషా కోరారు. కార్యక్రమంలో దారా శ్రీనివాస, వర్స రామస్వామి, జోగా రామయ్య, కంటెం సత్యనారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణ







అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**ప్రజాపక్షం/భద్రాచలం :** జిలాల్లో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో జిల్లాలోని ఇంటర్ మీడియట్ అధికారులతో జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ జనవరి 29 నుండి ఫిబ్రవరి 22 ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 5 నుండి 25 వరకు రాతపరీక్షలు జరుగుతాయని తెలిపారు. వీటి నిర్వహణపై జిల్లా అధికారులు దృష్టి సారించాలన్నారు. మొదటి సంవత్సరంలో 10,173 మంది, ద్వితీయ సంవత్సరంలో 10,062 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ప్రాక్టికల్ కోసం జిల్లాలో 62 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉ.9 గంటల నుంచి మ.12గంటల వరకు జరుగుతాయని, మ.2గంటల నుండి సా.5 గంటల వరకు రెండు సెక్షన్లలో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని రకాల ఏర్పాటు చేయాలని, పరీక్షలకు వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఉండాలన్నారు. పరీక్షల విషయంలో చదువుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించి నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చేలా అంతా కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సిహెచ్ వెంకటేశ్వరరావు, కొత్తగూడెం ఏఆర్‌డిఎస్‌పి సత్యనారాయణ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సులోచనరాణి, ఎగ్జామినేషన్ కో ఆర్డినేటర్ అరవింద్‌బాబు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలు న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి ఆయన దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు బట్వాడా చేశారు. అనంతరం మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి సుదూర ప్రాంతాల నుండి వచ్చి అర్జిలు సమర్పిస్తుంటారని, వారిని నమ్మకంపై నీళ్లు చల్లకుండా అధికారులు క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. పరిష్కారానికి నోటుకోని వాటిపై తగిన నివేదకలు సమర్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'సంక్షేమ' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ఐటిడిఏ పిఒ రాహుల్

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులకు స్టడీహావర్స్ నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటిడిఏ సమావేశంలో మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ గిరిజన గ్రామాల నుండి వచ్చిన వారిపై ఆయన వినతులు స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. అనంతరం పిఒ మాట్లాడుతూ గిరిజనులు వారి సమస్యల పరిష్కారం వచ్చి దరఖాస్తులు అందిస్తున్నారని, వాటి పరిష్కారానికి అధికారులంతా కృషి చేయాలన్నారు. పరిష్కారాని కినోచుకోని వాటిపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్నాయని, చదువుల్లో వెనుకబడిన వారిని గుర్తించి వారికి సరై స్టడీ హావర్స్ నిర్వహించి భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలు అర్హులైన గిరిజనులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ డేవిడ్ రాజ్, డిడి మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

### మ్యూజియంలో పాతకాలపు వస్తువులు ఏర్పాటు చేయాలి

ఐటిడిఏ ప్రాంగణంలో పర్యాటకుల కోసం ఏర్పాటు చేస్తున్న మ్యూజియంలో పాతకాలపు వస్తువులు సేకరించి ఏర్పాటు చేయాలని ఐటిడిఏ పిఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న గిరిజన మ్యూజియం ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. బోట్ షికారు, క్రీడా ప్రాంగణం కోసం జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. శ్రీరామనవమి నాటికి గిరిజన మ్యూజియంను పూర్తి స్థాయిలో అందుబాటులోనికి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జనరల్ డేవిడ్ రాజ్, డిడి మణెమ్మతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.







## ప్రజావాణికి 117 దరఖాస్తులు

### సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : ప్రజావాణిలోస్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలసి కలెక్టర్ వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందచేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించేలా శాఖ అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 117 దరఖాస్తులను తీసుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్‌డిఓ జైదేవ్ ఆర్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'రామగుండం' కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం నగర కార్పొరేషన్ పాలకవర్గ కాలపరిమితి ఈ నెల 26న ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ పెద్దపల్లి ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామగుండం ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ , రామగుండం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## సిటీ పోలీస్ చట్టం అమలు

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో 30 పోలీస్ యాక్టు 1861 ప్రకారం ఈనెల 28 నుండి ఫిబ్రవరి 12 వరకు సిటి పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు.సభలు,సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఏలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందుగా పోలీసు అనుమతీ తీసుకోవాలన్నారు. అలాగే పోలీస్ కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేదాజ్ఞలు ఈనెల 28 నుండి వచ్చే నెల 12 ఫిబ్రవరి ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటుందన్నారు.

## ఘనంగా స్పోర్ట్స్ ఫియస్తా వేడుకలు




ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ పట్టణంలోని సీతారాంపూర్‌లో గల ఐవిహై పాఠశాలలో 76వగణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్పోర్ట్స్ ఫియస్తా వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ కోల మాలతి అధ్యక్షతన వేడుకలు నిర్వహించగా పాఠశాల చైర్మన్ పసుల మహేష్, డైరెక్టర్ పసుల జయశ్రీ, కో చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా వేడుకలు ప్రారంభించారు. చిన్నారులు గణేష కౌత్యం, శివతాండవం, భరతనాట్యంతో అలరించారు. చైర్మన్, కో చైర్మన్‌లు మాట్లాడుతూ కేంబ్రిడ్జి యూనివర్సిటీ పాఠ్య ప్రణాళికను పాఠశాలలో ప్రవేశపెట్టామని, అందుకు సంబంధించి విధ్యార్థులకు ఐవి కేంబ్రిడ్జ్ కరికులం అవార్డ్స్, బెస్ట్ అటెండెన్స్ అవార్డ్స్, స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్స్, అకాడమిక్ ఎక్సలెంట్ అవార్డ్స్, స్పోర్ట్స్ ఫియస్తా ఆటల్లో గెలుపొందిన వారికి మెడల్స్ ప్రశంసా పత్రాలు, ట్రోఫీ ఇవ్వడం జరిగిందన్నారు. స్పోర్ట్స్ కోచ్‌లకు మెడల్స్ ప్రశంసా పత్రాలతో వారిని సన్మానించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయ బృందం, పిఈటీలు విధ్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## క్రీడా మైదానం కోసం వినతి



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామంలో ని గ్రామ రైతులు ,యువకుల కొరకు క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు కిష్టంపేట రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ధర్మపురి క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు.ఆయన మాట్లాడుతూ శ్రీరాములపల్లె గ్రామంలో ఐకెపి సెంటర్ వద్ద ఉన్న స్థలం రైతులు పండించిన వరి ధాన్యం కోసం సరిపోకపోవడంతో రహదారి పక్కన పోయడం వలన రైతులు నాన్న ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ రైతులు చాలా సార్లు చెప్పారు. అలాగే గ్రామయువకులకు క్రీడా మైదానం లేక ఒక్క గ్రామాలకు వెళ్లి ఆడుకుంటున్నారు. ఐకెపి సెంటర్ ప్రక్కన ఉన్నస్థలాన్ని చదును చేయడం వలన రైతులకు, యువకులకు క్రీడా మైదానం కొరకు ఉపయోగపడుతుంది . ప్రభుత్వ విప్ కు చెప్పగానే వెంటనే స్పందించి స్థాని క గొల్లపల్లి తహసిల్దార్‌కు ఫోన్ చేసిస్థలం దగ్గరికి వెళ్లి సర్వే చేయాలని సూచించారు.మండల కాంగ్రెస్ నాయకులు కిష్టంపేట రమేష్ రెడ్డి ,కిష్టంపేట రామ్‌చందర్‌రెడ్డి ,నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సోమవారం సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆయా శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడారు.జనరల్ అలాగే వొకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షలు వచ్చే నెల 3వ తేది నుండి 22 తేది వరకు జరుగుతాయన్నారు. ఇంటర్‌పరీక్షలు మార్చి 5వ తేది నుండి 25వ తేది వరకు ఉదయం 9గంటల నుండి 12గంటలవరకు జరుగుతాయన్నారు.

# మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి పట్టు

### కలెక్టర్‌కు 31 మంది కార్పొరేటర్ల సంతకాలతో వినతి

### మేయర్ అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలన్న కార్పొరేటర్లు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: బిఆర్ఎస్‌లో మేయర్ పదవిని అనుభవిస్తూ బిజెపిలో చేరిన కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావుపై అవిశ్వాసం పెట్టాలని బిఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన కార్పొరేటర్లు కలెక్టర్ పమేలా సత్పతికి సోమవారం వినతి పత్రం సమర్పించారు. బిఆర్ఎస్‌లో కార్పొరేటర్లతో పాటు కాంగ్రెస్‌లో చేరిన మొత్తం 31 మంది కార్పొరేటర్లు సంతకాలు చేసిన అవిశ్వాస నోటీసును అందజేశారు. కరీంనగర్ పాలక సంస్థలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న మేయర్ సునీల్‌రావును వెంటనే సస్పెండ్ చేయాలని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణిహరిశంకర్‌తో పాటు బిఆర్ఎస్ కార్పొరేటర్లు కోరారు. గడిచిన ఐదేళ్ల నుంచి నగరపాలక సంస్థలో అన్ని విభాగాలలో అవినీతికి పాల్పడిన మేయర్ సునీల్‌రావుపై వెంటనే విచారణ జరిపించాలన్నారు. అవినీతి మేయర్ సునీల్‌రావుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా కలెక్టర్ బల్దియా కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి బలపరీక్ష నిర్వహించి ఫలితాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు. అయితే కరీంనగర్ కార్పొరేషన్ పాలకవర్గ పదవీకాలం 28వ తేదీతో ముగియనుంది. ఆదేరోజు కౌన్సిల్ సమావేశం ఉంటుంది. అయితే మరికొద్ది గంటల్లో నిర్వహించే సమావేశంలో అవిశ్వాస తీర్మానానికి అవకాశం తక్కువే. అయితే బిఆర్ఎస్ వ్యూహాత్మకంగా చేపట్టినప్పటికీ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిజిపి కరీంనగర్ వేదికగా నిర్వహించే స్పోర్ట్స్ మీట్‌కు వచ్చే అవకాశముండగా బలనిరూపణకు అవకాశం ఉండక పోవచ్చని చర్చించుకుంటున్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల సమస్యలు పట్టవా?



ప్రజాపక్షం / హుజురాబాద్ : జర్నలిస్టుల ఇళ్ల సమస్యలను పరిష్కరించాలంటూ టియుడబ్ల్యుజె(ఐజెయు) హుజురాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చేసి, డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ కన్వీనర్ గడ్డం ధర్మారెడ్డి, కో కన్వీనర్లు కాయిత రాములు, నిమ్మటూరి సాయికృష్ణ మాట్లాడారు.గత 20 సంవత్సరాలుగా జర్నలిస్టులుగా పనిచేస్తూ గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలు పొందినప్పటికీఅమలుకాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి న్యాయం జరుగుతుందని ఆశించినప్పటికీ నిరాశే ఎదురైందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు నంబి భరణి కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ అధ్యక్షుడు మక్బుల్, జిల్లా నాయకులు చిలుకమారి సత్యరాజ్, వేల్పుల సునీల్, బొద్దు శ్రీనివాస్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు మామిడి రవీందర్, తిరునగరి ఆంజనేయస్వామి అల్లి నరేందర్, ముస్కె శ్రీనివాస్, సురుకంటి తిరుపతి రెడ్డి, స్వామి, ప్రెస్‌క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసినా పట్టించుకోరా?

### అధికారులను ప్రశ్నించిన కౌన్సిలర్లు



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : సిద్దిపేట మున్సిపల్ పరిధిలో బావిస్‌ఖాన్ పూల్ కూల్చివేసిన వారిపై అధికారులు చర్యలు చేపట్టడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోరా? అని మున్సిపల్ కౌన్సిలర్లు దర్మవరం బ్రహ్మం, వినోద్, సిద్దినాగరాజురెడ్డిలు అధికారులను నిలదీశారు. పట్టణంలోని అక్రమ కట్టడాలపై సమావేశం గరంగరంగా సాగింది. సోమవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు అధ్యక్షత వహించారు. పట్టణంలో అక్రమ కట్టడాలపై పూర్తిగా ఉదాసీనతగా వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సరేండర్ చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బావిస్‌ఖాన్‌పూల్‌నుకూల్చిన వారితోనే తిరిగి నిర్మింపచేయాలని డిమాండ్ చేశారు. అలాగే వర్టికల్ గార్డెన్‌ను సైతం యధావిధిగా ఏర్పాటు చేయాలని, కూల్చివేసినవారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ అశ్రీత్ కుమార్ మాట్లాడుతూ బావిస్‌ఖాన్ పూల్ కూల్చివేసిన ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ఎవరు ధ్వంసం చేసిన సహించేది లేదన్నారు. కూల్చివేసిన వారితోనే మరమ్మతులు చేయించనున్నట్లు తెలిపారు. ఫుట్‌పాత్‌లపై వెలిసిన వర్తక, వ్యాపార సముదాయాలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను చైర్మన్ మంజుల రాజనర్సు ఆదేశించారు. పట్టణ సానిటరిఇన్స్‌పెక్టర్ జవాన్‌లు ఎప్పటికప్పుడు పట్టణంలో పర్యటించి ఆరుబయట చెత్త చేసేవారిని గుర్తించి మందలించి జరిమానాలు విధించాలని సూచించారు. పట్టణానికి 25 కోట్ల రూపాయలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఏజెండాలో పొందుపర్చిన 27 అంశాలను పాలకవర్గం ఆమోదించింది. మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు , కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్, ఎలక్ట్రిసిటి రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ శాఖ తదితరులు పాల్గొన్నారు.

## వినతులపై క్షేత్ర స్థాయి పరిశీలన

### ప్రజావాణికి 298 దరఖాస్తులు

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః ప్రజావాణిలో చేసే ఫిర్యాదులను వివిధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, ఇతర ఉన్నతాధికారులతో ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించారు. కొన్ని ధరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణికి మొత్తం 298 ధరఖాస్తులు రాగా ఇందులో అత్యధికంగా కరీంనగర్ నగరపాలిక సంస్థకు 45, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి 18, కొత్తపెల్లి తహసీల్దార్ కార్యాలయానికి 13 ధరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సోలార్ ప్లాంట్లకు భూమి సేకరించాలి**

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిమండలంలో కనీసం 10 ఎకరాల భూమిని గుర్తించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. ఇందుకు దేవాదాయ శాఖ భూములను పరిగణలోకి తీసుకోవాలని మండల అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అన్ని ధరఖాస్తులను పూర్తిస్థాయిలో ధ్రువీకరించి కలెక్టర్‌కు పంపించాలని అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, మండలాధికారులను ఆదేశించారు.

## క్రీడాకారులకు అభినందన



ప్రజాపక్షం /సుల్తానాబాద్ : టెన్నిస్ క్రీడలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి సంప్రిత్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. టెన్నిస్ పోటీలలో జాతీయ స్థాయికి ఎంపికైన సుల్తానాబాద్ పట్టణంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఏం సంప్రీత్, కోచ్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ కృష్ణప్రియ, ఎంఈఓ రాజయ్య లు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కోయ శ్రీహర్షను కలిశారు. ఇటీవల హైదరాబాదులో రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరచి జాతీయస్థాయిపోటీలకుసంప్రీత్ ఎంపికయ్యాడని, పోటీలు ఫిబ్రవరి 4 నుండి 7వ తేదీ వరకు మధ్యప్రదేశ్ ఇండోర్ లో జరిగే జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలలో పాల్గొంటారని కోచ్ సత్యనారాయణ తెలిపారు.

## మెనూ చార్జీలు పెంచాలి



ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధిః మార్కెట్ ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం సమర్పించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడారు. మెనూ చార్జీలు ప్రతి విద్యార్థి రూ.25 చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, మేనిఫెస్టోలో పదివేల రూపాయల వేతనం చెల్లిస్తామని చెప్పిన మాటలను అమలు చేయాలన్నారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, మధ్యాహ్న భోజన పథకం జిల్లా అధ్యక్షుడు బొజ్జ సాయిలు, ప్రధాన కార్యదర్శి కె.రజిత, జిల్లా నాయకులు దేవక్క, సరోజన, ఎం.లక్ష్మి , కె.సత్తెమ్మ, రేణుక, హాలియా, సాహెన, నాగవ్వ, పద్మ, కార్మికులున్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటా

### ధర్మపురి ఎంఎల్‌ఏ లక్ష్మ ణ్‌కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తూ అహర్నిషలు కష్టపడే మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బం ది సమస్యలు పరిష్కరిస్తానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ అ న్నారు. ధర్మపురి పురపాలక సంఘం కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి , సంగనబట్ల సంతోషి, జక్కు పద్మ, గరిగె అరుణల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి విప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పురపాలక సిబ్బంది కార్మికులను సన్మానించి నూతన దుస్తులు, చీరెలు అందజేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల శ్రమను, సేవలను గుర్తించి కాంగ్రెస్ కౌన్సిలర్లు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. తెల్లవారుజాము నుండి ప్రారంభమయ్యే పారిశుద్ధ్య కార్మికుల దినచర్యను గుర్తు చేసుకోవాలన్నారు. పనికి తగ్గ జీతం దక్కకపోవడం బాధాకరమని అలాగే ఏళ్లుగా ఒప్పంద కార్మికులుగా కొనసాగుతున్న సిబ్బంది రెగ్యులర్ కాకపోవడం జీతాలు కూడా నెలనెల అందకపోవడం తదితర సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ధర్మపురి పట్టణంలో త్రాగునీటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చేయిస్తానని తెలిపారు. ధర్మపురి నియోజకవర్గ పరిధిలో ఎస్‌డిఎఫ్ గ్రాంట్ కింద రూ. 10 కోట్లు మంజూరు కాగా వాటిలో 6కోట్లు త్రాగునీటి కోసం బోర్ వెల్స్‌కోసం కేటాయించామన్నారు. ధర్మపురి మున్సిపల్‌లో టియూఎఫ్ఐడిసి గ్రాంట్ నిధుల రూ.లు 15కోట్లతో నూతన సిసి రోడ్లు, డ్రైనేజిలకై శంఖుస్థాపన చేసుకోవడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమస్యలను విన్నవించి నిధులు తెస్తానని ధర్మపురి ప్రాంత సమగ్రాభివృద్ధి లక్ష్యమన్నారు.మున్సిపల్ కమిషనర్ కే. శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు చీపిరిశెట్టి రాజేష్, జె. సుముఖ్, అప్పం తిరుపతి, గరిగె రమేష్, రాందేని మొగిలి, స్థంభంకాడి గణేష్, గాజు సాగర్, మున్సిపల్ మేనేజర్ గంగాధర్, సానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్. గంగాధర్‌ఉన్నారు.

## మధ్యాహ్న భోజన వర్కర్లకు రూ.10వేలు ఇవ్వాలి




ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : మధ్యాహ్నం భోజనం వంట చేసే వర్కర్లకు ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకుల హామీ మేరకు నెలకు 10వేల వేతనం ఇవ్వాలని అలాగే మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి 25రూపాయలు మెన్ చార్జీలు చెల్లించాలని మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు సంగం పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల శారద డిమాండు చేశారు. ఎఐటియుసి అనుబంధ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్న భోజన వర్కర్లతో కలిసి జిల్లా అధ్యక్షురాలు సంగం పద్మ, ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల శారద, యూ. రాజు, కె. జగన్, ఎఐటియుసి నాయకులు జగిత్యాల జిల్లా విద్యాధికారికి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. పద్మ, శారదలు మాట్లాడుతూ మార్కెట్లో కోడిగుడ్డు ధర 8 రూపాయలుంటే ప్రభుత్వం 5 రూపాయలు చెల్లిస్తుందని ఒక్క కోడిగుడ్డుకు 3 రూపాయలు నష్టంతో మధ్యాహ్న భోజనం వర్కర్లు విద్యార్థులకు అందించలేరని, ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేయాలన్నారు.మార్కెట్ ధరలకనుగుణంగా మెనూ చార్జీలు లేనందున రెండు కూరలతో భోజనం పెట్టలేరన్నారు. వంట కార్మికులను తొలగించకుండా జిఓ జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు.వంట సందర్భంగా కార్మికులకు జరుగుతున్న ప్రమాదాల కోసం ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలన్నారు. గత 9 నెలలుగా పెండింగులో ఉన్న కోడిగుడ్డు బిల్లులను వంట కార్మికులకు వెంటనే చెల్లించాలనిడిమాండ్ చేశారు.విద్యార్థులకు రాగి జావ చేయడానికి ప్రభుత్వం ఎలాంటి పారితోషికం ఇవ్వడం లేనందున జావ పిల్లలకు అందించలేమని వారు తెలిపారు.అంతకు ముందు జిల్లా కలెక్టరెట్ వద్ద మధ్యాహ్నం భోజనం వర్కర్లు, ఏ ఐ టీ యూ సీ నాయకులు కలిసి సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులుసుతారిరాములు,జిల్లాఉపాధ్యక్షులుమునుగురి హన్మంత్, భూమేష్, జగిత్యాల జిల్లా ఇంచార్జి వెన్న మహేష్, మధ్యాహ్న భోజనం వంట కార్మికులు శారద, బీ.లక్ష్మి , మల్లేశ్వరి, కె.లక్ష్మి , జరినబేగం, లత, రాధ,అనూష,పద్మ, దేవక్క, హారిక, రజిత, జయశ్రీ, గంగు, కవిత, భాగ్య, లక్ష్మి పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు మింగుతున్న భూబకాసురులు



ప్రజాపక్షం /జగిత్యాలరూరల్ : జగిత్యాల జిల్లా లో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ మాఫియా భూ బాకాసురులు రోజు రోజుకు పెరిగిపోతున్నారు. వారం రోజుల క్రితం జగిత్యాల జిల్లాకు పర్యటనకు వచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నేరుగా నివేదికతో సహా పిర్యాదు చేయడంతో భూ బాకాసురులతో పాటు రెవెన్యూ అధికారుల లీలలు వెలుగుచూశాయి.

### నర్సింగాపూర్ ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలు

జగిత్యాల జిల్లాలోని జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని సర్వే నెంబరు 437 లోని 378 ప్రభుత్వ భూమి ఉండగా, అందులో 78 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయగా మిగతా 300 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉండాలి. కానీ రెవెన్యూ రికార్డుల్లో 220 ఎకరాల ప్రభుత్వ భూమి మాత్రమే ఉంది. నర్సింగాపూర్ సర్వే నెంబరు 437 పట్టాలు పొందిన వారి వివరాలు కోరుతూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రెవెన్యూ అధికారులకు లేఖ రాయడం జరిగింది. జీవన్ రెడ్డి రాసిన లేఖ ఆధారంగా రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టగా 2014 ముందు పహానిలు కొత్తగా పట్టాలు పొందిన వారి వివరాలతో నివేదిక రూపొందించారు. కొందరి పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు జారీ అయినట్టు రెవెన్యూ అధికారులు ఈ సర్వే ద్వారానిరూపణఅయ్యిందని తెలియజేశారు. ప్రభుత్వ స్థలాలలో 100 పైగా పట్టాలు పాసుపుస్తకాలు పొందినవారు ఉన్నారని, వారిలో కొందరు జిల్లాలో పేరుగాంచిన ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న వారే ఉన్నట్టు పక్క సమాచారం.

### భూమిని స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ

జగిత్యాల రూరల్ మండలంలో నర్సింగాపూర్‌లోని ప్రభుత్వ భూములు అక్రమనకు సంబంధించిన పూర్తి నివేదికను జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అందజేయగా, ప్రభుత్వ స్థలాలను పట్టాలు, పాస్ పుస్తకాలు పొందిన వారి నుండి ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు ధరణిపోర్టల్ పేర్లను విరుద్ధంగా మార్చి పలువురి అక్రమార్కులకు పట్టాదారు, పాసు పుస్తకాలు అధించినట్లు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపణలు చేశారని తెలిసింది.

## హమాలీల 'కూలీ రేట్లు' పెంచేదెప్పుడు?



ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి : గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచకుండా హోల్‌సేల్ వ్యా పారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారికి కూలీ రేట్లు పెంచాలని లేకుంటే కూరగాయలమార్కెట్‌ను స్తంబింపజేస్తామని ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు మడ్డి ఎల్లాగౌడ్ హెచ్చరించారు. సోమవారం ఆయన గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పర్యటించి హమాలీ వర్కర్స్‌తో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నలబై ఏళ్ళకు పైగా గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో హమాలీ వర్కర్స్ పనిచేస్తున్నారని, హమాలీ కార్మికులకు 2017 లో పెంచిన కూలీ రేట్లు, ఇంత వరకు పెంచకుండా హోల్‌సేల్ వ్యాపారులు హమాలీలను ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదని అన్నారు.హోల్‌సేల్ వ్యాపారులు హమాలీ కూలీ రేట్లు పెంచమంటె పెంచకుండా ఇక్కడ కూలీ రేట్లుఇతరప్రాంతాల్లోని మార్కేట్‌ల కన్నా ఎక్కువ ఇస్తున్నామని ఫ్లెక్సీబ్యానర్‌లు వేసి మార్కెట్‌లోప్రదర్శించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.గోదావరిఖని కూరగాయల మార్కెట్‌తో ఇతర మార్కెట్‌లో ఉన్న కూలీ రేట్లు పోల్చవద్దని, ఎక్కడి మార్కెట్ కు అక్కడె సౌకర్యం బట్టి కూలీ రేట్లుఉంటాయని, అది గమనించకుండా కూలీరేట్లు పెంచేది లేదని మొండికేయడం సరైంది కాదని వ్యాపారులకు సూచించారు. ఇప్పటికైనాహోల్‌సేల్‌వ్యాపారులు కూలీ రేట్లు పెంచాలనిడిమాండ్‌చేశారు.ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్,గోదావరిఖని కూరగాయల మార్కె ట్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్, నాయకులు కండె లక్ష్మ య్య, రాంచందర్, జానిమియా, గాలిపెల్లి సతీష్ ఉన్నారు.

ఫోకస్

# యువతరంగం

# సివిల్స్‌కు సిద్ధం కండి

## సిబిఎస్ఇ పరీక్షల తేదీలు..




సిబిఎస్ఇ 10,12వ తరగతి పరీక్షల షెడ్యూల్ ఇదే.. సిబిఎస్ఇ 10వ, 12వ తరగతి పరీక్షల షెడ్యూల్ ఇటీవల విడుదలైంది. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి మార్చి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారుసిబిఎస్ఇ 10వ, 12వ తరగతి పరీక్షల షెడ్యూల్ ఇటీవల విడుదలైంది. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి మార్చి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్నాయి. సిబిఎస్ఇ పదో తరగతి మొదటి పరీక్ష ఫిబ్రవరి 15న ఇంగ్లిష్ కమ్యూనికేటివ్/ ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, ఫిబ్రవరి 20న సైన్స్, ఫిబ్రవరి 22న ఫ్రెంచ్/ సంస్కృతం, ఫిబ్రవరి 25న సోషియాలజీ, ఫిబ్రవరి 28న హిందీ కోర్సు A/B, మార్చి 10న మ్యాథ్స్, మార్చి 18న కంప్యూటర్ అప్లికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఏఐ పరీక్ష నిర్వహిస్తారు.12వ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 15న ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21న ఫిజిక్స్, ఫిబ్రవరి 22న బిజినెస్ స్టడీస్, ఫిబ్రవరి 24న భౌగోళిక శాస్త్రం, ఫిబ్రవరి 27న కెమిస్ట్రీ, మార్చి 8న మ్యాథ్స్ స్టాండర్డ్/ అప్లైడ్ మ్యాథమెటిక్స్, మార్చి 18న ఇంగ్లిష్ ఎలక్టివ్/ ఇంగ్లిష్ కోర్, మార్చి 19న ఎకనామిక్స్, మార్చి 22న పొలిటికల్ సైన్స్, మార్చి 25న బయాలజీ, మార్చి 26న అకౌంటింగ్, ఏప్రిల్ 1న హిస్టరీ, ఏప్రిల్ 4న సైకాలజీ పరీక్ష నిర్వహిస్తారు.

## బెర్నీ సాండర్స్





అమెరికాలో పేరొందిన రాజకీయ నాయకుడు బెర్నీ సాండర్స్.... తొలుత విద్యాపరమైన, ఆ తర్వాత సమాజిక సమస్యలపై అతని పోరాటం యువతకు మార్గదర్శకం. నల్లజాతి పాఠశాలల్లో విద్యార్థుల రద్దీని తగ్గించడానికి ఉద్దేశించిన మొబైల్ క్లాస్‌రూమ్స్ 'విల్లిస్ వ్యాగన్స్' ఏర్పాటును నిరసిస్తూ 1963లో ఉవ్వెత్తున ఎగసిపడిన నిరసనల్లో 21 ఏళ్ల సాండర్స్ చురుగ్గా పాల్గొన్నారు. చికాగో పోలీసులు అతనిని అరెస్టు చేసి, జైల్లో పెట్టారు. కానీ, అతను తన పోరాటాన్ని మానలేదు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత, నల్లజాతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి నిరసనను ఉధృతం చేశాడు. 'విల్లిస్ వ్యాగన్స్' ద్వారా నల్లజాతీయులను విద్యకు దూరం చేస్తున్నారని వారి ఆరోపణ. అంతేగాక, కొన్ని పాఠశాలల్లో శ్వేతజాతీయులకు మాత్రమే ప్రవేశం ఉండడాన్ని కూడా సాండర్స్ వ్యతిరేకించాడు. ఈ చర్యను జాతి వివక్షగా అభివర్ణించాడు. పాఠశాలల ఏకీకరణకు కృషి చేశాడు. జాతులతో సంబంధం లేకుండా, విద్యార్థులందరికీ ఒకే రకమైన అవకాశాలు ఉండాలని నినదించాడు. అనంతర కాలంలో అతను పౌర హక్కుల ఉద్యమాల్లోనూ పాల్గొన్నాడు. అమెరికా నగరాల్లో, ముఖ్యంగా విద్యా వ్యవస్థలో ఇప్పటికీ లోతుగా వేళ్లానుకున్న జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతునే ఉన్నాడు. 1941 సెప్టెంబర్ 8న జన్మించిన సాండర్స్, 83 ఏళ్ల వయసులోనూ మానవ హక్కుల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. వెర్మోంట్ నుంచి సీనియర్ సెనెటర్‌గా కొనసాగు తున్నాడు. అతని ఉద్యమ స్ఫూర్తి లక్ష లాది మంది యువతకు ఆదర్శం.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..



## యుపిఎస్‌సి సిఎస్ఇ–2025 నోటిఫికేషన్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో, ఔత్సాహికులు పరీక్షలకు అన్ని విధాలా సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. 979 యుపిఎస్‌సి ఖాళీలు భర్తీ చేయడానికి జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ (ఐఎఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)లో పోస్టింగ్స్ కోసం పరీక్షలు నిర్వహిస్తారు. వీటితోపాటు ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)లో అదనంగా ఉన్న 150 ఇతర ఖాళీలను కూడా భర్తీ చేయనున్నారు. దీనితో మొత్తం పోస్టుల సంఖ్య 1129కి చేరింది. దేశంలోనే అత్యంత కష్టమైన పోటీ పరీక్షగా పేర్కొనే యుపిఎస్‌సి ద్వారా ఎంపికైన వారికి పరిపాలన, చట్టాన్ని అమలు చేయడం, విదేశీ సేవలతో పాటు దేశ అభివృద్ధికి దోహదపడే వివిధ రంగాలలో పని చేసే అవకాశాన్ని అందిస్తారు. విద్యార్థులు కరెంట్ అఫైర్స్‌పై దృష్టి పెట్టాలి. యుపిఎస్‌సి పరీక్షలు భారత ప్రభుత్వంలో గ్రూప్ 'ఎ'తో పాటు, గ్రూప్ 'బి' ఖాళీలను కూడా భర్తీ చేయడానికి నిర్వహిస్తారు. సాధారణంగా సివిల్స్‌గా పిలిచే ఈ పరీక్షలకు ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ పట్ల ఆసక్తిగల వారే కాకుండా, ఆదాయ పన్ను (ఐటి), కస్టమ్స్, పరోక్ష పన్నులు విభాగాల్లో పని చేయడానికి ఇష్టపడేవారు కూడా దరఖాస్తు చేసుకుంటారు. ప్రిలిమ్స్, మెయిన్స్, వ్యక్తిత్వ పరీక్ష పరీక్షల ద్వారా ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. వయోపరిమితి 21 నుంచి 32 సంవత్సరాలు (ఎస్‌సి, ఎస్‌టిలకు 5 సంవత్సరాలు, ఒబిసిలకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల సడలింపు ఉంటుంది). అత్యధిక ప్రయత్నాల సంఖ్య 6 (సడలించదగినవి). 7వ పే కమిషన్ సిఫార్సుల మేరకు ప్రారంభ జీతం నెలకు రూ. 56,100. upsc.gov.in వెబ్‌సైట్ నుంచి వివరాలు పొందవచ్చు. పిడిఎఫ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 25న ప్రిలిమ్స్ జరుగుతాయి. ఇందులో జనరల్ స్టడీస్ పేపర్ I, జనరల్ స్టడీస్ పేపర్ II (సిఎస్‌ఎటి) పేపర్లు ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటాయి. తప్పు సమాధానలకు మైనస్ మార్కుల విధానాన్ని అమలు చేస్తారు. యుపిఎస్‌సి కటాఫ్‌గా నిర్ణయించిన మార్కుల కంటే ఎక్కువ మార్కులు స్కోర్ చేసిన వారికి మెయిన్స్ రాసే అవకాశం ఉంటుంది. జనరల్ స్టడీస్ పేపర్ Iలో మొత్తం 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. కటాఫ్ మార్కులు 100. తప్పు సమాధానానికి 0.66 మార్కులు మైనస్ అవుతాయి. జనరల్ స్టడీస్ పేపర్ II (సిఎస్‌ఎటి)లో 200 మార్కులకు పేపర్ ఉంటుంది. కటాఫ్ మార్కులు 80. తప్పు సమాధానాలకు మైనస్ మార్కులు 0.83. ప్రిలిమ్స్ ఫలితాలు వెలువడిన తర్వాత, అర్హత పొందిన వారికి మెయిన్స్ నిర్వహిస్తారు. ఆగస్టు 22న మెయిన్స్ జరుగుతుంది. ఇందులో వివరణాత్మక స్వభావంతో కూడిన తొమ్మిది పేపర్లను 1750 మార్కుల కోసం రాయాల్సి ఉంటుంది. పేపర్ 'ఎ'ను భారత రాజ్యం, 8వ షెడ్యూల్‌లో పేర్కొన్న భాషల్లో ఏదో ఒకదానిలో మాత్రమే రాయాలి. మొత్తం మార్కులు 300. పేపర్ 'బి'లో ఆంగ్లభాషలో ఉంటుంది. దీనిని కూడా 300 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్ Iలో 250 మార్కులకు వ్యాసం, పేపర్ IIలో 250 మార్కులకు జనరల్ స్టడీస్ I, అదే విధంగా పేపర్ IIIలో 250 మార్కలకు జనరల్ స్టడీస్ II, పేపర్ IVలో 250 మార్కులకు జనరల్ స్టడీస్ III, 250 మార్కులకు జనరల్ స్టడీస్ IV, ఆప్షనల్ పేపర్ I 250 మార్కులు, ఆప్షనల్ పేపర్ II 250 మార్కులు. సిలబస్ తదితర వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

### జనరల్ స్టడీస్‌లో కీలకాంశాలు..

జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రస్తుత సంఘటనలు.
భారతీయ, ప్రపంచ భూగోళశాస్త్రం
ఆర్థిక, సామాజిక అభివృద్ధి
ఇండియన్ పాలిటీ అండ్ గవర్నెన్స్

### జనరల్ సైన్స్,

పర్యావరణం మరియు జీవావరణ శాస్త్రంపై సాధారణ సమస్యలు

### సిఎస్‌ఎటి కోసం..

కమ్యూనికేషన్ నైపుణ్యాలతో సహా వ్యక్తిగత నైపుణ్యాలు, నిర్ణయం తీసుకోవడం, సమ స్య పరిష్కారం, తార్కిక తార్కికం, విశ్లేషణాత్మక సామర్థ్యం, సాధారణ మానసిక సామర్థ్యం, ప్రాథమిక సంఖ్యాశాస్త్రం (తరగతి ప దోతర గతి స్థాయి) డేటావివరణ (చార్టులు, పట్టికలు,గ్రాఫ్లు, డేటా సమృద్ధి, మొదలైనవి)

### మెయిన్స్ కోసం సిలబస్

కాంప్రహెన్షన్, ఖచ్చితమైన రచన, వాడుక, పదజాలం, చిన్న వ్యాసాలు, అనువాదం.

### సాధారణ అంశాలు

ఇండియన్ హెరిటేజ్ అండ్‌కల్చర్, హిస్టరీ అండ్ జియోగ్రఫీ ఆఫ్ ది వరల్ అండ్ సొసైటీ.,పాలన,రాజ్యాంగం, రాజకీయాలు, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సంబంధాలు,సాంకేతికత,ఆర్థికాభివృద్ధి, జీవవైవిధ్యం, పర్యావరణం, భద్రత, విపత్తు నిర్వహణ.

### నీతి, సమగ్రత, ఆప్టిట్యూడ్

ఐచ్ఛిక పేపర్ I, ఆప్షనల్ పేపర్ II యొక్క సిలబస్ గ్రాడ్యుయేట్ స్థాయిలో ఉంటుంది.

## వృద్ధాప్యం శాపం కారాదు..



మన దేశంలో మ నిషి సగటు జీవితకాలం 68 సంవత్సరాలు. వృద్ధాప్యంలో ఉన్న వారు శారీరకంగా, మానసికంగా చాలా సమస్యలు ఎదుర్కొంటారు. వారికి అండగా నిలిచి వారితో చక్కటి అనుబంధాన్ని ఏర్పరచుకుంటే వారు ఆత్మీయతకు నోచుకున్న వారవుతారు. మీరు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు కూడా ఈ ఆప్యాయత అవసరం అవుతుంది.శారీరక మార్పుల్లో ముఖ్యంగా చర్మం ముడతలు పడి ఉంటుంది. పొడి బారి తరచూ చర్మ సంబంధిత వ్యాధులు వస్తుంటాయి. శరీరం బలహీనం అవుతుంది. కంటి చూపు తగ్గుతుంది. చెవులు సరిగ్గా వినపడవు. జీర్ణ శక్తి తగ్గుతుంది. మతి మరుపు పెరుగుతుంది. ఆలోచన శక్తి తగ్గుతుంది. దంత సమస్యలు ఏర్పడుతాయి. బరువు తగ్గుతారు. వంగి నడవాల్సి వస్తుంది. చేతుల్లో వణుకు ప్రారంభమవుతుంది. మాట తడబడవచ్చు. వయసును బట్టి తరచూ మూత్రవిసర్జన చేయాల్సి రావొచ్చు. మానసిక సమస్యలు కూడా ఏర్పడుతాయి. ఆర్థిక అవసరాల కోసం ఆదాయం లేకపోవడం, ఖాళీగా ఉండడం వల్ల ప్రశాంతత కోల్పోవచ్చు. డిప్రెషన్కు లోను కావొచ్చు. ఒంటరితనానికి లోను కావొచ్చు. ఇతరులపై ఆధారపడాల్సి రావడాన్ని జీర్ణించుకోలేకపోవచ్చు. మద్యానికి అలవాటు పడొచ్చు. ఈ సమస్యలను అధిగమించడానికి ఏదో ఒక వ్యాపకం ఉండితీరాలి. వృద్ధాప్యంలో ఎముకలు బలహీనంగా ఉంటాయి. పడితే విరిగిపోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల వారికి ఇలాంటి సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇండియన్ టాయిలెట్ కాకుండా, వెస్ట్రన్ టాయిలెట్ వసతి సమకూర్చాలి. వాష్ రూమ్లో కాలు జారి పడిపోయే పరిస్థితి ఉండకూడదు. సాధ్యమైతే చిన్న చిన్న వ్యాయామాలు, లేదంటే కాలి నడకను అలవాటు చేయాలి. యోగ, ధ్యానం వంటివి ప్రోత్సహించాలి. మతిమరుపు వల్ల అన్ని విషయాలు మరిచిపోతుంటారు. వారికి ఔషధాలు, నిత్యావసరాలు అందేలా చూడాలి. ఇందుకోసం ఒక షెడ్యూలును అందరికీ కనిపించేలా వాల్ పోస్టర్ రూపంలో అతికించాలి. అజీర్ణం, మల బద్ధకం వంటి సమస్యల విషయంలో అశ్రద్ధ చూపకుండా వైద్యులను సంప్రదించాలి. కంటి చూపు మరింత దెబ్బతినకుండా ఎప్పటికప్పుడు వైద్యుడిని సంప్రదించాలి. వినికిడి సమస్యలు ఉ న్నా, బీపీ, షుగర్ వంటి అనారోగ్యాలు ఉన్న నిర్లక్షం చేయరాదు. దగ్గరుం డి వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి. సౌకర్యవంతమైన వాతావరణంలో ఉం డేలా చూడాలి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునేలా, వింటర్లో చలి నుంచి రక్షణ లభించేలా చూడాలి. ఆయా కాలాలు, పండగలకు అనుగుణంగా నూతన వస్త్రాలు సమకూర్చాలి. ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్దయ్యాక అజీర్ణ సమస్యలు తరచుగా వస్తున్నందున పీచు పదార్థాలు కలిగిన ఆహార పదార్థాలు, ముఖ్యంగా పండ్లు ఇవ్వాలి. మద్యపానం, ధూమపానం మానేసేలా చూడాలి. దంత సమస్యలకు ఎప్పటికప్పుడు చికిత్స లభించేలా చూడాలి. కుటుంబ సభ్యులంతా వీరికి తగిన సమయం కేటాయించి ఆప్యాయంగా మాట్లాడితే వారు మానసికంగా దృఢంగా ఉంటారు. వారికి తగిన గౌరవం, మర్యాద ఇవ్వాలి. వృత్తి జీవితంలో చాలా అలసిపోయి ఉంటారు. ప్రస్తుతం ఖాళీగా ఉంటే వారికి తగిన పుస్తకాలు సమకూర్చాలి. పర్యాటకంపై ఆసక్తి ఉంటే అందుకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలి. చిన్నచిన్న వ్యాపారాలపై ఆసక్తి ఉంటే ఆ దిశగా ప్రోత్సహించాలి. గార్డెనింగ్, పెట్స్ వంటివాటిపై ఆసక్తి ఉంటే వాటిని సమకూర్చాలి. హాబీలను ప్రోత్సహించాలి.

–సేకరణ

# ఆర్‌టిసి ఆస్తులపై కాంగ్రెస్ సర్కారు కన్ను

**రాష్ట్రంలో 22 డిపోల ఆస్తులను ప్రైవేట్‌కు ధారాదత్తం**
**కరీంనగర్ సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ధ్వజం**



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆస్తులపై కాంగ్రెస్ ప్రభుత్వం కన్నుపడిందని కరీంనగర్ సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆరోపించారు. రాష్ట్రంలోని 22 డిపోలు, బస్టాండ్ల స్థలాలను ప్రైవేట్ సంస్థలకు, వ్యక్తులకు లీజుకు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందంటూ దుయ్యబట్టారు. ఈవిషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సంబంధిత శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందంటూ ధ్వజమెత్తారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పరిపాలించిన కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రభుత్వాలు మూడు విడతలుగా చేసిందే తాజాగా నాలుగో విడతగా కాంగ్రెస్ ప్రభుత్వం అదే పునరావృతం చేస్తూ ఆర్‌టిసిని నిర్వీర్యం చేయాలని కుట్ర చేస్తోందన్నారు. కరీంనగర్‌లో బిఆర్ఎస్ ప్రభుత్వం జోనల్ వర్క్‌షాప్‌ను, కాంగ్రెస్ మల్టీప్లెక్స్‌ను, వరంగల్‌లో మాజీ ఎంపి దయాకర్, ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డి ఆర్‌టిసి ఆస్తులను ధ్వంసం చేసి ఆక్రమించుకున్నారని గుర్తు చేశారు. లక్షలాది మంది ప్రయాణించే ఆర్టీసి సంస్థను నడిపించకుండా ప్రైవేట్ సంస్థలైన మెగా, జెబిఎంలకు డిపోలను స్వాధీనం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలోని 22 డిపోలలోని బస్టాండ్లను, ఖాళీస్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం ద్వారా చేతులు దులుపుకునే విధంగా కాంగ్రెస్ నిర్వాకం ఉందన్నారు. దాదాపు 66.3 ఎకరాల స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రైవేశపెట్టి ఉన్న బస్సులను నడపకుండా ఉద్యోగులను బదిలీలు చేస్తూ నూతన ఉద్యోగాలివ్వకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. తెలంగాణలోని ఆర్టీసీలో 58వేల మంది కార్మికులు, ఉద్యోగులుంటే అదినేటికి 42వేలకు పడిపోయిందన్నారు. 10,500 బస్సులుంటే 9 వేలకు వచ్చాయన్నారు. సంస్థల్లో కారుణ్య నియామకాలు తప్ప నూతన రిక్రూట్‌మెంట్ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 1000 ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేసి ఆర్టీసీ సంస్థకు అప్పగించేందుకు ప్రైవేట్ మెగా, జెబిఎంలను చెరో 500 బస్సులను తయారు చేసి ఇవ్వాలని ఒప్పందం చేసుకోగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పై రెండు సంస్థల నుంచి గత నెల క్రితం రాష్ట్రవ్యాప్తంగా 344 ఎలక్ట్రిక్ బస్సులు అన్ని డిపోల్లోకి ఆర్టీసి సంస్థ కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్‌టిసి సంస్థ ఆస్తులను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని సంస్థలోని ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపడుతు న్న సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ప్రభుత్వ ఆధీనంలోని ఆర్‌టిసి ని రక్షించుకోవడంతో పాటు ఆస్తులను కాపాడుకోవడానికి ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ధరేందర్‌రెడ్డి సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బ్రాహ్మండ్లపెల్లి యుగంధర్, బోనగిరి మహేందర్, న్యాలపట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**పలు చోట్ల ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసనలు**






**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సత్తెనపల్లి విజయలక్ష్మి మాట్లాడుతూ, కేంద్రం రాష్ట్రం కలిసి మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వంట కార్మికుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని వహిస్తున్నాయన్నారు.పెరిగిన ధరలకు అనుగుణంగా వంట కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి స్కూల్లో వంట చేయదానికి ప్రత్యేక షెడ్ల నిర్మాణం చేయాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కరించాలని లేని యెడల తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు పోరాటాలు నిర్వహి స్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, జిల్లా నాయకులు బండి నాగేశ్వరావు, వైఎస్ గిరి ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి యాకూబ్, కార్యదర్శి ఎండూరి ప్రభావతి, పొదల మంగ, పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా సోమవారం నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజకు, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని, గత పది నెలలుగా పెం డింగ్‌లో ఉన్నా బకాయిలను తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐ టియుసి ఖమ్మం జిల్లా అధ్యక్షులు గాదేలక్ష్మీ నారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నం భోజన పథకం వర్కర్ సంఘం రాష్ట్ర నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, ఏఐటీయూసి జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, జిల్లా కార్యదర్శి మల్లేష్, టి.రామారావు, తాళ్లూరు పాల్గొన్నారు.

**నిజామాబాద్‌ప్రతినిధి :** పిఎం పోషణ మినరల్స్ (రాగి జావ) నిర్వహణ కోసం కార్మికులకు పారితోషకం ఇవ్వా లని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిజి కళాశాల నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన పిఎం పోషణ మినరల్స్ జిల్లాలోని పాఠశాలల్లో రాగి అందిస్తున్న విద్యార్థులకు అందిస్తుందని, కానీ ఎలాంటి పారితోషకం ఇవ్వటం లేదని ఈ పథకం కింద తెలంగాణలో రూ.8 కోట్లు నిల్వ ఉన్నాయని నిర్వాహకులకు నెలకు వెయ్యి రూపాయలు ఇప్పించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, శ్రీను, సాయమ్మ, నాగలక్ష్మి , బుచ్చయ్య, నర్సింగ్‌రావు, హన్మాండ్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీలపై సంఘ్ పరివార్

# కుట్రలను తిప్పికొడదాం





**ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ డిమాండ్**
**మోడీ దిష్టిబొమ్మ దగ్ధం**

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ తీసుకువచ్చిన యూజీసీ నూతన మార్గదర్శకాలను వెంటనే ఉప సంహ రించుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ డిమాండ్ చే శారు. యూజిసి నూతన మార్గదర్శకాలను వ్యతిరేకిస్తూ హనుమకొండ జిల్లా కౌన్సి ల్ ఆధ్వర్యంలో కేయూ ఫస్ట్ గేట్ ముందు మోడీ దిష్టి బొమ్మను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సంతోష్, యూనివర్సిటీలలో సంఘ్ పరివార్ శక్తులను నొప్పించడానికే ఈ మార్గదర్శకాలను అమలు చేస్తు న్నారని దుయ్యబట్టారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వున్న వీటిని రాష్ట్ర ప్రభు త్వాలు వ్యతిరేకించాలని సూచించారు. మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహి స్తున్న బిజెపి, సంఘ్ పరివార్ కుట్రలకు వ్యతిరేకంగా పోరాడుతామని, యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తిని కాపాడుకుంటామని సంతోష్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్ , కుక్కల కుమార్ , జిల్లా సహాయ కార్యదర్శి కసర బోయిన రవి తేజ, జిల్లా సమితి సభ్యులు శ్రీపతి వినయ్ కేయూ నాయకులు బి.వినయ్, సాయి, రాజ్ కుమార్ నవీన్ అనిల్ సునీల్ రాజుల తోపాటు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధకంగా ఉన్న యుజిసి గైడ్ లైన్స్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా సమితి ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ ఎదుట ధర్నా నిర్వహిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని విఘాతం కలిగిస్తున్న యూజిసి గైడ్‌లైన్స్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, రాష్ట యూనివర్సిటీల విసిల నియామకాల్లో రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలని, రాజకీయాలకతీతంగా విద్యారంగానికి సంబంధించిన వారినే యూనివర్సిటీలకు విసిలుగా నియమించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో మతచాంద సవాదం ప్రభా వం చూపుతుందని, ఫలితంగా విద్యా వ్యవస్థ కు నష్టం కలుగుతుందని ఆవేదనవ్యక్తం చేశారు. ప్రశాంతం గా ఉన్న విశ్వవిద్యాలయాలు అశాంతికి నిలయాలుగా మారే ప్రమాదముందని వాపోయారు. యూనివర్సిటీలపై సంఘ్‌పరివార్ కుట్రలను తిప్పికొట్టాలని పిలు పునిచ్చా రు. కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు, నాయకులు మచ్చ పవన్, కళ్యాణ్, బోయిని విష్ణువర్దన్, ప్రనిష్, మహే ష్, రంజిత్ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు.






**నిజామాబాద్ ప్రతినిధి :** ఫెడరల్ హక్కులను కాలరాసే ప్రభుత్వ యూనివర్సిటీలను మూసివేసే కుట్రలకు యుజిసి తెర లేపిందని, వైస్‌ఛాన్సలర్లను గవర్నర్లకు కట్టబెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సభ్యులు రఘు రాం డిమండ్ చేశారు. టియు ఆర్ట్స్ అండ్ సైన్స్ బిల్డింగ్ ఎదుట ఎఐఎస్‌ఎఫ్ టియు సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు వారు మా ట్లాడుతూ దేశంలో విశ్వవిద్యాలయాల సైద్ధాంతిక నియంత్రణ కార్పొరేట్ శక్తులు లాభదాయక సాధనగా హిందుత్వ ప్రచార సాధనలాగా మారకుండా ఉద్యమించాల్సిన అవసరముం దన్నారు. ఉన్నత విద్యను పడుకునేందుకు విద్యావేత్తలు విద్యార్థులు యుజిసి ముసాయిదా మార్గ దర్శకాలకు వ్యతిరేకంగా ఉద్యమించటానికి విద్యార్థులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంజలి, నవీన్, సాయి, చందు, సంజయ్, గౌతమ్, దినేష్, రవీందర్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ నల్లగొండ :** యుజిసి నూతన మార్గదర్శకాలను వెనక్కి తీసు కోకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఎఐఎస్‌ఎఫ్ యూని వర్సిటీల రాష్ట్ర కన్వీ నర్ రెహమాన్ హెచ్చరించారు. యూజీసీ నూతన మార్గ దర్శకాలను వెనక్కి తీసు కోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎదుట నిరసన కార్యక్రమం చేశారు.ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వివరిస్తుందని, నిబంధనలను తుంగలో తొక్కి ఏకపక్షంగా విసిలను నియమించడం సరైనది కాదన్నారు. నిబంధనల ప్రకారం యుజిసి, రాష్ట్ర ప్రభుత్వం, యూనివర్సిటీలు కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేసి విసిలను నియమించాల న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్య క్షులు బరిగల వెంకటేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమల్ల ఆంజ నేయులు, ముది గొండ మురళీకృష్ణ ,జిల్లా కోశాధికారి గాదె పాక సూర్యతేజ, విద్యార్థులు ప్రభాస్, పల్లె కిరణ్,వెంకటేష్ ,పవన్ పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకల్లో రాష్ట్రపతి ప్రత్యేక ఆహ్వానితుడిగా వరంగల్ వాసి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్‌కు వరంగల్ వాసి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి సిరిమల్ల రాజేంద్రప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం నుంచి ప్రత్యేక ఆహ్వానం అందించినట్లు తెలిపారు. గణతంత్ర వేడుకల పరేడ్‌కు వివిధ రాష్ట్రాల నుంచి ఐదుగురు వ్యక్తులు ఎంపికయ్యారు. అందులో తెలంగాణ రాష్ట్రం హన్మకొండ జిల్లా మడికొండకు చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి రాజేంద్రప్రసాద్ హాజరై వరంగల్ ఖ్యాతిని దేశవ్యాప్తంగా వ్యాపించారు. పరేడ్, సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో జరిగే ఎట్ హోమ్ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. తనను ఎంపిక చేయడం పట్ల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ నుంచి రాజేంద్రప్రసాద్ ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.


## ప్రజా విజ్ఞప్తులకు సత్వరమే పరిష్కారం చూపండి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ప్రజా విజ్ఞప్తులకు సత్వరమే పరిష్కారం చూపాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందచేశారు. మొత్తంగా 85 ఫిర్యాదు అందుకున్నట్లు తెలిపారు. అదనపు కమిషనర్ జోనా, ఎస్ఇ ప్రవీణ్ చంద్ర, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్ఓ రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఇన్‌చార్జి సిపి రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/సంగెం:** స్వయం సహాయక మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం సంగెం మండలం నల్లబెల్లి గ్రామంలో సోలార్ పవర్ ప్లాంటు నిర్మాణానికి అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. స్వయం సహాయక సంఘాలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా సోలార్ పవర్ ప్లాం ట్లు ఏర్పాటుకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.రెడ్కో జిల్లా మేనేజర్ మహేందర్‌రెడ్డి, తహసీల్దారు రాజ్‌కుమార్, ఎంపిడిఓ రవీందర్, కాంగ్రెస్ మంలాధ్యక్షుడు మాధవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి జ నగాం రమేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు రమేశ్, కేశవులు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌నాయక్, నరహరి, ఎపిఆర్, అవినాష్‌నాయ క్‌తో పాటు సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పొగ మంచు గుప్పిట్లో 'నెక్కొండ'



**ప్రజాపక్షం/నెక్కొండ:** సహజంగా తెలంగాణలో ఉష్ణోగ్రతలుఎక్కువగా ఉంటాయి కానీ అందుకు విరుద్ధంగా సోమవారం ఉదయం 8:30 గంటల ప్రాంతంలో సైతం నెక్కొండ రైల్వే స్టేషన్‌ను మొత్తం పొగ మంచు గుప్పి ట కప్పేసింది. రోజు ఉదయం ఏడు గంటలకు రావలసిన భద్రాచలం నుండి సికింద్రాబాద్ వెళ్లే కాకతీయ రైలు ఎక్కి ప్యాసింజర్లు ఒకరికి ఒకరు కనబడకుండా మంచు కురవడంతో రైల్వే స్టేషన్ ప్రాంతమంతా చీకటిగా మారిపోయింది. ఈ పరిస్థితిలో ప్రయాణికులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

## గౌడ వృత్తిదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


**ప్రజాపక్షం/పాలకుర్తి:** నియోజకవర్గంలోని గౌడ వృత్తిదారుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం వద్ద గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర నూతన సంవత్సర 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డి, ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్‌లు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మా ట్లాడుతూ గౌడ వృత్తిదారులకు నియోజకవర్గ వ్యాప్తంగా కాటమయ్య సేఫ్టీ కిట్స్ అందరికీ అందజేస్తామని తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ మంజుల భాస్కర్, ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సోమనారాయణ, మండల అధ్యక్షుడు పాడిశెట్టి వెంకన్న, పట్టణ అధ్యక్షుడు కమ్మగాని నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ రూపకల్పనకు అహర్నిశలు కృషి చేసిన అంబేద్కర్

**ప్రజాపక్షం/కొడకండ్ల:** బ్రిటీష్ పాలనకు ముందు భారతదేశానికి రాజ్యాంగం లేదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత స్వాతంత్ర్యం అనంతరం తాను రాసిన రాజ్యాంగం ద్వారానే నేడు సంపూర్ణ స్వేచ్ఛ, లౌకికత్వం, సమానత్వం, ప్రజలే పాలకులుగా నేడు కొనసాగుతున్నారని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బ్లాక్ ఆఫీస్ ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ ప్రజాస్వామ్య పరిపాలనకు యువత, మేధావులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురేష్ నాయక్, నాయకులు అందె యాకయ్య, ధర్మారపు బిక్షపతి, శ్రీవర్ణ, రాపాక సత్యనారాయణ, రాజేష్, యాకేష్, వలబోజు రమేష్, వెంకట్‌రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం తగదు

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం తగదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌లు దరఖాస్తులను స్వీకరించారు. ఈ పాలకుర్తి మండలం దుబ్బతండా గ్రామానికి చెందిన బానోతు బుజ్జీ పాలకుర్తి రిజర్వాయర్‌లో ముంపునకు గురైనా తన పట్టా భూమి సర్వే నెంబర్ 278లో 2 గుంటల భూమికి సంబంధించిన పరిహారం డబ్బులు ఇప్పించాలని కోరారు. జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ గ్రామానికి చెందిన సబ్బని పొందు తన 11 గుంటల భూమి పట్టా మార్పిడి కొరకు దరఖాస్తు చేశారు. లింగాలఘనపురం మండలం జీడికల్ గ్రామానికి చెందిన కంగర్ల అజయ్ ఎంసిహెచ్‌లో ల్యాబ్ అటెండర్‌గా దరఖాస్తు చేయగా ప్రొవిజనల్ మెరిట్ జాబితాలో మూడవ వ్యక్తిగా ఎంపికకాగా తుది జాబితాలో పేరు రాలేదని ఫిర్యాదు చేశారు. జఫర్‌గడ్ మండలం తీగారం గ్రామానికి చెందిన గట్టుమల్లు కొనుగోలు చేసిన తన భూమి సర్వే నెంబర్ 361లోని 1.33 ఎకరాల భూమి అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రఘునాథపల్లి మండలం, కన్నాయిపల్లి గ్రామానికి చెందిన పి సోమిరెడ్డి కరెంట్ బిల్లు సబ్సిడీ జీరో రావడం లేదని ఆర్జీలు పెట్టారు. వివిధ సమస్యలపై 42 దరఖాస్తులు వచ్చాయి. అనంతరం ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ధరఖాస్తుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కలెక్టర్ సుహాసిని, హనుమాన్ నాయక్, జనగామ, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఓలు గోపిరాం, వెంకన్న, డిడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డిఎఓ రామారావునాయక్, సిపిఓ పాపయ్య, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**పాఠశాలలను అధికారులు సందర్శించాలి :** జిల్లాలోని అన్ని పాఠశాలలను మండల ప్రత్యేక అధికారులు, తహాసీల్దార్లు, ఎంపిడిఒలు సందర్శించి పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి ప్రజావాణి అనంతరం అధికారులతో సమీక్ష నిర్వయించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ఇటీవల చేపట్టిన నాలుగు పథకాల పట్ల జాగ్రత్తగా ఉండాలని గ్రామ, వార్డు నిర్వాహణలో సమర్థవంతంగా పనిచేయాలన్నారు. వచ్చే ప్రజావాణి నుండి పై నాలుగు పథకాలకు సంబందించ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. గురుకులాల్లో 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు 60వేల సీట్లు ఉండగా ఫిబ్రవరి 23న ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వయించనున్నట్లు తెలిపారు. గురుకులాల్లో చేరే వారికి అవగాహన కల్పించాలని, గురుకులాలను పరిశీలించాలన్నారు.

## వినియోగంలో రైల్వే అండర్‌పాస్

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి వినతి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** ప్రజలు వాహనదారులు రైతులు, పాడి పశువుల రవాణా సౌకర్యంపై రావినారాయణరెడ్డి సిగ్నల్ కాలనీ వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్‌ను వినియోగంలోకి తేవాలని రైల్వే అధికారులకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర బి.అజయ్‌సారథిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసివేసిన అండర్‌పాస్‌ను స్తానికులతో కలిసి పరిశీలించిన అజయ్‌సారథిరెడ్డిమహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని 26వ వార్డు పరిధిలోని అండర్ పాస్‌ను ఇటీవల రైల్వే అధికారులు 3వ లైన్‌పనులు చేస్తున్నందున ఈ ప్రాంతంలోని అండర్‌పాస్‌ను మూసివేశారని ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు అండర్‌పాస్‌ను పరిశీలించారు. అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ అండర్‌పాస్ మూసివేయడం వల్ల ఈ ప్రాంతంలోని వారు తీవ్రంగా గత ఆరునెలల నుండి ఇబ్బందులు పడుతున్నరని తెలిపారు. ఈ అండర్ పాస్ నుండే రైతులు వాహనదారులు, పాడి పశువులను ప్రాంతం నుంచే తీసుకుపోవడం వల్ల ఇది మూసివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, ఎండి ఫాతిమా, నాంచరి దాసు, లాలు వెంకన్న, ఉప్పలయ్య, శ్రీనున, ప్రమీల, నాగేశ్వరావు, యాకయ్య, సందీప్, హరీష్, అన్నపూర్ణ, సైదులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్ 'ప్రాక్టీకల్స్'

వరంగల్ కలెక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ఫిబ్రవరి 3నుండి ప్రారంభమయ్యే ఇంటర్ ప్రయోగ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడానికి జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలనీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ ప్రయోగ పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఇంటర్మీడియేట్ బోర్డు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 3 నుండి జిల్లాలో ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభించబడుతాయని, నాలుగు విడుతల్లో జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1496 మంది ప్రథమ సం, 3484 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 4980 మంది ప్రయోగ పరీక్షకు హాజరు కానున్నారు. ఈ సారి ప్రయోగశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇంటర్ బోర్డు నుండి పర్యవేక్షించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, విద్య, వైద్య శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షల నిర్వహణ పకడ్బందీ గా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నిర్వహిస్తున్నందున విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి(ఇన్చార్జి) మాధవరావు, డిఆర్‌డిఒ కౌసల్యాదేవి, జెడ్‌పి సిఇఒ రామిరెడ్డి, డిఆర్‌ఒలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్సును ఢీకొట్టిన ట్రాలీ

ఒకరు మృతి... 10 మందికి గాయాలు



**ప్రజాపక్షం/ కమలాపూర్:** ట్రాలీ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఒకరు మృతి చెందగా పది మందికి గాయాలైన సంఘటన కమలాపూర్ మండలంలోని గూడూరు అంబాల ప్రధాన రహదారిపై జరిగింది. కమలాపూర్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... హన్మకొండ జిల్లా మునిపల్లి, చింతగుట్టు గ్రామానికి చెందిన సుమారు 20మంది కూలీలు ఎపి24 టిఎ 9122 అనే నెంబర్ గల ట్రాలీలో మండలంలోని వంగపల్లి గ్రామంలో వ్యవసాయ పనుల నిమిత్తం వచ్చి పనులు ముగించుకోని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా గూడూరు అంబాల ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ఎపి 29జెడ్ 1508 అనే నెంబర్ గల ఆర్‌టిసి బస్సును కూలీలతో ర్యాలీలో వస్తున్న డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల బస్సును ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న పది మందికి గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న కమలాపూర్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్ళి క్షతగాత్రులను 108సహాయంతో వరంగల్ ఎంజిఎం ఆసుప్రతికి తరలించారు. అదే విధంగా విషయం తెలుసుకున్న కాజీపేట ఎసిపి తిరుమల్ సంఘటన స్థలానికి చేరుకోని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ..... వాహనదారులు అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల ప్రమదాలు జరుగుతున్నాయని, దీంతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు రోడ్డు నియమాలను పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా గమ్యం చేరేవిధంగా ప్రయాణం చేయాలి

## ప్రజావాణికి 127 దరఖాస్తులు

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన ఆర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యల పరిష్కరించాలని కోరుతూ 127 దరఖాస్తులు కలెక్టర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డిఆర్ఓ వైవి గణేష్, ఆర్‌డిఒలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, డిఆర్‌డి ఓ మీనా శ్రీను సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సత్వరమే ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఆర్జీలను వచ్చే వారంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 38 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అట్టి ఆర్జీలను సత్వరమే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో 38 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 08, గృహ నిర్మాణ శాఖకు 07, పెన్షన్ 01, ఉపాధి కల్పనకు 02 ఇతర శాఖలకు సంబంధించినవి 20 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రతిష్టాత్మక నాలుగు పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ విజయవంతంగా అమలు చేయడంలో భాగస్వాములైన గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ యంత్రాంగం సేవలను అభినందనీయమన్నారు.ఫిబ్రవరి 12 నుండి 15 వరకు జరిగే శ్రీ సమ్మక్క సారలమ్మ చిన్న జాతరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని మౌళిక సౌకర్యాలు ఏర్పాటు చేసి జాతర విజయవంతం చేయడానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, ఆర్‌డిఓ వెంకటేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 29న సిపిఐ వందేళ్ల ప్రారంభ ఉత్సవాలు

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/కాజీపేట :** ఈ నెల 29న హనుమకొండలో సిపిఐ వందేళ్ల ఉత్సవాల ప్రారంభ సభను జయప్రదం చేయాలని హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె బిక్షపతి కోరారు. సోమవారం కాజీపేట మండలంరాంపూర్ గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు హనుమంతరావు స్తూపం వద్ద కరపత్రాల ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి బిక్షపతి హాజరై మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరంలో, సమ సమాజ స్థాపన కోసం, అంతరాలేని సమాజం కోసం 1925 డిసెంబర్ 26 న ఆవిర్భవించి మీరట్, కాన్పూర్, పెషావర్, లాహోర్ తదితర కుట్ర కేసులను కమ్యూనిస్టు కార్యకర్తలు నాయకులు ఎదుర్కొని, అండమాన్ జైలు జీవితం గడిపి మొక్క వోని ధైర్యంతో స్వాతంత్రం సిద్ధించే వరకు ముందుండి పోరాడి సమరశీల పోరాటాలు నడిపిన పార్టీ సిపిఐ అన్నారు. ఈ దేశంలో భూ సంస్కరణ అమలు చేయాలని, భూస్వాముల వద్ద లక్షలాది ఎకరాల భూమిని సేకరించి దున్నేవానికి భూమి కావాలనిం పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. కరువు కాటకాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని అనేక ప్రాంతాల్లో సాగునీటి కోసం ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని, దాని ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి జీవనోపాధి కలిగి ఈ దేశానికి అభివృద్ధికి పాటుపడుతుందని తెలిపి దశలవారీగా దశాబ్దాల పోరాటాలు చేసిన చరిత్ర కలిగి ఆయా రాష్ట్రాలలో ప్రాజెక్టులను కట్టించిన కోసం అహర్నిశలు కృషి చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా వెట్టిచాకిరి కి, భూస్వామ్య పెత్తనానికి, దొరల పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రాంతంలో స్వేచ్ఛా స్వాతంత్రం కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి 4500 మంది తమ రక్తం తర్పణంతో 3000 గ్రామాల విముక్తి చేసి పది లక్షల ఎకరాలను పేదలకు పంచిందని, ఇలా ప్రపంచ చరిత్ర కలిగిన ఈ పోరాటం నేటి తరానికి అందించటం కోసం పాలక ప్రభుత్వాలు నేటి తరానికి అందించేందుకు అందించేందుకు పాఠ్యాంశాలలో చేర్చాలని కర్రే బిక్షపతి డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లాలో, నగరంలో ఉన్న ప్రాంతంలో భారీ పరిశ్రమలు, విద్యా వైద్యం ఉపాధి అభివృద్ధి కోసం నిరంతరం ఉద్యమాలు చేస్తున్న పార్టీ సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి కర్ర బిక్షపతి తెలిపారు. హనుమకొండలో జనవరి 29న వందలాది మందితో భారీ ప్రదర్శన అనంతరం హరిత హోటల్ యందు సభ జరుగుతుందని, ముఖ్య అతిథిలుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నారని,కావున సకాలంలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని సిపిఐ జిల్లా కార్యదర్శి. కర్రె బిక్షపతి కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్. మండల కార్యదర్శి మునగాల బిక్షపతి, మాలోత్ శంకర్ నాయక్, బొట్టు బిక్షపతి, బట్టు మల్లయ్య, ఐలయ్య, ఉపేందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలు భేష్

అధికారులను అభినందించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లాలో ప్రతిష్టాత్మక నాలుగు పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు జారీ ప్రక్రియ విజయవంతంగా అమలు చేయడంలో భాగస్వాములైన గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ యంత్రాంగం సేవలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అభినందించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయను పథకాలకు లబ్ధిదారుల ఎంపికకై ఈ నెల 16 నుండి 20 వ తేదీ వరకు క్షేత్రస్థాయి విచారణ, 21 నుండి 24 వరకు గ్రామసభలు నిర్వహణలో ప్రజల సహకారం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకాలను విజయవంతంగా అమలు చేయడానికి అధికారుల కృషి, ప్రతిష్టాత్మక పనితీరును కలెక్టర్ ప్రశంసించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ప్రభుత్వ ఆశయం మేరకు ప్రతి ఒక్కరి కృషి ప్రశంసనీయమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన పేదలకు అందించడంలో స్ఫూర్తితో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ సోలార్ విద్యుత్

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు మండల కేంద్రాన్ని సోలార్ గ్రామంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. మండల కేంద్రంలో ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఎంపిక చేయడమైనది తెలిపారు. ఆత్మకూరు గ్రామ ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకొని ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ అమర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ వెంకటరమణ, డి ఈ సౌమ్య నాయక్, ఎడిఇ. దేవేందర్ నాయకు తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఏసిపి సతీష్ బాబు,సిఐ సంతోష్, ఎఇవెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి కక్కెర్ల రాధిక రాజు,మాజీ ఎంపిపి మార్క సుమలత రజనీకర్, జిల్లా నాయకులు ,మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు,బరుపట్ల కిరీటి, మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్,భయ్యా కుమారస్వామి, వి.వెంకటేశ్వర్లు, సబ్ ఇంజనీర్ శివకుమార్, లైన్మెన్ రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట బస్‌స్టాండ్, రైల్వే డివిజన్ ఏర్పాటుకు కృషి

రైల్వే జిఎంను కలిసిన ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యేలు శ్రీహరి, నాయిని



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** హైదరాబాద్‌లో రైల్వే జీఎంను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా కాజీపేట బస్ స్టాండ్, రైల్వే డివిజన్ ఏర్పాటుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రైల్వేస్టేషన్ నుండి బోడగుట్ట వైపున ఫుట్ ఓవర్ బ్రిడ్జిని, రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డు అండర్ బ్రిడ్జిని మంజూరు చేయాలని కోరారు. సికింద్రాబాద్ రైల్వే భవన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ జిఎం అరుణ్ కుమార్ జైన్, డిజిఎం ఉ ద య్ నాథ్ కోట్లతో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కడియం శ్రీహరి, వరంగల్ ప శ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య సమావేశం అయ్యారు. కాజీపేట రైల్వే డివిజన్, కాజీపేట ఆవరణలో నూతన బస్ స్టాండ్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్ళాలంటే కాజీపేట మీదుగా వెళ్లాల్సి ఉంటుందని ప్రజా రవాణా దృష్ట ప్రజలు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్టాండ్ కోసం ఎన్నో ఏళ్లుగా ప్రజలు కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కాజీపేట విస్తృతమైన రైల్వే కనెక్షన్‌లతో కీలకమైన జంక్షన్, కాజీపేట అని పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ నుండి బోడగుట్ట వైపున ఫుట్ ఓవర్ బ్రిడ్జిని. రైల్వే సమీపంలోని రోడ్డు అండర్ బ్రిడ్జిని మంజూరు చేయాలని రెల్వే జీఎం గారిని అభ్యర్థించారు. ఖాజిపేట ప్రజల కోరిక కాజిపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనీ కోరారు.ఈ సందర్భంగా పై అంశాలపై జీఎం అరుణ్ కుమార్ జైన్ సానుకూలంగా స్పందిస్తూ కాజీపేటలో బస్టాండ్ నిర్మాణానికి స్థల కేటాయింపు విషయాన్నీ పరిశీలిస్తానని, అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, రోడ్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి అతి త్వరలో మంజూరు చేసేందుకు కృషి చెస్తానని తెలిపారు.

## సిపిఐ కార్యాలయంలో ‘ప్రజాపక్షం’ క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/సదాశివపేట: సిపిఐ పార్టీ కార్యాలయంలో ప్రజాపక్షం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం తాజుద్దీన్ మాట్లాడుతూ పేదల పక్షపాతి అయిన ప్రజాపక్షం పత్రిక క్యాండర్‌ను అవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పేదల గొంతుక ,పేదల సమస్యల పరిష్కారం పత్రిక ప్రదాన భూమిక పోషిస్తుందన్నారు. అందరూ ఈ పత్రికను ఆదరించాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి షఫీ , సిపిఐ నాయకులు సాధిక్ అలీ,బుజ్జమ్మ ,అనసూయ , లక్ష్మి , యాదమ్మ , శ్రీను స్వామి విలేకరి పోల వేంకటేశం స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను స్వీకరించి తక్షణ పరిష్కారానికి సూచనలు: ఎస్‌పి



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్.పి. డా.జి.జానకి షర్మిల ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది.సోమవారం రోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ సిఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా,మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ, తెలియజేశారు. ప్రజా సమస్యలుపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.

## అక్రమదారులపై చర్యలకు వినతి



ప్రజాపక్షం/కోటగిరి: సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిజాంసాగర్ కెనాల్‌లో బోంద్రి ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేపట్టిన అక్రమదారులపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతోకు సోమవారం వినతి పత్రం అందచేశారు. కోటగిరి మండల కేంద్రంలోని నిజాంసాగర్ కెనాల్ బోంద్రిని కొందరు అక్రమిస్తున్నారని సిపిఐ పార్టీ నాయకులు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. సమస్యను తెలుసుకున్న సబ్ కలెక్టర్ సమస్యను పరిష్కారిస్తామని హామీనిచ్చారన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్, సిపిఐ నాయకులు జి.రాజు, వై.దత్తు, నల్ల గంగాధర్, గుడాల రాములు పాల్గొన్నారు.

## స్వర్ణ జలాశయం నుండి సాగు నీటిని విడుదలకు విజ్ఞప్తి



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్: స్వర్ణ జలాశయం నుండి సాగు నీటిని విడుదల చేయాలని కోరుతూ నిర్మల్ రూరల్ మండలం వెంగపేట్,తల్వేద,చిట్యాల్ గ్రామాల రైతులు సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు కి వినతి పత్రం అందజేశారు.జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేసిట్లయితే రబీ పంట సాగు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.స్పందించిన డీసీసీ అధ్యక్షుడు వెంటనే ఇరిగేషన్ ఏఈతో మాట్లాడి సాగునీటిని విడుదల చేయాలని సూచించారు.రైతులు శ్రీహరిరావు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు సాధ సుదర్శన్, కుంట వేణుగోపాల్, కుదారపు రాకేష్, పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రజాపక్షం/జన్నారం: మండలంలోని చింతగూడెంకు చెందిన పూదరి నగేష్ (47) శనివారం రాత్రి మోటార్ సైకిల్ పై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నగేష్ గత కొంతకాలంగా బతుకుదెరువు కోసం ఇరాక్ వెళ్లి పనిచేసుకుంటూ గత ఐదు రోజుల క్రితం ఇంటికి తిరిగి వచ్చాడు. ప్రస్తుతం జన్నారంలో నూతనంగా గృహం నిర్మించుకొని నివాసముంటున్న నగేష్ చింతగూడలోని తన తల్లిదండ్రులను కలవడానికి వెళ్లి రాత్రి ఇంటికి వస్తుండగా ప్రధాన రహదారిపై పైడిపల్లి గ్రామ సమీపాన మోటార్ సైకిల్ అదుపు తప్పి పడిపోయి, తీవ్ర గాయాల గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి లచ్చన్న ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ గుండేటి రాజవర్ధన్ తెలిపారు. మృతునికి భార్యతో పాటు పిల్లలు ఉన్నారు. మృతుని శవం వద్ద భార్య, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

## గురుకులంలో ప్రవేశాలు పొందాలని ప్రచారం

ప్రజాపక్షం/బోథ్: తెలంగాణలోని ఎస్సీ,ఎస్టీ,బీసి మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలు పొందాలంటూ బోథ్ గురుకుల పాఠశాల సిబ్బంది ఆటోలో వింత ప్రచారం నిర్వహించారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాలలో ఆటోలో ప్రచారం నిర్వహించారు. ఐదవ తరగతి ప్రవేశాలకు ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 23 వ తేదీ న ప్రవేశ పరీక్ష ఉంటుందని గురుకుల కళాశాల ప్రిన్సిపల్ జి.సంగీత ఒక ప్రకటనలో తెలిపారు.

# కూరగాయల సాగు రైతులకు పెట్టుబడిసాయం

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి





ప్రజాపక్షం/బోధన్: బోధన్ పట్టణం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని రైతు వేదికలో సోమవారం కూరగాయల సాగుపై మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూరగాయాల సాగు సిద్ధంగా ఉన్న రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యామ్నయ పంట కూరగాయాల సాగు చేసే రైతులకు సబ్సీడీ కింద పంట పెట్టుబడి సాయం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బోధన్ నియోకవర్గాన్ని డ్రగ్స్ రహిత నియోకవర్గంగా ఉండేందుకు కృషి చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజిరెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ అంకు సంధ్యా దామోదర్, నాగేశ్వర రావు, నాగేష్ రెడ్డి, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కళాశాల విద్యార్థుల కోసం క్రీడలు నిర్వహించటం అభినందనీయం**

**27 నుండి ఫిబ్రవరి 2వరకు కొనసాగనున్న క్రికెట్ లీగ్**

మానసిక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని అలాంటి క్రికెట్ లీగ్ వెల్‌నెస్ హాస్పిటల్స్ నిర్వహించటం అభినందనీయమని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో వెల్‌నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్‌ను ఎండి సుమన్‌గౌడ్, అసద్‌ఖాన్, వివేక్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా 24 టీమ్స్ పేర్లు నమోదు చేసుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విచ్చేసి క్రికెట్‌ను మొదటి రోజు అట్టహాసంగా ప్రారంభించారు. బ్యాటింగ్ చేస్తూ చదువుకునే రోజులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని గమనించి క్రికెట్ లీగ్‌ను ఏర్పాటు చేసిన వెల్‌నెస్ హాస్పిటల్స్ వైస్‌ప్రెసిడెంట్ బోదు అశోక్‌కుమార్‌ను అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నామన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో తాహెర్‌బిన్ హందాన్,గంగాధర్, కేశ వేణు, మోహన్ రెడ్డి, అంతరెడ్డి రాజారెడ్డి, భార్గవ్, రాజేష్, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బిటీ రోడ్ల మరమ్మతులకు రూ.15 కోట్లు

ఎమ్మెల్యే డా॥ మైనంపల్లి రోహిత్



ప్రజాపక్షం/మెదక్‌ప్రతినిధి: మెదక్ నియోజక వర్గంలో బిటి రోడ్ల పునరుద్ధణకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖ నుండి జి.ఓ.నెం. 59 ద్వారా 15 కోట్ల 10 లక్షల రూపాయలను విడుదల చేసినట్లు మెదక్ ఎమ్మెల్యే డా॥ మైనంపల్లి రోహిత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి నిధులతో మెదక్ నియోజక వర్గంలో దాదాపు 30.72 కి.మీ.,ల రోడ్లకు మోక్షం లభించనున్నట్లు ఆయన తెలియజేశారు. కాగా మెదక్ మండలంలోని నవాపేట నుండి మగ్దుంపూర్ బిటి రోడ్డు పనులకు 172 లక్షలు, పాపన్నపేట మండలంలోని నాగ్సాన్ పల్లి నుండి కొడపక వరకు బిటి రోడ్డు పనులకు 196 లక్షలు, రామాయంపేట మండలంలోని పిడబ్ల్యుడి రోడ్డు నుండి ఆరేపల్లి మీదుగా లక్ష్మాపూర్, కాట్రియాల్, దంతేపల్లి బిటి రోడ్డు పనులకు 424 లక్షలు, చిన్నశంకరంపేట మండలంలోని జడ్పి రోడ్డు నుండి మిర్జాపల్లి తాండ బిటి రోడ్డు పనులకు 50 లక్షలు, హావేలిఘణాపురం మండలంలోని పిడబ్ల్యుడి రోడ్డు పొల్కంపేట మీదుగా బూర్గుపల్లి వరకు బిటి రోడ్డు పనులకు 508 లక్షలు, చిన్నశంకరంపేట మండలంలోని పిడబ్ల్యుడి రోడ్డు చందంపేట నుండి రుద్రారం వరకు బిటి రోడ్డు పనులకు 80 లక్షలు, నిజాంపేట మండలంలోని నిజాంపేట మండలం నుండి చల్మెడ వరకు బిటి రోడ్డు పనులకు 80 లక్షల రూపాయలు కేటాయించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మెదక్ నియోజక వర్గంలో రోడ్డు లేని పల్లెగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే రోహిత్ తెలియజేశారు.

## సమర్థవంతంగా బేటీ బచావో-బేటీ పడావో





కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: బేటి బచావో బేటి పడావో కార్యక్రమం మెదక్ జిల్లాలో సమర్థవంతంగా అమలవుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశాల్లో మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో మిషన్ శక్తి మహిళా సాధికారిత కేంద్రం బేటి బచావో బేటి పడావో 10 సం॥ దశాబ్ది ఉత్సవాల భాగంగా బేటి బచావో బేటి పడావో పోస్టర్స్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ ఆవిష్కరించి మరియు సిగ్నేచర్ క్యాంప్ ఈ కార్యక్రమంలోముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలిక విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని మహిళా సాధికారత దిశగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్‌డిఓ శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారిని హైమావతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్, డిఇఓ, రాధా కిషన్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి, డిపిఓ యాదయ్య, డిఆర్‌డిఓ శ్రీనివాసరావు, ఇతర శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజల ఆమోదంతోనే సంక్షేమ పథకాలు అమలు

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/హాజీపూర్: ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల ఆమోదంతోనే అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా జిల్లాలోని హాజీపూర్ మండలం ర్యాలీ, గడ్ పూర్ గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, హాజీపూర్ మండల తహసిల్దార్ శ్రీనివాస్ రావు లతో కలిసి లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందజేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో అనేక కార్యక్రమాలు చేపట్టి సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజా పాలన, కులగణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాలలో అందిన దరఖాస్తుల ప్రకారంగా అర్హుల జాబితాను రూపొందించి గ్రామ సభలు, వార్డు సభలలో చదివి వినిపించి జాబితాలో రాని అర్హుల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో నూతన రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆదివారం నుండి అమలు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో అర్హులైన లబ్ధిదారులకు సంబంధిత మంజూరు పత్రాలు అందించడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా పథకంలో వ్యవసాయ సాగుకు యోగ్యం అయిన భూములకు సంవత్సరానికి 12 వేల అందించడం జరుగుతుందని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ పథకంలో 2023/24 సంవత్సరంలో 20 రోజులు, అంతకంటే ఎక్కువ పనిచేసిన వారికి సంవత్సరానికి 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు.ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు,సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు.ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందిన, ప్రత్యేకాధికారులంతా ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ, పదవతరగతి పరీక్షలు రాయబోవు విద్యార్థుల సామర్థ్యాలను పరిక్షించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, సిబ్బంది, శనివారాలు శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండలాల్లో పిహెచ్ సిలు,సబ్ సెంటర్ల నిర్మాణానికి స్థలాలను గుర్తించాలని తహసీల్దార్లు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.



## కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు వినతిపత్రం ఆందజేశారు. అనంతరం ఎఐటియుసి మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ కన్వీనర్ చిర్ర దేవేందర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, జజ్జిఖాన, ఖానాపూర్ సిహెచ్‌సి, బైంసా సిహెచ్ సి ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న పని శనిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, జిల్లా ఏరియా హాస్పిటల్ అవడంతో దాదాపు 350 బెడ్స్ పెరిగాయని వాటికి అనుకూలంగా కార్మికులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు ఎదుర్కొన్న సమస్యలపై ఏజెన్సీ యాజమాన్యాల దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్మికులకు పని భారం పెరిగి మానసికంగా అనారోగ్యానికి గురవుతున్నారని,వెంటనే వీటిపై దృష్టి సారించి కాంటాక్ట్స్ ఏజెన్సీ యాజమాన్యాలకు ఆదేశాల అందజేయాలని, పది రోజులలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి , రాజు, సత్యమ్మ, పుష్ప, పద్మలు ఉన్నారు.

## రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు: ఎమ్మెల్యే పవార్



ప్రజాపక్షం/బైంసా: పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ముధోల్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి 7కోట్ల 80 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు.తానూర్ మండలంలో తానూరు నుండి హుండా రోడుకు 5కోట్ల 90 లక్షల రూపాయలు నిధులు,కుంటాల మండలం లో కుంటాల నుండి దౌనెల్లి మహారాష్ట్ర సరిహద్దు వరకు 1 కోటి 90 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు చెప్పారు.ఈ సందర్భంగా సంబంధిత శాఖ మంత్రికి,ముఖ్యమంత్రికి ధన్యవాదములు తెలిపారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గోడవెల్లి గ్రామంలో గల మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలుర పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, సరుకుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, వంట సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులు వినియోగించాలని తెలిపారు. భోజనం వండక ముందు, వండిన తరువాత ఫోటోలు క్రమం తప్పకుండా తీయాలని, పాఠశాల కమిటీ వండిన భోజనాన్ని విద్యార్థులు తినకముందు రుచి చూడాలని తెలిపారు. పాఠశాల, కళాశాల భవనాన్ని, వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు సరిపడ స్నానపు గదులు, మూత్రశాలలు, సౌచాలయాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రణాళికాబద్ధంగా సిలబస్ పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# అర్హులకు ఏదీ భరోసా..?


**లబ్దిదారుల ఎంపికలో నిబంధనల ఉల్లంఘన..!**

**ఫీల్డ్ గ అసిస్టెంట్ అధికారుల నిర్లక్ష్యమే కారణమా..!**

**రీ సర్వే చేయాలి...!**

**అనర్హులను జాబితా నుండి తొలగించాలి..**

**ఉద్యోగాలు,భూములు ఉన్న కుటుంబాలకే లబ్ధి...!**



ప్రజాపక్షం/నిర్మల్‌ప్రతినిధి: భూమి లేని నిరుపేద కుటుంబాలకు భరోసా కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆత్మీయ భరోసాను అధికారులు చేసిన తప్పిదాలకు ప్రభుత్వానికి మచ్చ తెచ్చేలా ఉంది.ఆత్మీయ భరోసా పొందాలంటే,జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సంవత్సరానికి 24 రోజులు పని చేస్తే వారికి ఆత్మీయ భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.కాగా పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో అధికారులకు ఎంపిక చేసి అర్హులకు అన్యాయం చేస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.గ్రామ సభలలో సరిగా పరిశీలన చేయకుండా భూమి ఉన్న,ప్రభుత్వ ఉద్యోగులు ఉన్న వారిని కూడా ఆత్మీయ భరోసాకు ఎంపిక చేయడం అధికారులు నిర్లక్ష్యమే కదా..?కొన్ని గ్రామ సభలలో అధికారులు చూసి చూసి చూడనట్లు వ్యవహరించడం,ఎన్నికల్లో బదిలీపై వచ్చినం కదా ఎవరికి నొప్పి వద్దు అనే విధంగా వ్యవహరించిన మండల అధికారులు ప్రభుత్వానికి మండల అధికారులు ప్రభుత్వానికి మచ్చ తెచ్చే విధంగా ఇటు ఉపాధి హామీ అధికారులు గ్రామ కార్యదర్శులు తప్పుడు సమాచారం ఇచ్చి అనర్హులనే ఎంపిక చేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇందిరమ్మ ఇళ్లను,రేషన్ కార్డులను రెవెన్యూ శాఖ చూడగా,రైతు భరోసాను వ్యవసాయ శాఖ,ఆత్మీయ భరోసాను ఉపాధి అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శి పరిధిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు.గ్రామాలలో ఎవరికి వ్యతిరేకంగా వెళ్లకుండా భూమి ఉన్నా లేకపోయినా వారిని ఎంపిక చేసి ఆత్మీయ భరోసా పథకాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారని విమర్శలు,గ్రామ సభలలో అనర్హులను తొలగించాలని చూచించినప్పటికీ అధికారులు ఆ పనులు చేపట్టకపోవడంతో లోపాయికారీ ఒప్పందం జరిగిందా అని అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.కొన్ని గ్రామాలలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఒప్పందం చేసుకొని లబ్ధిదారులను తొలగించకుండా కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.ఒక కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్న వారి తల్లికి ఆత్మీయ భరోసా రావడం,భర్తకు భూమి ఉన్న భార్యకు ఆత్మీయ భరోసా రావడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.అధికారులు తెలిసి చేస్తున్నారా లేక తెలియక చేస్తున్నారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.అధికారులు కావాలనే తప్పటడుగులు వేస్తూ ప్రభుత్వానికి మచ్చ తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని,కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ఆత్మీయ భరోసా పథకాన్ని రీ సర్వే చేసి అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్లు వ్యక్తం అవుతున్నాయి.ఒకవేళ పథకం అమలై లబ్ధిదారులకు డబ్బులు వస్తే మాత్రం గ్రామాలలో అధికారులను నిర్బంధించే పరిస్థితులు కూడా లేకపోలేదు.ఫీల్ అసిస్టెంట్ల పై కూడా భౌతిక దాడులు చేసేందుకు గ్రామాలలో కొందరు నిర్ణయించుకున్నట్లు సమాచారం.ఇకనైనా సర్వే నిర్వహించిన అధికారులు ఫ్రీ సర్వే చేసి అర్హులను గుర్తించాలని పలువురు కోరుతున్నారు.

క్రీడ

# తొలి భారత పేసర్‌గా రికార్డ్!

## 'ఐసిసి టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్'గా బుమ్రా



భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్‌ను ప్రతిష్ఠాత్మక ఐసీసీ అవార్డు వరించింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. 2024 సంవత్సరానికిగాను టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు అతను ఎంపికయ్యాడు. జో రూట్ (ఇంగ్లాండ్, కమిందు మెండిస్ (శ్రీలంక), హ్యారీ బ్రూక్ (ఇంగ్లాండ్‌లను వెనక్కినెట్టి బుమ్రా ఈ అవార్డును దక్కించుకున్నాడు. ఈ క్రమంలోనే టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న ఆరో భారత క్రికెటర్‌గా బుమ్రా నిలిచాడు. రాహుల్ ద్రవిడ్ (2004), గౌతమ్ గంభీర్ (2009), వీరేంద్ర సెహ్వాగ్ (2010), రవిచంద్రన్ అశ్విన్ (2016), విరాట్ కోహ్లీ (2018) బుమ్రా కంటే ముందు ఈ అవార్డు అందుకున్నారు. 2024 ఐసీసీ టెస్టు జట్టులోనూ బుమ్రా చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. గతేడాది టెస్టుల్లో బుమ్రా అద్భుతమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. 13 మ్యాచ్‌ల్లో 71 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలోనే 2024లో సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించాడు.

### 'వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్'గా స్మృతి మంధాన



భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన 2024 సంవత్సరానికిగాను వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు గెలుచుకుంది. లారా వోల్వార్డ్ట్ (దక్షిణాఫ్రికా), చమరి ఆటపట్టు (శ్రీలంక), అన్నాబెల్ సదర్లాండ (ఆస్ట్రేలియా)తో పోటీపడి ఈ అవార్డును సొంతం చేసుకుంది. 28 ఏళ్ల మంధాన ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును గెలుచుకోవడం ఇది రెండోసారి. 2018లో మొదటిసారిగా వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైంది. ఈ క్రమంలోనే మహిళల క్రికెట్‌లో సుజీ బేట్స్ (న్యూజిలాండ్ తర్వాత రెండోసారి ఈ అవార్డు అందుకున్న రెండో ప్లేయర్‌గా స్మృతి మంధాన నిలిచింది. మంధాన 2018, 2021 సంవత్సరాల్లో ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సొంతం చేసుకుంది. భారత వైస్ కెప్టెన్‌గా ఉన్న మంధాన గతేడాది వన్డేల్లో అదరగొట్టింది. 13 మ్యాచ్‌ల్లో 57.46 సగటుతో 747 పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా నిలిచింది. ఇందులో నాలుగు సెంచరీలు, 3 హాఫ్ సెంచరీలు న్నాయి. పురుషుల విభాగంలో వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు అఫ్గానిస్థాన్ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఎంపికయ్యాడు.

## క్షమాపణలు చెప్పిన నోడిర్‌బెక్



టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్‌లో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్ మాస్టర్ నోడిర్‌బెక్ యాకుబ్బోయేవ్ వ్యవహరించిన తీరు వాదానికి దారితీసింది. గేమ్ సందర్భంగా భారత గ్రాండ్ మాస్టర్ వైశాలితో కరచాలనం చేయడానికి యాకుబ్బోయేవ్ నిరాకరించాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో.. అతడిపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో జరిగిన దానికి చింతిస్తూ ఉజ్బెక్ గ్రాండ్‌మాస్టర్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా క్షమాపణలు చెప్పాడు. వైశాలిపట్ల తనకు ఎలాంటి అగౌరవం లేదని.. కొన్ని కారణాల వల్ల చేయి ఇవ్వలేదని పేర్కొన్నాడు.

'మహిళలు, భారత చెస్ క్రీడాకారుల పట్ల నాకు గౌరవం ఉంది. నా ప్రవర్తన వలన ఎవరికైనా ఇబ్బంది కలిగి ఉంటే నన్ను క్షమించండి అని అన్నాడు.

**అసలేం జరిగిందంటే..** నెదర్లాండ్స్‌లోని విజ్కాంజీ వేదికగా టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్ జరుగుతోంది. ఇందులో భాగంగా నాలుగో రౌండ్‌లో నోడిర్‌బెక్, వైశాలి ముఖాముఖి తలపడ్డారు. ఆనవాయితీ ప్రకారం గేమ్ ప్రారంభానికి ముందు వైశాలి కరచాలనం చేసేందుకు ముందుకు చాచగా.. నోడిర్‌బెక్ అవసరం లేదన్నట్లుగా తన కుర్చీలో కూర్చున్నాడు. ఈ గేమ్‌లో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్ మాస్టర్‌పై వైశాలి విజయం సాధించింది.

## బిబిఎల్ ఛాంపియన్‌గా.. హోబర్ట్ హరికేన్స్

### వార్నర్ టీమ్ ఓటమి!



ఆస్ట్రేలియా టీ20 ఫ్రాంచైజీ టోర్నీ బిగ్ బాష్ లీగ్ 202425లో హోబర్ట్ హరికేన్స్ జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్లో హోబర్ట్ హరికేన్స్ 7 వికెట్ల తేడాతో డేవిడ్ వార్నర్ సారథ్యంలోని సిడ్నీ థండర్‌ను ఓడించింది. ఈ గెలుపుతో నాథన్ ఎల్లిస్ సారథ్యంలోని హోబర్ట్ హరికేన్స్ తొలి బీబీఎల్ టైటిల్‌ను అందుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సిడ్నీ థండర్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 182 పరుగులు చేసింది. జాసన్ సంఘా(42 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 67), డేవిడ్ వార్నర్(32 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 48) రాణించారు. హోబర్ట్ హరికేన్స్ బౌలర్లలో నాథన్ ఎల్లిస్(3/23), రిలీ మెరిడిత్(3/27) మూడేసి వికెట్లు తీసారు. అనంతరం హోబర్ట్ హరికేన్స్ 14.1 ఓవర్లలోనే 3 వికెట్లకు 185 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. మిచెల్ ఓవెన్(42 బంతుల్లో 6 ఫోర్లు, 11 సిక్స్‌లతో 108) సెంచరీతో చెలరేగగా.. మాథ్యూ వెడ్ 17 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 32 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. సిడ్నీ థండర్ బౌలర్లలో తన్వీర్ సంఘా(2/42) రెండు వికెట్లు తీయగా.. టామ్ ఆండ్రూస్ ఓ వికెట్ పడగొట్టాడు. సెంచరీతో చెలరేగిన మిచెల్ ఓవెన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది.

ఈ మ్యాచ్‌లో శతకం ద్వారా మిచెల్ ఓవెన్ సరికొత్త చరిత్ర లిఖించాడు. 39 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్న మిచెల్.. బీబీఎల్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. మిచెల్ ఓవెన్ కంటే ముందు క్రైగ్ సిమ్మన్స్ కూడా 39 బంతుల్లోనే శతకాన్ని అందుకున్నాడు. ఈ జాబితాలో గ్లేన్ మ్యాక్స్‌వెల్ (41 బంతులు), జోష్ బ్రౌన్ (41 బంతులు) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.

## ఫిబ్రవరి 3న 'కన్నప్ప' నుంచి

# ప్రభాస్ లుక్




విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' ప్రమోషన్స్‌లో టీం గేర్ పెంచేసింది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లతో ఒక్కసారిగా అంచనాలు పెరిగిపోయాయి. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు భారీ ఎత్తున నిర్మిస్తున్న కన్నప్ప చిత్రానికి సంబంధించిన అసలు సిసలు అప్డేట్ రాబోతోంది. ఈ మేరకు చిత్రయూనిట్ తాజాగా ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఫిబ్రవరి 3న డార్లింగ్ ప్రభాస్ పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు రిలీజ్ చేసిన పోస్టర్‌లో ప్రభాస్‌ను అలా కొద్దిగా చూపించి ఊరించారు. ఈ పోస్టర్‌లోని త్రిశూలం, ప్రభాస్ చూపులు, నుదుట విబూదిని చూస్తుంటే ఈ లుక్ కన్నప్ప చిత్రానికే హైలెట్‌గా నిలిచేలా ఉంది. కన్నప్ప చిత్రం ఏప్రిల్ 25న ఆడియెన్స్ ముందుకు రాబోతోన్న సంగతి తెలిసిందే. కన్నప్ప చిత్రంలో అక్షయ్ కుమార్, మోహన్ లాల్, మోహన్ బాబు, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, ప్రీతి ముకుందన్ ఇలా ఎంతో మంది భారీ తారాగణం నటించింది. ఈ సినిమాకు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు.

రీల్

## అఘోర ఎంట్రీ సీక్వెన్స్‌కు సన్నాహాలు



నటసింహం బాలయ్య – బోయపాటి శ్రీను కాంబినేషన్లో రాబోతున్న 'అఖండ 2 – తాండవం' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు జరిగాయి. కాగా తాజాగా ఈ సినిమా షూట్ కి రెడీ అవుతుంది టీమ్. వచ్చే నెల రెండో వారం నుంచి బాలయ్య పై రామోజీ ఫిల్మ్ సిటీలో అఘోర పాత్రకు సంబంధించిన ఎంట్రీ సన్నివేశాలను షూట్ చేస్తారట. అందుకు సంబంధించిన సెట్స్ ను ప్రస్తుతం వేస్తున్నట్లు తెలుస్తోంది. అన్నట్టు ప్రస్తుతం ఈ సినిమాలో నటించే నటీనటుల ఎంపిక పై దర్శకుడు బోయపాటి దృష్టి పెట్టారు. ఆల్ రెడీ, ఇప్పటికే పలు కీలక పాత్రల్లో ఇతర భాషల నటులను తీసుకోవాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారు. కాగా ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రొడ్యూస్ చేస్తున్నారు. థమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. బోయపాటి శ్రీను – బాలయ్య కాంబినేషన్లో హ్యాట్రిక్ విజయాలు నమోదయ్యాయి. దీంతో 'అఖండ 2 – తాండవం' పై రెట్టింపు అంచనాలు ఉన్నాయి.

## సినిమాలు వదిలేయాలనుకున్నా..


వరుణ్‌సందేశ్, విజయ్ శంకర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'రాచరికం'. అప్సరా రాణి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. సురేష్ లంకపల్లి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఫిబ్రవరి 1న గ్రాండ్‌గా విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే లాంచ్ చేసిన ఈ మూవీ ట్రైలర్ మంచి స్పందన వస్తోంది. తాజా మేకర్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఏర్పాటు చేశారు.

నేను సినిమాలు వదిలేయాలనుకున్నానంటూ కామెంట్ చేసి టాక్ ఆఫ్ ది




టౌన్‌గా నిలిచింది. ఈవెంట్‌లో అప్సర రాణి మాట్లాడుతూ.. రాచరికంలో ఇంత మంది పాత్రను ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. నాకు ఒకే రకమైన పాత్రలొస్తున్నాయని సినిమాలు వదిలేయాలనుకున్నా. ఆ టైంలోనే ఆ దేవుడు వీళ్లను నా దగ్గరకు పంపించాడు. విజయ్ శంకర్‌తో రాచరికం సినిమాలో నటించడం సంతోషంగా ఉందని చెప్పుకొచ్చింది. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ.. రాచరికంలో నెగెటివ్ రోల్ చేశా. మైఖేల్ తర్వాత మళ్లీ ఈ పాత్ర నన్ను ఎక్జయిటింగ్ చేయడం వల్లే సినిమాలో నటించానన్నాడు. రాచరికం టైటిల్‌లోనే రాయల్టి ఉంటుందని.. రాయలసీమ అంటే ఏంటో ఈ సినిమా చూపిస్తుందని హీరో విజయ్ శంకర్ అన్నాడు. ఈ సినిమాకు రామ్ ప్రసాద్ రాసిన డైలాగ్స్ 'గూస్ బంప్స్' తెప్పించేలా సాగుతాయన్నాడు.

## నేడు 'తండేల్' ట్రైలర్ రిలీజ్




అక్కినేని యంగ్ హీరో నాగచైతన్య నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'తండేల్' ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 7న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. దర్శకుడు చందు మొండేటి డైరెక్ట్ చేస్తున్న ఈ వింటేజ్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను క్రియేట్ చేసింది. ఇక ఇప్పటివరకు రిలీజ్ అయిన ఈ మూవీ కంటెంట్ ఈ అంచనాలను పెంచాయి. ఇక ఈ సినిమా ట్రైలర్‌ను నేడు సాయంత్రం 6.03 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. అయితే, తాజాగా ఈ ట్రైలర్ ప్రిల్యూడ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'ఈ పండుగ నుండి రాజుగాడే మన తండేల్.. తండేల్ అంటే..?' అనే డైలాగుతో ఈ ప్రిల్యూడ్ వీడియో ఈ ట్రైలర్‌పై అంచనాలను అమాంతం పెంచేసింది.

మరి 'తండేల్' అంటే ఏమిటో తెలియాలంటే ఈ ట్రైలర్ చూసే వరకు వెయిట్ చేయాల్సిందే అంటున్నారు చిత్ర యూనిట్. ఈ సినిమాలో అందాల భామ సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ సినిమాకు మేజర్ అసెట్‌గా మారనుంది.

# ఆహార పదార్థాల సరఫరా కేంద్రీకృతం

### అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలలోనూ ఒకే మెనూ

### రాష్ట్ర ప్రభుత్వానికి పలు సిఫార్సుల నివేదికను అందజేసిన తెలంగాణ విద్యా కమిషన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలలో ఒకే మెనూను ఏర్పాటు చేయాలని, ఆహార పదార్థాల సరఫరాను కేంద్రీకృతం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో ఇటీవల కాలంలో ప్రభుత్వ విద్యాసంస్థలలో ఆహార భద్రత, నాణ్యతకు సంబంధించి జరిగిన సంఘటనల నేపథ్యంలో తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి పలు సూచనలతో నివేదికను సమర్పించింది. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం, ప్రభుత్వ విద్య సంస్థలలో ఆహార నాణ్యత, భద్రతపై పలు సిఫార్సులతో కూడిన నివేదికను కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేశ్, జ్యోత్స్నశివారెడ్డి బృందం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారికి సోమవారం సమర్పించారు. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా వందల ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు (గురుకులాలు) హాస్టల్స్, కెజిబివిలు, అంగన్వాడి సెంటర్లను సందర్శించి వివిధ వర్గాలతో విస్తృతమైన చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ఆహార నాణ్యత, భద్రత, మౌలిక సదుపాయాలు, పారిశుధ్యానికి సంబంధించిన లోటుపాట్లను వారు క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయి పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన పలు సిఫార్సులతో కూడిన నివేదికను రూపొందించించారు. సుమారు 50 పేజీలతో కూడిన ఈ నివేదకలో కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి పలు సిఫార్సులను చేసింది. మెస్‌చార్జీలను మరో రూ.2లను పెంచాలని, అన్ని విద్యా సంస్థలలో ఒకే తరహా పరిశుభ్రమైన ఆహార పదార్థాలను వండాలని సిఫారసు చేసినట్టు తెలిసింది. ఆహార పదార్థాల సరఫరాను కేంద్రీకృతం చేయాలని, టెండర్ల ను ఆహ్వానించాలని కమిషన్ సూచించినట్టు తెలిసింది.

## కెటిఆర్ ఓర్వలేకపోతున్నారు..

### మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నూతన పథకాలతో గ్రామాల్లో పండగ వాతావరణం కన్పిస్తుంటే మాజీ మంత్రి కెటిఆర్ ఓర్వ లేకపోతున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క విమర్శించారు. కొత్త పథకాలను కేవలం ఒక్క గ్రామానికే పరిమితం చేసినట్టుగా కెటిఆర్ భ్రమలు కల్పిస్తున్నారని, ఆయనకు ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ అని ఎద్దేవ చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి మండలంలోని ఒక గ్రామంలో నాలుగు నూతన పథకాలను విజయవంతంగా ప్రారంభిస్తే కెటిఆర్ తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు. ఒక గ్రామంలో పథకాల అమలును లాంఛనంగా మొదలు పెట్టి, ఇతర గ్రామాలకు విస్తరిస్తారన్న ఇంగిత జ్ఞానం కూడా లేకపోతే ఏలా అని ఆమె కెటిఆర్‌ను ప్రశ్నించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీతక్క సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సబ్సిడి గ్యాస్ సిలిండర్ పథకాలు అర్హులందరికీ అందడం లేదా? అని ప్రశ్నించారు. ప్రజలను రెచ్చ గొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడమే కెటిఆర్ పని అని మండిపడ్డారు..

## ఘనంగా కెఎస్ వ్యాస్ స్మారక ఉపన్యాసం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడం, విస్తరణను నివారించడంలో తెలంగాణ పోలీసులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని, అందులో భాగంగా కొన్ని సందర్భాల్లో పోలీసు అధికారులు తమ ప్రాణాలను సైతం కోల్పోయారని పలువురు వక్తలు అన్నారు. నక్సలైట్ల తూటాలకు బలైన ఐపిఎస్ అధికారి 25వ కెఎస్ వ్యాస్ 'స్మారక ఉపన్యాస సభ' తెలంగాణ పోలీసు అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసిసిసిలో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిధిగా వచ్చిన అలహాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజేన్ హర్షే 'ప్రపంచీకరణఉగ్రవాదం మధ్య సంక్లిష్ట సంబంధం'పై ప్రసంగించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ గ్రేహౌండ్స్ ఆవశ్యకతను ఊహించి స్థాపించిన కె.ఎస్.వ్యాస్ శాశ్వత ప్రభావంపై తన దృక్పథాన్ని పంచుకున్నారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్తా మాట్లాడుతూ కె.ఎస్.వ్యాస్ జ్ఞాపకాలను సజీవంగా ఉంచడానికి, ప్రస్తుత తరం వర్ధమాన పోలీసు అధికారులను ప్రేరేపించడానికి అకాడమీ నిబద్ధతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పోలీసు అధికారులు, రిటైర్డ్ ఐపిఎస్ అధికారులు బి.శివధర్ రెడ్డి, శిఖా గోయెల్, డాక్టర్ అనిల్ కుమార్, విజయ్ కుమార్, ఎం. స్టీఫెన్ రవీంద్ర, ఎం రమేష్ రెడ్డి, జి.సుధీర్ బాబు, సుమతి, పరిమళ హననుతన్ హాజరయ్యారు. వ్యాస్ సతీమణి అరుణ వ్యాస్, కుమారుడు, హెచ్ఎండిఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీవాత్సవ కోట కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పెంచాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

శాలరీ అమలుకుగాను త్రిసభ్య కమిటీని వేశారని, కానీ ఇంత వరకు దాని నివేదికను అమలు చేయకపోవడం బాధాకరమని చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి వీలైనంత త్వరగా సెకండ్ ఎఎన్ఎంలకు 100 శాతం గ్రాస్ శాలరీని ఇవ్వాలని ఆయన కోరారు. కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటాలకు సిపిఐ సంపూర్ణ మద్దతునిస్తుందని తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు మాట్లాడుతూ అనేక కష్టనష్టాలను లెక్క చేయకుండా పేద ప్రజలకు సేవలందిస్తున్న ఎఎన్ఎంల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెండవ ఎఎన్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జక్కుల పద్మ, బోయిని శ్యామల, ఉపాధ్యక్షులు పి.జయమ్మ, శీలం నాగశేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అమల్లోకి యుసిసి

(మొదటి పేజీ తరువాయి)

సమాన చట్టాలను కల్పించే యుసిసి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ ఘనత రాష్ట్ర ప్రజలందరికీ దక్కుతుందన్నారు. ఉమ్మడి పౌరస్మృతి ద్వారా పౌరులందరికీ సమానమైన హక్కులు, బాధ్యతలు దక్కేలా చూస్తామని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి వెల్లడించారు. నేడు ఉత్తరాఖండ్‌కే కాకుండా యావత్ దేశానికి చారిత్రాత్మకమైన రోజని చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతి అమలుతో నిజమైన మహిళా సాధికారత కనిపిస్తుందని పేర్కొన్నారు. వారి హక్కులను కాలరాసే బాల్య వివాహాలు, ట్రిపుల్ తలాక్, విడాకులు, ఆస్తుల వారసత్వం, బహుభార్యత్వం వంటి దురాచారాలను పూర్తిగా రూపుమాపడానికి యుసిసి తోడ్పడుతుందని ధామి తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతి ఏ మతానికి, వర్గానికి వ్యతిరేకం కాదనే విషయాన్ని స్పష్టం చేయాలనుకుంటున్నట్లు వివరించారు. గత ఏడాది ఫిబ్రవరి 6న ఉత్తరాఖండ్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో బిజెపి ప్రభుత్వం యుసిసి బిల్లును ప్రవేశపెట్టింది. ఒక రోజు తర్వాత ఫిబ్రవరి 7న అసెంబ్లీ మెజారిటీతో ఆమోదించింది. తర్వాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మార్చి 13న దానిపై సంతకం చేశారు. దీంతో ఉత్తరాఖండ్ భారతదేశంలో యుసిసి అమలు చేసిన తొలి రాష్ట్రంగా నిలిచింది.

**యుసిసిలోని కీలక అంశాలు!**

* వివాహం, విడాకులు, ఆస్తుల వారసత్వం, ఆస్తి వీలునామాల రూపకల్పన వంటి అంశాల్లో లింగ సమానత్వాన్ని సాధించేలా ఉంటుంది.
* మతాలతో సంబంధం లేకుండా ఉత్తరాఖండ్‌లో లింగ సమానత్వాన్ని సాధించేందుకు దోహదం చేయనుంది.
* సహ జీవన సంబంధాలను క్రమబద్ధీకరించే నిబంధనలను యుసిసిలో పొందుపరిచారు. సహజీవనం చేస్తున్నవారు ఇకపై రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. ఇందుకోసం ప్రభుత్వం తరఫున ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేశారు.
* సైనికులు, వాయుసేనలో పని చేస్తున్నవారు, యుద్ధంలో నిమగ్నమై ఉన్నవారు, నౌకాదళంలో ఉన్నవారి కోసం ప్రివిలేజ్డ్ విల్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. వారు అత్యవసర పరిస్థితుల్లో ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని వీలునామాను వేగంగా, సులభంగా తయారు చేయించవచ్చు.
* అన్ని మతాలకు చెందిన స్త్రీ, పురుషులకు కనీస వివాహ వయస్సు ఒకేలా ఉంటుంది.
* అన్ని మతాల్లో బహుభార్యత్వాన్ని నిషేధించారు.
* హలాల్ విధానంపై నిషేధం విధించారు.

# సమ్మె సైరన్

(మొదటి పేజీ తరువాయి)

కానీ లేక ఆ తరువాత మొదటి డ్యూటీ నుంచి సమ్మెకు దిగుతామని జెఎసి ఛైర్మన్ ఇదురు వెంకన్న నోటీసులో తేల్చి చెప్పారు. అయితే ఆర్‌టిసి జెఎసి కార్మిక నేతలు భారీ ఎత్తున బస్ భవన్ వద్దకు రావడంతో పోలీసులను భారీ సంఖ్యలో మోహరించారు. దీంతో బస్ భవన్ వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

**ఆర్‌టిసిని ప్రైవేట్ పరం చేసే దిశగా ప్రభుత్వ ప్రయత్నాలు : ఈదురు వెంకన్న**

ఆర్‌టిసిని ప్రైవేట్‌పరం చేసే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని టిజిఎస్ ఆర్‌టిసి జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఛైర్మన్ ఇదురు వెంకన్న విమర్శించారు. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణను ప్రైవేట్ కంపెనీలు చేస్తున్నాయని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆర్‌టిసికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహించకుండా, యూనియన్లను రద్దు చేసి, కార్మికులకు పనిగంటలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతుందన్నారు. ఆర్‌టిసి సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నుండి మంత్రుల వరకు అందరిని కలిశామని తెలిపారు. అయినా తమ సమస్యలను పరిష్కరించలేదన్నారు. గత ప్రభుత్వం విలీన ప్రక్రియను 90 శాతం పూర్తి చేసిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ఈదురు వెంకన్న ప్రశ్నించారు. 2021 పిఆర్‌సిని ప్రకటించి, 2017 బకాయిలు చెల్లించాలన్నారు. 14 నెలలు సమయం ఇచ్చామని, ఇక వేచి ఉండేందుకు తమకు ఓపిక లేదన్నారు. ఆర్‌టిసిని అభివృద్ధి చేస్తామని చెప్పి, ప్రైవేట్ బస్సులు ఆర్‌టిసిలో ప్రవేశపెట్టి, సంస్థ మనుగడకే ప్రమాదం కలిగేలా చేస్తున్నారని ఈదురు వెంకన్న మండిపడ్డారు.

**ఎన్నికల హామీలు అమలు చేయడంలో రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం..**

ఎన్నికల సమయంలో ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తుందని ఈదురు వెంకన్న మండిపడ్డారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న ప్రతిపాదనను మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. ఆర్‌టిసి కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇలానే నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వానికి తమ తడాఖా ఏంటో చూపిస్తామని ఈదురు వెంకన్న హెచ్చరించారు. ఐదేండ్ల తర్వాత సమ్మె చేయడం ఇదే తొలిసారి అని గుర్తు చేశారు. ఆర్‌టిసిని ప్రైవేట్‌పరం చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయని, ఒక వేళ అదే కనుక జరిగితే, వేలాది మంది ఆర్‌టిసి కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుందని ఈదురు వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు.



**ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో కార్పొరేట్ సంస్థలకు ఆర్‌టిసి : థామస్ రెడ్డి**

ఆర్‌టిసి పరిరక్షణకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ సోమవారం సమ్మె నోటీస్ ఇవ్వాలని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి గతంలోనే నిర్ణయించిందని జెఎసి వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి తెలిపారు. ఈనెల 22న బుధవారం ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా, టిజిఎస్ ఆర్‌టిసి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుచేయలేదని విమర్శించారు. ప్రైవేట్ సంస్థల ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో కార్పొరేట్ సంస్థలకు ఆర్‌టిసిని కట్టబెడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చెప్పినట్టు ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. కార్మికులకు పదవీవిరమణ ప్రయోజనాలు పూర్తి స్థాయిలో కల్పించాలన్నారు. 15 రోజుల్లో యాజమాన్యం స్పందించి తమ డిమాండ్స్ నెరవేర్చాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలను కలిసి, సమ్మెకు మద్దతు కూడగడుతామన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com